సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 142

సోమవారం 12-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



నాపై అమెరికా కుట్ర

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు -6లో



ఇలా చేయకుంటే తిరస్కరణ

ఆరోగ్య బీమా దరఖాస్తులో పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే -15లో



వైద్యసేవలు పాక్షిక బంద్

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ రేప్, హత్యకు నిరసనగా నేటి నుంచి దేశమంతా కొన్ని వైద్య సేవలను నిలిపేస్తున్నట్లు 'ఫోర్డా' ప్రకటించింది.

వివరాలు 6లో ▸



నట్వర్ సింగ్ కన్నుమూత

దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ దౌత్యాధికారి, కేంద్ర మాజీ మంత్రి కున్వర్ నట్వర్ సింగ్ (93) కన్నుమూశారు.

వివరాలు 6లో ▸



జేపీసీతో దర్యాప్తునకు డిమాండ్

అదానీ గ్రూప్‌లో సెబీ ఛైర్‌పర్సన్ పెట్టుబడుల వ్యవహారంపై నిజాలు నిగ్గుతేల్చడానికి జేపీసీ వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

వివరాలు 6లో ▸



ఆరోపణలు నిరాధారం

షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ కొట్టిపారేశారు.

వివరాలు 15లో ▸

న్యూస్‌రీల్


అ'ధన'పు సీట్లు అంటూ...



ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు, బ్రాంచీల మార్పునకు హైకోర్టు అంగీకరించకపోవడంతో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటాలో బీటెక్ సీట్ల కోసం డబ్బు కట్టిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

- వివరాలు 3లో▶

1,989 టీఎంసీలు కడలిపాలు



గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ కడలి వైపు కదిలిపోతున్నాయి. ఇప్పటికే 1,903 టీఎంసీల గోదావరి, 86 టీఎంసీల కృష్ణా జలాలు కలిపి మొత్తం 1,989 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి.

- వివరాలు 2లో▶

పొడుగూ ఎక్కువే.. సీట్లూ ఎక్కువే...



మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటుతో కోల్పోయిన రోజువారీ టికెట్ ఆదాయాన్ని కొంతమేర తిరిగి రాబట్టుకునేందుకు వీలుగా సెమీ డీలక్స్ బస్సులను ఆర్టీసీ రోడ్డెక్కించింది. ప్రయోగాత్మకంగా 3 నెలలపాటు ఈ బస్సులను తిప్పి ప్రయాణికుల స్పందనను పరిశీలించాలని నిర్ణయించింది.

- వివరాలు 16లో▶



ఈ ఫొటోలో కనిపిస్తున్నది జనగామ జిల్లా యశ్వంతాపూర్ గ్రామ పంచాయతీ భవనం. గ్రామంలో 10 వార్డులు, 428 ఇళ్లు, 1,779 జనాభా ఉంది. జనాభా ప్రాతిపదికన ఏటా రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎస్ఎఫ్‌సీ) గ్రాంట్ రూ.15 లక్షలు, 15వ ఆర్థిక సంఘం (కేంద్రం) నిధులు రూ.15 లక్షలు వస్తాయి.

కానీ గత ఏడాది నుంచి ఈ రెండు నిధులూ రావడం లేదు.

గతంలో పంచాయతీ పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్ల ద్వారా స్టాంపు డ్యూటీ, వృత్తిపన్ను, ఇంటి అనుమతుల లైసెన్స్ జారీ సమయంలో పన్నుల కమీషన్లు నేరుగా పంచాయతీ ఖాతాలో జమయ్యేవి. మీసేవ కేంద్రాలు ప్రారంభమయ్యాక అవి కాస్తా ప్రభుత్వ ఖజానాకు వెళ్లిపోతున్నాయి. దీంతో చిన్న చిన్న పనులకు పంచాయతీ కార్యదర్శులే సొంత డబ్బులు ఖర్చు చేస్తూ నెట్టుకొస్తున్నారు. ఇలాంటి సమయంలో రూపాయి ఇవ్వకుండా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయాలంటూ.. అధికారుల మెడపై కత్తి పెట్టే విధంగా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ కార్యక్రమానికి అవసరమైన బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందు, పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా తదితరాల కోసం అధికారులు జేబులో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెను సంక్షోభంలో పట్టుగొమ్మలు

పంచాయతీలకు నిలిచిపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు

- 20 నెలలుగా అందని రాష్ట్ర ఆర్థిక సంస్థ నిధులు
- వివిధ గ్రాంట్ల రూపంలో రూ.1,514 కోట్లు రావాల్సి ఉందని అంచనా
- పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ఆగిపోయిన 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు
- పంచాయతీలు నిర్వహించే మూడు రకాల బ్యాంకు ఖాతాలూ ఖాళీ
- బిల్లులు రాక అప్పుల్లో మాజీ సర్పంచ్‌లు.. సర్కారు బకాయిలు రూ.680 కోట్లు!
- రూ.4,305 కోట్లకు చేరిన పెండింగ్ విద్యుత్ బిల్లులు.. నిలిచిపోయిన అభివృద్ధి పనులు.. పారిశుద్ధ్య నిర్వహణకు, దోమల మందు సరఫరాకూ నిధుల కొరత
- మరోవైపు పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వ కార్యక్రమాల అమలు భారం

సాక్షి ప్రతినిధి, వరంగల్: గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలంటూ చెప్పుకోవడమే కానీ ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నిధులు నిలిచిపోవడంతో సమస్యలు పరిష్కారం కాక పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుంది కదా అన్న ఉద్దేశంతో పారిశుధ్యం, డ్రైనేజీల నిర్వహణ, అవసరమైన భవన నిర్మాణాల కోసం సొంత డబ్బులు ఖర్చు పెట్టిన సర్పంచ్‌లు.. బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లుగా పనిచేసిన వారిలో సగం మందికిపైగా అప్పులు, వడ్డీల భారం మోస్తూ బిల్లుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక్కో తాజా మాజీ సర్పంచ్‌కు రూ.8 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు ఒత్తిళ్లు భరించలేక ఆస్తులు అమ్ముకుని అప్పులు తీరుస్తున్నారు. మరోవైపు.. పంచాయతీలకు నిధులు మంజూరు చేయని ప్రభుత్వం.. ఎప్పటికప్పుడు వివిధ కార్యక్రమాల అమలుకోసం మాత్రం ఆదేశాలు జారీ చేస్తోంది. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో మొత్తం జనాభా	గ్రామీణ ప్రాంతాల జనాభా	మొత్తం గ్రామ పంచాయతీలు
3,50,03,674 (2011 జనాభా లెక్కల ప్రకారం)	2,13,95,009 (61.12 శాతం)	12,769

15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి పంచాయతీలకు ఏటా అందే నిధులు రూ.**1,160** కోట్లు

పారిస్‌లో ఒలింపిక్స్ ముగింపు వేడుకల దృశ్యం...



లాస్ ఏంజెలిస్‌లో కలుద్దాం...

ఘనంగా ముగిసిన పారిస్ ఒలింపిక్స్

విశ్వక్రీడల సంరంభం పారిస్ ఒలింపిక్స్ ఘనంగా ముగిశాయి. పోటీల చివరి రోజు ఆదివారం అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు వరుసగా ఎనిమిదోసారి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ ఫలితంతో అమెరికా జట్టు పతకాల పట్టికలో అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. అమెరికా, చైనా జట్లు 40 స్వర్ణాలతో సమంగా నిలిచాయి. అయితే చైనా కంటే ఎక్కువ రజత పతకాలు, ఎక్కువ కాంస్య పతకాలు అమెరికా సాధించడంతో అగ్రరాజ్యానికి టాప్ ర్యాంక్ దక్కింది. ఓవరాల్‌గా అమెరికా 40 స్వర్ణాలు, 44 రజతాలు, 42 కాంస్యాలతో కలిపి 126 పతకాలతో మొదటి స్థానంలో నిలిచింది. చైనా 40 స్వర్ణాలు, 27 రజతాలు, 24 కాంస్యాలతో కలిపి 91 పతకాలతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. భారత్ ఆరు పతకాలతో 71వ ర్యాంక్‌లో నిలిచింది. తదుపరి ఒలింపిక్స్ క్రీడలు 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలిస్ నగరంలో జరుగుతాయి.

13లో



భూమి రెండో పొర నుంచి రాళ్ల నమూనా!

సముద్రగర్భం దిగువున 1.26 కి.మీ. లోతులో సేకరణ

తొలిసారిగా చేజిక్కిన భూ ప్రవార శిల

జీవావిర్భావం గుట్టు వీడే ఆస్కారం

- వివరాలు 6లో



మోటార్ల ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి, తుమ్మల తదితరులు

35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

- వచ్చే ఐదేళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక
- 15 రోజుల్లో సీతారామ ఎత్తిపోతలకు అన్ని అనుమతులు
- ప్రాజెక్టు ట్రయల్ రన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి -5లో

అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో వేమో సెల్ఫ్ డ్రైవింగ్ కారులో ప్రయాణిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



రూ.31,532కోట్ల పెట్టుబడులు.. 30,750 ఉద్యోగాలు

- 19 కంపెనీలతో సంప్రదింపులు, ఒప్పందాలు.. అమెరికాలో ముగిసిన సీఎం రేవంత్ బృందం పర్యటన..
- దక్షిణ కొరియాకు బయలుదేరిన రాష్ట్ర ప్రతినిధి బృందం

- వివరాలు 3లో▶

నెలాఖరులోగా 'నామినేటెడ్'

25కిపైగా కార్పొరేషన్ పదవుల భర్తీ యోచనలో సీఎం రేవంత్

- సీఎం అమెరికా నుంచి తిరిగి రాగానే ఢిల్లీకి..
- టీపీసీసీ చీఫ్ ఎంపిక, నామినేటెడ్ అంశాలకు లైన్‌క్లియర్ అయ్యే చాన్స్
- మూడు, నాలుగు కీలక కార్పొరేషన్లను ఎమ్మెల్యేలకు ఇచ్చే యోచన!
- ఈసారి కులాల కార్పొరేషన్లకు కూడా చైర్మన్ల నియామకాలు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేతలకు మరోసారి పదవుల పందేరం చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. రెండో దఫా నామినేటెడ్ పదవుల భర్తీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టినట్టు తెలిసింది. ఇంతకుముందు 36 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా.. ఈసారి మరో 25కుపైగా పోస్టులను నింపే యోచనలో ఉన్నట్టు సమాచారం. సీఎం రేవంత్ అమెరికా, దక్షిణ కొరియాల పర్యటన పూర్తి చేసుకుని వచ్చాక.. ఢిల్లీ వెళ్లి ఈ విషయంపై అధిష్టానంతో చర్చలు జరపనున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపికతోపాటు నామినేటెడ్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అవుతుందని.. ఈ నెలాఖరులోపే నామినేటెడ్ పదవుల జాబితా వెలువడుతుందని వెల్లడిస్తున్నాయి.

పదవుల కోసం ఎదురుచూపులు ఎన్నో..

తొలి దఫాలో పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు దక్కనివారు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్యనేతలు కలిపి 36 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు అప్పగించారు. ఆ జాబితాలో చోటుదక్కని చాలా మంది మలి జాబితా కోసం ఎదురుచూస్తున్నారు. చాలా కాలం నుంచీ పార్టీలో పనిచేస్తున్నవారు, విద్యార్థి నాయకులు, అధికార ప్రతినిధులుగా పనిచేస్తున్నవారు, మహిళా నేతలతోపాటు

మిగతా 2వ పేజీలో ▶



ప్రస్తుతానికి సరిపెట్టుకో...!

క్లుప్తంగా...

సాహసోపేత నిర్ణయాలు 'మోదీ'కే సాధ్యం

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్



కొత్తపల్లి(కరీంనగర్): దేశ రక్షణకు సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం ప్రధాని మోదీకే సాధ్యమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. 370 ఆర్టికల్ రద్దు ఇందులో భాగమేనన్నారు. అగ్నిపథ్ గొప్ప పథకమని, ప్రతిపక్షాలు యువతను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూశాయని, వారి వలలో పడి మోసపోవద్దని సూచించారు. కరీంనగర్ శివారులోని రాజశ్రీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ 'ఫ్రెషర్స్ డే'కార్యక్రమానికి బండి సంజయ్ హాజరై మాట్లాడారు. అగ్నిపథ్‌లో చేరిన యువతను కేంద్రం అగ్నివీరులుగా గుర్తించి నాలుగేళ్ల పాటు శిక్షణ ఇస్తుందని, 25% మందిని ఎంపిక చేసి ఆర్మీలో చేర్చుకుంటుందని, మిగిలిన వారికి కార్పస్ ఫండ్ కింద మొత్తంగా రూ.11లక్షలు అందిస్తుందని తెలిపారు. ఉద్యోగ సమయంలో ఏదైనా జరిగితే రూ.48 లక్షల ఇన్సూరెన్స్, విధి నిర్వహణలో చనిపోతే రూ.44 లక్షల పరిహారం అందుతుందన్నారు. ఇంత చక్కని పథకంపై కాంగ్రెస్, కమ్యూనిస్టు నేతలు మోదీ ప్రభుత్వంపై విషం చిమ్మారని మండిపడ్డారు.

సుంకిశాల ప్రమాదం ప్రభుత్వ వైఫల్యమే

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, ముఠా గోపాల్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, ముఠా గోపాల్

సాక్షి, హైదరాబాద్: సుంకిశాల ప్రాజెక్టు ప్రమాద ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, ముఠా గోపాల్ విమర్శించారు. ఆదివారం వారు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ పని తీరు అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అవగాహన కుదుర్చుకుని, బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే సుంకిశాల ఘటన జరిగిందని, అందుకే ఇప్పటివరకు స్పందించలేదని ధ్వజమెత్తారు. సుంకిశాల ప్రాజెక్టును నిర్మించిన ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాగా, సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీని అరకొరగా చేస్తున్నారని, రైతు భరోసాను ఇప్పటి వరకు ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని అన్నారు. ఇలాంటి సమస్యలపై మాట్లాడేందుకు బీజేపీ నేతలకు సమయం లేదని, ఆరు గ్యారంటీలపై ఆ పార్టీ నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు.

నేడు కవిత బెయిలుపై సుప్రీంకోర్టు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బెయిలు కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారణ నిర్వహించనుంది. ఈడీ, సీబీఐ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితకు కూడా బెయిలు దక్కుతుందని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. సిసోడియాకు బెయిలు ఇచ్చిన సమయంలో.. సత్వర విచారణ హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ గురించి సుప్రీంకోర్టు ప్రస్తావించిన నేపథ్యంలో కవిత బెయిలు అంశం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

చంద్రబాబుతో స్పీకర్ గడ్డం ప్రసాద్ భేటీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో భేటీ అయ్యారు. ఈమేరకు ఆయన జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. తిరుమలలో వెంకన్న దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ చంద్రబాబును కోరినట్టు తెలిసింది. కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూడా ఆదివారం చంద్రబాబు నాయుడిని కలిశారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద సాగర్- మాచర్ల బ్రిడ్జిపై బారులు తీరిన వాహనాలు

1989 టీఎంసీలు కడలిపాలు

సముద్రంలో కలిసిన 1903 టీఎంసీల గోదావరి వరద • మరో 86 టీఎంసీల కృష్ణా జలాలు

సాక్షి, హైదరాబాద్: గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ కడలి వైపు కదిలిపోతున్నాయి. ఇప్పటికే 1,903 టీఎంసీల గోదావరి, 86 టీఎంసీల కృష్ణా జలాలు కలిపి మొత్తం 1989 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి. పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తెరిపి ఇవ్వడంతో గోదావరి, కృష్ణాలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ గోదావరి పరీవాహకంలో ఇప్పటికీ చెప్పుకోదగ్గ వరద రాకపోవడంతో నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు ప్రాజెక్టులు సగం కూడా నిండలేదు. కృష్ణాలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టులు పూర్తిగా నిండడంతో 10 రోజులుగా వచ్చిన వరదను వచ్చినట్టు సముద్రంలోకి వదిలివేస్తున్నారు. గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం(తెలంగాణ) నుంచి అంతర్వేది(ఏపీ) వరకూ పరీవాహకంలోని ప్రాజెక్టులన్నీ పూర్తిగా నిండడంతో వస్తున్న వరదను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

వర్షాల్లేక వరద తగ్గుముఖం..

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి వంటి ఉప నదులు, వాగులు, వంకల్లో ప్రవాహం తగ్గింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 47.25 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 3,583 క్యూసెక్కుల వరద వచ్చింది వచ్చినట్టు కాల్వలకు విడుదల చేస్తున్నారు. గోదావరికి ప్రాణహిత వరద తోడుకావడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ(లక్ష్మీ) బరాజ్‌కు 2,89,710 క్యూసెక్కులు, తుపాకులగూడెం(సమ్మక్క) బరాజ్ నుంచి 4,48,810 క్యూసెక్కులు, దుమ్ముగూడెం(సీతమ్మసాగర్) బరాజ్ నుంచి 4,61,484 క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చింది వచ్చినట్టు దిగువన వదులుతున్నారు.

• పెద్దపల్లి జిల్లా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటినిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. కాళేశ్వరం లింక్–2లో భాగంగా నీటిని ఎత్తిపోయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 13.82 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 5,676 క్యూసెక్కులు ఉండగా, 3,602 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉంది.


ఎగువ కృష్ణాలో తగ్గిన వరద

కృష్ణా పరీవాహకంలో ఎగువన వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఆల్మట్టి ప్రాజెక్టు నుంచి 15,000, నారాయణపూర్ నుంచి 6,000, జూరాల ప్రాజెక్టు నుంచి 82,339 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా, తుంగభద్రల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 2,84,791 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఆ నీటిని దిగువన ఉన్న సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి దిగువకు 1,04,424 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్ ఎనిమిది గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్/దోమలపెంట : శ్రీశైలం నుంచి వచ్చే వరద తగ్గడంతో నాగార్జునసాగర్ వద్ద కొన్ని గేట్లు మూసివేశారు. శనివారం సాయంత్రం 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా.. ఆదివారం ఉదయానికి 16 గేట్లకు తగ్గించారు. మధ్యాహ్నానికి 14, 10 గేట్లకు తగ్గిస్తూ సాయంత్రానికి ఎనిమిది గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. పర్యాటకులతో ఆదివారం నాగార్జునసాగర్ జనసంద్రంగా మారింది. సెలవు దినం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. సొంతవాహనాల్లో తరలిరావడంతో డ్యాం దిగువన కృష్ణాతీరం వెంట గల రోడ్లన్నీ కిటకిటలాడాయి. శ్రీశైలం నుంచి వరద వస్తుందనే సాకుతో ఆదివారం కూడా తెలంగాణ వైపు లాంచీలను నిలిపివేశారు. దీంతో పర్యాటకులు చాలామంది నిరాశతో వెళ్లారు. కొంతమంది మాత్రం రైట్ బ్యాంకు వెళ్లి అక్కడి నుంచి లాంచీల్లో నాగార్జునకొండకు వెళ్లారు. ఎగువ ప్రాంతాలైన జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఆదివారం శ్రీశైలం ఆనకట్ట వద్ద ఆరు గేట్లు పైకెత్తి నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

పెను సంక్షోభంలో పట్టుగొమ్మలు



హనుమకొండ జిల్లా కమలాపూర్ బాలికల ఉన్నత పాఠశాల పరిస్థితి ఇదీ...

▶ మొదటి పేజీ తరువాయి

ముగియడంతో పంచాయతీల కార్యదర్శులు తమ జేబులోంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

• ఏ నిధులూ లేవు

గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లను పంపిణీ చేయాలన్న 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 2021–22 నుంచి వరుసగా గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌లకు 85 శాతం, 10 శాతం, 5 శాతం నిష్పత్తిలో నిధులు కేటాయిస్తున్నారు. ఈ గ్రాంట్ల వినియోగానికి మార్గదర్శకాలు సూచించి ప్రతి సంవత్సరం జూన్, అక్టోబర్‌లో రెండు విడతలుగా నిధులు విడుదల చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం (ఎస్ఎఫ్‌సీ) ఒక్కో ఓటరుకు రూ.65 నుంచి రూ.115 చొప్పున ఇస్తోంది. అయితే గత 20 నెలలుగా ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. ఇంకోవైపు పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో.. ఈ ఏడాది జనవరి నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం నిలిచిపోయాయి.

• ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం

ఇసుక సెస్, సీనరేజ్, రిజిస్ట్రేషన్ చార్జీలు తదితరాలు జమ చేసుకుంటూ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల కింద ప్రభుత్వం తలసరి రూ.800 వరకు గ్రామ పంచాయతీలకు గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2019 జనవరి 21, 25, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 2024 ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగా.. జనవరి 31నే ప్రభుత్వం స్పెషలాఫీసర్లను నియమించి వారికి ఫిబ్రవరి 15న మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసే ఆరు నెలల ముందే నిధులు నిలిచిపోగా.. పదవీ కాలం ముగిసి ఆరు నెలలు కావస్తుండగా పంచాయతీలకు వివిధ గ్రాంట్ల రూపేణా రావాల్సిన సుమారు రూ.1,514 కోట్లు మంజూరు కాకుండా నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి పనులు ఆగిపోగా, విద్యుత్ బకాయిలు ఇప్పటికే రూ.4,305 కోట్లకు చేరుకోవడంతో పంచాయతీలు పెను సంక్షోభంలో చిక్కుకుపోయే పరిస్థితి ఏర్పడింది.

• మూడు ఖాతాలు ఖాళీ..!

గ్రామ పంచాయతీలకు ఉండే మూడు రకాల బ్యాంకు ఖాతాలు పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఆస్తి పన్ను అరకొరగా వసూలు అవుతున్నా ఖర్చు నాలుగింతలు ఉండడంతో ఆ ఖాతా ఎప్పుడూ ఖాళీ అవుతోంది. రెండోదైన ఎస్ఎఫ్‌సీ ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేస్తుంది. వీటిని ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. అయితే 20 నెలలుగా నిధులు నిలిచిపోయాయి. మూడోది 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ జనాభా, ఓటర్ల ఆధారంగా నిధులు అందజేస్తుంది. వీటిని ప్రత్యేక సూచనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా నిలిచిపోయాయి.

• టైడ్ నిధులను జాతీయ ప్రాధాన్యతలైన తాగునీటి సరఫరా, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, పారిశుద్ధ్యం తదితరాలకు వాడాలి. అన్‌టైడ్ నిధులను పంచాయతీలు స్థానిక అవసరాలకు అనుగుణంగా వాడుకోవచ్చు.

బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యం



పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. తాజా మాజీ సర్పంచ్‌లకు రూ.కోట్లల్లో పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. నేను గ్రామంలో సీసీ రోడ్లు, మొరం పనులు, వాగు దాటేందుకు వీలుగా నిర్మాణ పనులు చేసిన. శ్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం కల్పించా. ఈ మేరకు రూ.25 లక్షలు బిల్లు రావాల్సి ఉంది. మా జిల్లాలో రూ.50 కోట్లకు పైనే ఉన్న బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లకు రూ.680 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

– దూసరి గణపతి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, జనగామ

అప్పులు కట్టడానికి ప్లాటు అమ్మా



గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనులు చేశా. గ్రామ పంచాయతీ భవనం, ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, సబ్ సెంటర్ నిర్మాణం చేపట్టా. పనులు పూర్తికాగానే బిల్లులు వస్తాయనే ధీమాతో చాలావరకు అప్పులు చేసి పనులు పూర్తి చేశా. వీటికి సంబంధించి రూ.30 లక్షలు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రాకపోవడంతో సిద్దిపేటలో ఉన్న ప్లాటును తక్కువ ధరకు అమ్మి కొంతమేర అప్పులు చెల్లించా.

– దమ్మ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, రామలక్ష్మణపల్లె, ముస్తాబాద్, సిరిసిల్ల జిల్లా


పదవీకాలం అయిపోయింది.. అప్పు మిగిలింది.



నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మాద్వార్ గ్రామంలో రెండేళ్ల కిందట రూ.40 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టారు. కానీ వీటికి సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు రాలేదు. అభివృద్ధి పనులతో ఊరు బాగైందని, తాము మాత్రం అప్పులపాలయ్యామంటూ మాజీ సర్పంచ్ ఈడ్గి లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– ఈడ్గి లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్, మాద్వార్ గ్రామం, మక్తల్ మండలం, నారాయణపేట జిల్లా

స్థానిక సంస్థలకు 15వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన నిధుల తీరు ఇదీ.. (రూ.కోట్లలో)



	2021-22	2022-23	2023-24	2024-25	2025-26	మొత్తం గ్రాంట్
ప్రాథమిక (అన్‌టైడ్ 40%)	546	566	572	605.6	590.8	2,880.4
టైడ్ (60%)	819	849	858	908.4	886.2	4,320.6
మొత్తం	1,365	1,415	1,430	1,514	1,477	7,201
విడుదల	1,365	1,415	715	-	-	-

సాగర్ ప్రాజెక్టు వాక్‌వే బ్రిడ్జి గేట్ల తాళం

పగులగొట్టిన ఏపీ అధికారులు

కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసిన తెలంగాణ ఎన్ఎస్‌పీ అధికారులు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు వాక్‌వే బ్రిడ్జి మీదకు వెళ్లే గేటుకున్న తాళాన్ని ఏపీ సాగునీటి పారుదల శాఖ అధికారులు పగులగొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ విషయంపై తెలంగాణ ఎన్ఎస్‌పీ అధికారులు కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే ముందు భాగంలో రెండు ఎర్త్‌డ్యాంల మధ్యన వాక్‌వే బ్రిడ్జి ఉంది. దీని మీదనుంచి రేడియల్ క్రస్ట్‌గేట్లు, స్పిల్‌వేలపై జరిగే పనులను పరిశీలిస్తారు. దీనికి సంబంధించిన మెయింటెనెన్స్ తెలంగాణ ఎన్ఎస్‌పీ అధికారులు చూస్తారు. ఆదివారం శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వచ్చే వరద తగ్గడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 18 క్రస్ట్‌గేట్లు మూసివేశారు. 13వగేటు నుంచి అటు నాలుగు, ఇటు నాలుగు గేట్లు మాత్రమే ఉన్నాయి. ఏపీకి చెందిన (అఫీషియల్స్) ముఖ్యులు సాగర్ సందర్శనకు వచ్చారు. రేడియల్ క్రస్ట్‌గేట్ల దగ్గరికి వెళ్లి కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు ఆ తాళం పగులగొట్టి వాక్‌వే బ్రిడ్జి మీదుగా వెళ్లారు. అనంతరం పగులగొట్టిన తాళం స్థానంలో కొత్త తాళం వేసి తాళం చెవి తెలంగాణ అధికారులకు ఇచ్చి వెళ్లారు.

రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దు

తెలంగాణ బ్రాండ్ ఇమేజీకు నష్టం రాకుండా సీఎం చర్యలు చేపట్టాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమరరాజా సంస్థ చెబుతున్నట్టుగా వస్తున్న వార్తలు తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు నష్టం కలిగిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం మంచిది కాదని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక..ప్రభుత్వ వైఖరేంటో అర్థంకాక ఇప్పటికే చాలా సంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేన్స్ టెక్నాలజీ అనే సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్‌కు వెళ్లిపోయిందని, కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించిందని, ఇప్పుడు అమరరాజా కూడా వెళ్లిపోతుందంటే తెలంగాణ ఇమేజ్ ఏం అవుతుందో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ పాలసీలు పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుగుణంగా కొనసాగించాలని సూచించారు. అమరరాజా సంస్థ తెలంగాణలో రూ.9,500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పించేందుకు ఎంతో కష్టపడ్డ విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అమరరాజా సంస్థ ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సెబీ, అదానీ బంధంపై విచారణ జరపాలి: కేటీఆర్

'అదానీతో సెబీ చీఫ్‌కు ఉన్న సంబంధం నిజంగా ఆందోళనకరం. దీనిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదివారం 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. 'ఈ విషయంలో రాబోయే రోజుల్లో మరిన్ని సంచలనాలు బయటపడే అవకాశముంది. రాహుల్ గాంధీ గారూ.. తెలంగాణలో మీ సొంత పార్టీకి చెందిన ముఖ్యమంత్రి ఎర్రతివాచీతో స్వాగతం పలుకుతున్నారు. అదానీ పాట పాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ సమగ్రతను కూడా గంగలో కలుపుతున్నాడు. ఈ ద్వంద్వ విధానాలపై మీ వద్ద ఏదైనా సమాధానం ఉందా' అని కేటీఆర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు.

కాళేశ్వరం కొట్టుకుని పోతే నీళ్లెలా వచ్చాయి?

- కాంగ్రెస్. బీజేపీ ఒక్కటే..
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటజోన్: కాళేశ్వరం కొట్టుకు పోయిందని రాద్ధాంతం చేశారని, ఇప్పుడు నీళ్లు ఎలా వచ్చాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని, ఈ రెండు పార్టీలు తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 229 మందికి సీఎం సహాయనిధి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరం కూలిపోయిందని కాంగ్రెస్ బద్నాం చేసిందని, మరి ఇప్పుడు రంగనాయక సాగర్‌లోకి కాళేశ్వరం గోదారి నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నేడు రంగనాయక సాగర్ నిండుకుండలా ఉందన్నారు. రెండు పంటలకు సరిపడేలా నీళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులు మూసివేస్తామని చెప్పి నేడు గల్లీ గల్లీలో పెట్టిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిందని, గుండు సున్నా ఇచ్చిందని విమర్శించారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబం

నెలాఖరులోగా 'నామినేటెడ్'

▶ మొదటి పేజీ తరువాయి

కొందరు సీనియర్లు కూడా పదవులు ఆశిస్తున్నారు. నెల రోజుల క్రితమే రెండో దఫా పదవుల పందేరం ఉంటుందనే చర్చ జరిగినా ఆ దిశగా అడుగులు పడలేదు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరపడుతోందని, వీలైనంత త్వరగా పదవులు ఇవ్వాలని ఆశావహులు రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, అధిష్టానానికి విజ్ఞప్తులు చేస్తున్నారు.

ఈసారి ఎమ్మెల్యేలకు కూడా!

రెండో రౌండ్ నామినేటెడ్ పదవుల జాబితాలో పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలకు కీలక కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కనున్నట్టు చర్చ జరుగుతోంది. ఆర్టీసీ, సివిల్ సప్లయిస్, మూసీ రివర్‌ఫ్రంట్ వంటి ముఖ్యమైన కార్పొరేషన్లను ఎమ్మెల్యేలకు అప్పగిస్తారని.. సామాజిక సమీకరణాల నేపథ్యంలో మంత్రివర్గంలో స్థానం దక్కనివారికి చైర్మన్ పదవులతోపాటు కేబినెట్ హోదా కల్పిస్తారని సమాచారం. ఇక బేవరేజెస్ కార్పొరేషన్, వైద్య మౌలిక సదుపాయాల కల్పన, హ్యాండ్లూమ్స్, గీత కార్పొరేషన్ తదితర పోస్టులు కూడా ముఖ్య నేతలకు అప్పగించనున్నట్టు తెలిసింది. వీటితోపాటు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కుల కార్పొరేషన్లకు కూడా ఈసారి చైర్మన్లను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు వైశ్య కార్పొరేషన్‌కు మాత్రమే చైర్మన్‌ను ప్రకటించగా.. మిగతా కులాల కార్పొరేషన్లకు కూడా చైర్మన్లను ప్రకటించాలని టీపీసీసీ నాయకత్వంపై ఒత్తిడులు వస్తున్నాయి.

పేదలకోసమే వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారు

మంత్రి దామోదర రాజనర్సింహ



మదనాపురం: పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు..వారికి ఆర్థికంగా పురోగతి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని.. ఇందులో భాగంగానే మా పెద్దలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నేటికీ ఎంతో మంది పేదలను కాపాడుతున్నామని చెప్పారు. ఆదివారం ఆయన వనపర్తి జిల్లా మదనాపురంలో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరై మాట్లాడారు. ఈ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే.. తాము అధికారంలోకి వచ్చాక రూ.10 లక్షలకు పెంచామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రతి మండల కేంద్రం నుంచి 20 కిలోమీటర్లలోపు డయాలసిస్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 10 కిలోమీటర్లు లోపే ఉండేలా చూస్తామన్నారు.

క్లుప్తంగా...

7 నుంచి 'కాణిపాకం'లో బ్రహ్మోత్సవాలు



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 7 నుంచి 27 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ఉభయదారుల సమక్షంలో ఆదివారం నిర్వహణ పత్రాన్ని విడుదల చేశారు. తేదీల వారీగా వాహన సేవలను వివరించారు.

రూ.10 వేల శాశ్వత పెన్షన్‌కు వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని మునిసిపాలిటీలు. కార్పొరేషన్లలో సభ్యులకు నెలకు రూ.10 వేల శాశ్వత పెన్షన్ మంజూరు చేయాలని తెలంగాణ మునిసిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ రాము నాయక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 142 పాలకమండళ్ల మేయర్లు, చైర్మన్లకు గౌరవ వేతనం రూ.లక్షకు పెంచాలని ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, అకౌంట్స్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఆర్వో తదితర విభాగాల్లో పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. వార్డుల్లో పర్యవేక్షణకు మహిళా కౌన్సిలర్లకు స్కూటీ వాహనం అందజేయాలని, నిలిచిపోయిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కొనసాగించాలని కోరారు.

ధరణి సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

టీపీసీసీ అధికార ప్రతినిధి మహేశ్



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పరిధిలో పనిచేసే ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారి సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని హోటల్ టూరిజం ప్లాజాలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ధరణి ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ... ధరణి పేరుతో కేసీఆర్ కుటుంబ సభ్యులు దోచుకున్నారని, దాదాపు 11 నెలల పాటు ధరణి ఉద్యోగులకు జీతాలివ్వలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 9 నెలల పెండింగ్ బకాయిలను విడుదల చేశామన్నారు. ఈ సమావేశంలో ధరణి ఉద్యోగ సంఘం నాయకులు పురుషోత్తం, శివ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ కమిటీ చైర్మన్‌గా అజయ్ అగర్వాల్



సాక్షి, హైదరాబాద్: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ (పీఆర్) చైర్మన్‌గా డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పబ్లిక్ రిలేషన్స్ రంగంలో అజయ్ అగర్వాల్‌కున్న అపారమైన అనుభవం తమకెంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కోల్‌కతాలో పీజీ డాక్టర్ హత్యపై జూడా ఖండన

సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని దారుణంగా హత్య చేయడాన్ని తెలంగాణ జూనియర్ డాక్టర్ల (జూడా) సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము రాహుల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐజాక్ న్యూటన్‌లు ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీచేశారు. ఈ నేరం క్యాంపస్‌లోని సెమినార్ హాల్‌లో జరిగిందని, ఇది మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల్లో భద్రతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తుందన్నారు. ఇటీవల కేరళలోనూ ఒక యువ వైద్యుడిని కత్తితో పొడిచి చంపిన సంఘటనను వారు ప్రస్తావించారు. ఈ ఘటనపై సమగ్రమైన దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని రాహుల్, న్యూటన్ డిమాండ్ చేశారు. వైద్యుల భద్రతను మెరుగుపరచడానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బాధ్యులైన వారిపై 24 గంటల్లో కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే తెలంగాణ జూడాలు, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) రెండూ కలిసి దేశవ్యాప్త నిరసనలకు దిగుతామని హెచ్చరించారు.

నట్వర్‌సింగ్ మృతికి సంతాపం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నట్వర్‌సింగ్ మృతిపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నట్వర్‌సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.



మానవ హక్కులకు దిక్కేది?


మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) చైర్మన్, సభ్యులు పదవీ విరమణ పొందిన 3 నెలల్లోగా మళ్లీ కొత్త కమిషన్ నియామకం చేపట్టాలని సుప్రీంకోర్టు చెబుతోంది. కానీ రాష్ట్రంలో రెండేళ్లుగా ఆ ఊసే లేదు. కొత్త కమిషన్‌ను నియమించాలని రెండేళ్లుగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరుగుతున్నా, ఇంతవరకు నియామకం చేపట్టలేదు. రేపు, ఎల్లుండి అంటూ కాలయాపనతోనే ప్రభుత్వం నెట్టుకొస్తోంది. రాజ్యాంగ హక్కులు, ప్రాథమిక హక్కులు కాపాడే కమిషన్ నియామకంలో అలసత్వం సరికాదని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు. కొత్త కమిషన్ నియామక ప్రక్రియ కొనసాగుతోందని, రెండు నెలల్లో పూర్తి చేస్తామని హైకోర్టుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. -సాక్షి, హైదరాబాద్

చైర్మన్, సభ్యుల ఎంపిక కమిటీలో ఎవరు ఉంటారంటే..

చైర్‌పర్సన్: ముఖ్యమంత్రి
సభ్యులు: శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్, హోంమంత్రి, రెండు సభల ప్రతిపక్ష నేతలు

అర్హతలు

చైర్మన్: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా జడ్జిగా పనిచేసినవారు అర్హులు.
జ్యుడీషియల్ సభ్యుడు: హైకోర్టులో జడ్జిగా లేదా జిల్లాజడ్జిగా ఏడేళ్లు పనిచేసి ఉండాలి.
నాన్-జ్యుడీషియల్ సభ్యుడు: మానవ హక్కులపై విశేష అనుభవం, పరిజ్ఞానం ఉండాలి.
కాలపరిమితి: చైర్మన్, సభ్యుల కాలపరిమితి మూడేళ్లు లేదా 70 ఏళ్ల వయసు వచ్చే వరకు ఏది ముందైతే అదే వర్తిస్తుంది. ఒకవేళ ఎవరైనా రాజీనామా చేస్తే గవర్నర్‌కు అందజేయాలి. వీరిని తొలగించే అధికారం కూడా గవర్నర్‌కే ఉంటుంది. చైర్మన్, సభ్యుల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.



(2019, డిసెంబర్‌లో కమిషన్ ఏర్పాటైంది. 8 రోజులు మాత్రమే పనిచేసింది. 2024 గణాంకాలు జూలై 31 వరకు.)

మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల పోస్టులు ఖాళీ
2023, 2024 సంవత్సరాల్లో పరిష్కారానికి నోచుకోని ఫిర్యాదులు
హైకోర్టులో పిల్ వేసినా భర్తీ కాని పోస్టులు
తాజాగా రెండు నెలల సమయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజల హక్కులను గౌరవించాలి



1993 మానవహక్కుల చట్టం ద్వారా ప్రతి రాష్ట్రానికి ఒక రాష్ట్ర కమిషన్ ఉండాలనేది రాష్ట్ర ప్రజల చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ హక్కు. దీనిని గౌరవించి ప్రజల హక్కులకు కొంతైనా గ్యారంటీ ఇవ్వగలిగే కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం వెంటనే పూర్తి చేయాలి.
– చిక్కుడు ప్రభాకర్, హైకోర్టు న్యాయవాది

హెచ్‌ఆర్‌సీ ఏర్పాటు ఇలా...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల కమిషన్ 1993లో ఏర్పాటైంది. చైర్మన్, జ్యుడీషియల్, నాన్-జ్యుడీషియల్ సభ్యులిద్దరూ ఉంటారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ కమిషన్ ఏర్పాటు చేస్తూ 2019, నవంబర్‌లో ప్రభుత్వం జీఓ జారీ చేసింది. తెలంగాణ కమిషన్ తొలి చైర్మన్‌గా జస్టిస్ చంద్రయ్య, సభ్యులుగా ఆనందరావు నడిపల్లి(జ్యుడీషియల్), ఇర్ఫాన్ మొహినుద్దీన్(నాన్ జ్యుడీషియల్)ను ప్రభుత్వం నియమించింది. 2022తో వీరు పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్, సభ్యుల నియామకం జరగలేదు. దీంతో గత రెండేళ్లలో ఒక్క కేసు కూడా విచారణకు నోచుకోలేదు.

విధులు

- మానవ హక్కులతోపాటు రాజ్యాంగ, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన విధి.
- పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు లేదా వారి హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ఫిర్యాదు ఆధారంగా లేదా సుమోటోగా విచారణ చేపట్టొచ్చు.
- రాష్ట్రంలోని ఏ అంశంలోనైనా హక్కులపై సమీక్ష జరిపి ప్రభుత్వానికి సూచనలు చేయవచ్చు.
- కమిషన్ విచారణ జరిపాక, ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. నష్టపరిహారం, ఇతర చర్యలపై సూచనలు కూడా చేయవచ్చు. కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలుంటాయి.

సుమోటో కేసులు ఇలా..

	స్వీకరణ	పరిష్కారం	పెండింగ్
2019	2	2	0
2020	41	4	37
2021	22	2	20
2022	24	1	23

ఇలా సంప్రదించవచ్చు

ఫోన్ నంబర్: 040–24601572
అడ్రస్: బ్లాక్–7, గృహకల్ప కాంప్లెక్స్, ఎంజే రోడ్, గాంధీభవన్, నాంపల్లి, హైదరాబాద్

ముఖ్యమైన వివరాలు..

- కోర్టులతో పోలిస్తే కేసుల పరిష్కారం వేగవంతంగా ఉంటుంది. బాధితులకయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ.
- చాలా దేశాల్లో హక్కుల కమిషన్లు అత్యంత కీలకంగా పనిచేస్తున్నాయి.
- రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి స్థాయి కంటే తక్కువ లేని అధికారిని రాష్ట్ర కమిషన్ కార్యదర్శిగా నియమిస్తారు.
- ఫిర్యాదుదారు, బాధితులు, ఘటన వివరాలు, పరిహారం తదితర వివరాలతో తెలంగాణ మానవ హక్కుల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు. బాధితులే కాదు.. వారి తరపున ఇతరులు కూడా ఫిర్యాదు చేయవచ్చు.
- సెక్షన్ 30 ప్రకారం జిల్లా కోర్టులోని రెండవ అదనపు జిల్లాజడ్జి హెచ్‌ఆర్‌సీ కేసులు విచారించాలి. ప్రత్యేకంగా పీపీ కూడా ఉండాలి. అయితే, ఈ కేసులను ఏ చట్టం ప్రకారం విచారణ చేయాలనేదానిపై స్పష్టత లేదు.

రూ.31,532 కోట్లు 30,750 ఉద్యోగాలు

19 కంపెనీలతో సంప్రదింపులు, ఒప్పందాలు
అమెరికాలో సీఎం రేవంత్ బృందం పర్యటన ముగింపు
దక్షిణ కొరియాకు బయలుదేరిన రాష్ట్ర ప్రతినిధి బృందం


సెల్ఫ్ డ్రైవింగ్ కారు వద్ద సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు ఉన్నతాధికారులతో కూడిన రాష్ట్ర బృందం అమెరికాలో చేపట్టిన పర్యటన ముగిసింది. ఈ నెల 3న అమెరికా వెళ్లిన సీఎం బృందం.. అక్కడి నుంచి దక్షిణకొరియాకు బయలుదేరింది. అమెరికా పర్యటనలో భాగంగా వివిధ రంగాల్లో పేరొందిన దిగ్గజ కంపెనీలు తెలంగాణలో రూ.31,532 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వంతో కలసి పనిచేసేందుకు 19 కంపెనీలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయని.. తద్వారా రాష్ట్రంలో 30,750 కొత్త ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను, 4.0 నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్న సీఎం చేసిన ప్రకటనలతో అమెరికా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులకు ఆసక్తి చూపారని వెల్లడించాయి.

50కి పైగా వాణిజ్య సమావేశాలతో..

అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బృందం 50కిపైగా వాణిజ్య సమావేశాలు, మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంది. కృత్రిమ మేధ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకునేందుకు అమెరికన్ కంపెనీలు ఆసక్తి చూపాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దిగ్గజ సంస్థలు కాగ్నిజెంట్, చార్లెస్ స్క్వాబ్, ఆర్సీసియం, కార్నింగ్, ఆమ్‌జెన్, జొయిటిస్, హెచ్‌సీఏ హెల్త్‌కేర్, వివింట్ ఫార్మా, థర్మోఫిసర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాల విస్తరణ, కొత్త కేంద్రాల స్థాపనకు సంసిద్ధత వ్యక్తం చేశాయని వెల్లడించాయి. ఈ పర్యటనలో యాపిల్, గూగుల్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతోనూ సీఎం రేవంత్ బృందం చర్చలు జరిపింది.

సరికొత్త భాగస్వామ్యానికి నాంది

ప్రపంచంలో పేరొందిన కంపెనీలతో సంప్రదింపులు, చర్చలతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి నాంది పలికింది. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుతోపాటు ఏఐ సిటీ మొదలు ఫ్యూచర్ సిటీ వరకు తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న ప్రణాళికలకు అమెరికాలోని పారిశ్రామికవేత్తల నుంచి మద్దతు లభించింది. తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు తరలిరావటం శుభసూచకం. – సీఎం రేవంత్

సరికొత్తగా తెలంగాణ పరిచయం

అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి తెలంగాణను సరికొత్తగా పరిచయం చేయగలిగాం. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని ఈ పర్యటనలో చాటిచెప్పాం. మా అమెరికా పర్యటన సత్ఫలితాలను అందించింది. తద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా రావడంతోపాటు అపారమైన ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి. – మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో అమెజాన్ సేవల విస్తరణ


సంస్థ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు

అమెజాన్ సంస్థ హైదరాబాద్‌లోని తమ డేటా సెంటర్‌ను విస్తరించేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపింది. అమెరికా పర్యటనలో భాగంగా 'అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ'వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పియర్సన్, ఇతర ప్రతినిధులతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. తెలంగాణలో అమెజాన్ డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు సంబంధించి హైదరాబాద్‌లో ఇప్పటికే మూడు డేటా సెంటర్లు ఉన్నాయి. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను, తమ వ్యాపారాన్ని విస్తరించే ఆలోచనలను అమెజాన్ ప్రతినిధులు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని కెర్రీ పియర్సన్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందన్నారు.


భూమి పూజ చేస్తున్న న్యాయమూర్తులు సుజన, వినోద్‌కుమార్, లక్ష్మణ్

కోర్టు భవనాలకు భూమి పూజ

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో రూ.12.75 కోట్లతో చేపట్టిన జూనియర్ సివిల్ కోర్టు, జడ్జి రెసిడెన్షియల్ భవన నిర్మాణాలకు హైకోర్టు జడ్జిలు సుజన, వినోద్‌కుమార్, లక్ష్మణ్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేషనల్ జ్యుడీషియల్ అకాడమీని సంప్రదించి రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా భవన నిర్మాణ పనులను నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. ఒప్పందం ప్రకారం సంస్థ ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.హుస్సేన్, బోథ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

అ'ధన'పు సీట్లు అంటూ..

విద్యార్థుల తల్లిదండ్రులకు ఆశపెట్టిన పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు

- ముందే డబ్బులు వసూలు చేసిన వైనం
- వస్తాయనుకున్నాం.. రాలేదు.. ఏం చేయాలి?
- చేతులెత్తేస్తున్న యాజమాన్యాలు... కాలేజీల వద్ద తల్లిదండ్రులు పడిగాపులు



సాక్షి, హైదరాబాద్: సీట్లు పెరుగుతాయి..మేనేజ్‌మెంట్ కోటాలో బీటెక్ అడ్మిషన్ గ్యారంటీ అని కొన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు చెప్పడంతో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు డబ్బులు పేమెంట్ చేసి జాయినింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు, కుదింపు, బ్రాంచ్‌ల మార్పునకు హైకోర్టు అంగీకరించలేదు. యాజమాన్యాల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని వెల్లడించింది. దీంతో ఇప్పటికే డబ్బులు కట్టిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ముందస్తుగా డబ్బు చెల్లించినవారు 1500 మంది వరకూ ఉన్నారు. వారంతా కాలేజీల చుట్టూ తిరుగుతూ డబ్బులు తీసుకున్నారు... ఇప్పుడు సీట్లెలా ఇస్తారు?' అంటూ యాజమాన్యాలను నిలదీస్తున్నారు. 'కోర్టులో అనుకూలంగా తీర్పు వస్తుందని భావించాం..ఇప్పుడు మేం ఏం చేయగలం?' అంటూ కాలేజీ యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. డబ్బు వాపస్ ఇస్తారా? లేదా? అనేది అనుమానంగానే ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

ఇక ఆ సీట్లు రానట్టే!

రాష్ట్రవ్యాప్తంగా 28 ఇంజనీరింగ్ కాలేజీలు బ్రాంచ్‌ల మార్పిడి, సీట్ల పెంపునకు దరఖాస్తు చేసుకున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లలో దాదాపు 10 వేల సీట్లు రద్దు చేసుకున్నాయి. వీటిస్థానంలో సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెంచాలని అడిగాయి. అయితే, సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచ్‌లలో సీట్ల కుదింపునకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ససేమిరా అంది. ఇలా కుదిస్తే ఈ బ్రాంచ్‌లు తెరమరుగయ్యే ప్రమాదముందని అడ్డు చెప్పింది. ఇదే క్రమంలో కొత్తగా సీఎస్ఈ, డేటాసైన్స్, ఏఐ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లలో సీట్లు పెంచాలని పలు కాలేజీలు కోరాయి. కంప్యూటర్ సైన్స్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ వంటి వాటిల్లో సీట్ల తగ్గింపునకు కూడా దరఖాస్తు చేసుకున్నాయి. ఇప్పటికే ఆయా కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్, అనుబంధ బ్రాంచ్‌లలో సీట్లు ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వం భావించింది. ఇలా దాదాపు 5 వేల సీట్లకు అనుమతి లభించలేదు. కోర్టు అనుమతిస్తే మూడో విడత కౌన్సెలింగ్‌లో వీటిని చేర్చాలని భావించారు.

ముందే ఖరారు

కోర్టు అనుమతిస్తే సీఎస్ఈ, కంప్యూటర్ సైన్స్ అనుబంధ బ్రాంచ్‌లలో 5 వేల సీట్లు పెరిగేవి. 30 శాతం యాజమాన్య కోటా కింద దాదాపు 1500 సీట్లు అందుబాటులో ఉండేవి. దీనిని దృష్టిలో ఉంచుకొని కొన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ముందే సీట్లు అమ్ముకున్నాయి. కోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని ఆశించాయి. ఒక్కో సీటును రూ. 8 నుంచి రూ. 18 లక్షలకు అమ్ముకున్నట్టు తెలుస్తోంది. కోర్టుకెళ్లిన వారిలో పెద్ద కాలేజీలే ఉండటంతో మేనేజ్‌మెంట్ సీట్లకూ గిరాకీ బాగానే పలికింది. ఇలా సీట్లు కొనుగోలు చేసిన వారిలో రాష్ట్ర ఈఏపీసెట్‌లో అతి తక్కువ స్కోర్ వచ్చినవారు, అసలు సెట్ పాసవ్వని వారూ ఉన్నారు. ఇప్పుడు వీరికి ఆఖరిదశ కౌన్సెలింగ్‌లో సీట్లు వచ్చే అవకాశం కూడా లేదు. చెల్లించిన సొమ్ముకు ఎలాంటి రసీదు ఇవ్వలేదు. ఇప్పుడు ఈ సొమ్మును రాబట్టడానికి గట్టిగా అడిగే పరిస్థితి కూడా లేదు. దీంతో కాలేజీల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఓ విద్యార్థి తండ్రి తెలిపారు.

అప్పీల్‌కు వెళ్లేలోగా.. కౌన్సెలింగ్ ఖతం

హైకోర్టులో చుక్కెదురు కావడంతో కొన్ని ప్రైవేట్ కాలేజీలు అప్పీల్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌ను త్వరగా ముగించాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలొచ్చాయి. ఇప్పటికే రెండు దశల కౌన్సెలింగ్ పూర్తయింది. మూడో దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ఈ నెల 13న చేపడతారు. వెనువెంటనే స్పాట్ అడ్మిషన్లు చేపట్టే వీలుందని అధికారులు అంటున్నారు. ప్రైవేట్ కాలేజీలు అప్పీల్‌కు వెళ్లి, కేసు తేలేలోగా ఇంజనీరింగ్ క్లాసులు కూడా మొదలవుతాయి. ఇది ప్రైవేట్ కాలేజీలకు ఇబ్బంది కలిగించే పరిణామమని అధికారులు అంటున్నారు.

పత్రికా స్వేచ్ఛ, విద్యతోనే సమాజాభివృద్ధి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పత్రికా స్వేచ్ఛ, విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జరిగిన స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్టీయూతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని టీచర్లకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్‌లు మాట్లాడుతూ, పేరివిజన్ కమిటీ తన నివేదికను పూర్తి చేసి ప్రభుత్వానికి వెంటనే అందించాలని కోరారు. త్వరలోనే సర్వీసు రూల్స్ సాధించి, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ అలాగే జూనియర్ లెక్చరర్లకు పదోన్నతులు ఇప్పించేందుకు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం నాటికి డీఎస్సీ ద్వారా కొత్తగా ఉపాధ్యాయులను నియమించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల అన్ని రకాల పెండింగ్ బిల్లులను మంజూరు చేయించడానికి ఉప ముఖ్యమంత్రితో చర్చించినట్లు వివరించారు.

ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహం

త్వరలోనే ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్



గన్‌ఫౌండ్రీ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై త్వరలోనే ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆదివారం రవీంద్ర భారతిలో జైగౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 374వ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... బహుజనులందరికీ పాపన్న గౌడ్ గొప్ప నాయకుడని, బహుజనరాజ్యం కోసం నిజాం పాలకులపై పోరాడిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. ఈ నెల 18న పాపన్నగౌడ్ జయంతి వేడుకలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ...సర్వాయి పాపన్నగౌడ్ ఒక్క కులానికే చెందిన వ్యక్తి కాదన్నారు. నేటి యువతరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు ప్రదర్శించిన సాంస్కృతిక నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కర్ణాటక మండలి సభ్యులు జగదేవ్ గుత్తేదార్, ఎమ్మెల్సీ బీకే హరి ప్రసాద్‌గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, బీజేపీ నాయకులు టి.వీరేందర్‌గౌడ్, జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వి.రామారావు గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్‌లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



పాత విషయాలపై ఎక్కువ అభ్యాసం లేకుండా కొత్త విషయాలను కనుగొనే అవకాశం లేదు.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 12 ఆగస్టు 2024

దేశ'భుక్తి' గేయం

ఎప్పటి గురజాడ! ఎప్పటి దేశభక్తి గీతం! నూటపాతికేళ్ళ క్రితం నాటి ఆ గీతం ఇన్ని కోట్ల తెలుగుప్రజల పెదాలపై ఎన్ని కోట్ల సార్లు నర్తించి ఉంటుంది! 'దేశమును ప్రేమించుమన్నా' అని చెప్పే ఆ గీతం నిత్యస్మరణనే కాదు, నిరంతరాచరణను ఉద్బోధించడం లేదా? అది కాలభేదాలను దాటి నూతనత్వాన్ని తెచ్చుకునే సముజ్జ్వలపాఠం కాదా? దాని సారమూ, సందేశమూ జాతి జనులలో ఇప్పటికైనా ఇంకాయా?

మనదేశం లాంటి జనతంత్ర వ్యవస్థలో రాజకీయ, ఆర్థిక, సామాజికాది అన్ని రంగాలకూ ఎప్పటికీ దిశానిర్దేశం చేసే మహిమాన్విత మంత్రం ఆ గీతం! అరవై అయిదు పంక్తుల ఆ గీతంలో మనకు ఎంత చటుక్కున గుర్తొస్తాయో, అంతే అలవోకగా మరచిపోయే పంక్తులు రెండే; అవి, 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్'! ఆ కవితాహారంలో అవే మణిపూసలైన మహావాక్యాలు. దేశాన్ని మట్టిగానూ, భూభాగంగానూ చూడడమే పరిపాటి కాగా, మనుషులుగా గుర్తించిన గురజాడ తన కాలానికి ఎన్నో మన్వంతరాలు ముందున్నాడు. దేశమంటే మనుషులని ఎలుగెత్తి చాటడంలో వేల సంవత్సరాల వెనక్కీ వెళ్లగలిగిన విలక్షణ క్రాంతదర్శి ఆయన. దేశమూ, రాజ్యమూ అనే భావనే అంకురించని గణసమాజంలో అస్తిత్వానికి మనిషే మణిదీపమూ, కొలమానమూనూ...

గురజాడ గీతోపదేశానికి పూర్తి వ్యతిరేకదిశలో నేటి మన ప్రజాస్వామికగమనం సాగుతున్న వైనాన్ని ఆ గీతంలోని ప్రతి చరణమూ ఛెళ్ళున చరచి చెబుతుంది. వొట్టి మాటలు కట్టిపెట్టి, గట్టి మేలు తలపెట్టమంటాడాయన. మంచి గతమున కొంచెమే, మందగించక ముందుకడుగేయమంటాడు. వ్యర్థకలహం వద్దనీ, కత్తి వైరం కాల్చమనీ హితవు చెబుతాడు. దేశాభిమానపు గొప్పలు మానేసి జనానికి నికరంగా పనికొచ్చేది చేసి చూపమంటాడు. దేశస్థులంతా చెట్టపట్టాలు వేసుకు నడవాలనీ, అన్ని జాతులూ, మతాలూ అన్నదమ్ముల్లా మెలగాలనీ సందేశిస్తాడు. మతం వేరైనా మనసులొకటై మనుషులుండాలంటాడు. దేశమనే దొడ్డవృక్షం ప్రేమలనే పూలెత్తాలనీ, ఆ చెట్టు మూలం నరుల చెమటతో తడిసి ధనమనే పంట పండించాలనీ స్వప్నిస్తాడు...

మరో రెండురోజుల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబవుతున్న భారత జనతంత్ర ప్రస్థానం గురజాడ చూపిన జాడకు ఏ కొంచెమైనా దగ్గరగా ఉందా? వొట్టి మాటల వరదలో గట్టి మేలు గడ్డిపరక అయింది. మంచి అంతా గతంలోనే ఉందని చెప్పి జనాన్ని వెనకడుగు పట్టించడమే రాజకీయమైంది. దేశం వ్యర్థకలహాలు, కత్తివైరాలతో సంకుల సమరాంగణమైంది. జనాన్ని చీల్చి పాలించడమే అధికార పరమపదానికి సోపానమైంది. దేశమనే దొడ్డవృక్షం ప్రేమలనే పూలెత్తడం లేదు; వైర, విద్వేషాల విరితావులు వీస్తోంది. ఆ చెట్టు మూలం మనుషుల చెమటతో తడిసి ధనమనే పంట పండించాలన్న కవి ఆశాభావం, ఇప్పటికీ గట్టిగా వేటుపడని నిరుద్యోగపు జడలమర్రి కింద నిలువునా సమాధి అయే ఉంది.

దేశమంటే మనుషులనే కాదు, ఆ మనుషులకు ఏది అత్యవసరమో గురజాడ ఉద్ఘాటిస్తాడు. తిండి కలిగితె కండ కలదోయ్, కండగలవాడేను మనిషోయని, మనిషిని నిర్వచిస్తాడు; ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడుతుందంటాడు; మనిషి సంపూర్ణ జవసత్త్వాలతో హుందాగా శిరసెత్తుకు జీవిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామి అవడానికీ, తిండిపుష్టికీ ఉన్న అన్యోన్య సంబంధాన్ని ఆనాడే నొక్కిచెబుతాడు. అటువంటిది, యావత్ప్రజలకూ పుష్టికరమైన ఆహారాన్ని సమకూర్చే లక్ష్యానికి ఇప్పటికీ యోజనాల దూరంలోనే ఉన్నాం. పోషకాహార లోపంతో ఉసూరుమంటున్న ప్రపంచ బాలల్లో 50 శాతం భారత్‌లోనే ఉన్నారనీ, కేవలం పదిశాతం మందికే పోషకాహారం అందుతోందనీ గణాంకాలు చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం, అయిదేళ్ళ లోపు వయసు పిల్లల్లో శారీరకమైన ఎదుగుదల లోపించినవారు 35 శాతానికి పైగా, బలహీనులు దాదాపు 20 శాతమూ ఉన్నారు. రక్తహీనతను ఎదుర్కొంటున్న పురుషులు, మహిళలు, పిల్లల శాతం గరిష్ఠంగా 67 నుంచి కనిష్ఠంగా 25 వరకూ ఉంది. 2023 లెక్కల ప్రకారమే మన దేశంలో 74 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదు. ప్రపంచ ఆకలి సూచిలో భారత్ స్థానం ఆందోళన గొలుపుతూ 28.7 దగ్గర ఉంది.

భారత్ త్వరలోనే 5 ట్రిలియన్ల ఆర్థికత అవుతుందనీ, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికతలలో మూడవది కాబోతోందనీ పాలకులు అరచేతి స్వర్గాలు ఆవిష్కరిస్తుంటే అసలు నిజాలు ఇలా నిలువునా వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికీ దేశ జనాభాలో సగానికి పైగా, 81 కోట్లమంది నెలకు అయిదు కిలోల రేషన్ పైనే ఆధారపడుతున్నారు. ఈ మాత్రానికీ నోచుకోని వలస, అసంఘటిత రంగ శ్రామికులు 8 కోట్లమంది ఉన్నారు. జనాభా లెక్కల సేకరణ సకాలంలో జరిగి ఉంటే ఈ సంఖ్య ఇంకా పెరిగేదంటున్నారు. కోవిడ్ దరిమిలా వీరిని కూడా ఆహార భద్రతా చట్టం కిందికి తేవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరయ్యాయి. పైగా తాజా బడ్జెట్‌లో ఆహార సబ్సిడీపై ఇంకా కోత పడింది. పోషకాహార లోపం వల్ల భారత్ తన స్థూల జాతీయోత్పత్తిలో ఏకంగా 4 శాతం నష్టపోతోంది.

తిండికి, కండకు, మనిషికి; దేశాభివృద్ధిలో మనిషి పాత్రకు ఉన్న అన్యోన్యాన్ని ఆనాడే చెప్పిన గురజాడది ఎంత గొప్ప ముందుచూపు! దేశభక్తిని, దేశభుక్తితో మేళవించిన గురజాడ గీతం అంతర్జాతీయ గీతమే కాగలిగినదైనా రాష్ట్రీయ గీతం కూడా కాకపోవడం విషాదం కాదూ!?

మాయాలోకపు జీవన నైపుణ్యాలు

కామెంట్



కరణ్ థాపర్

మోసం ఏ రూపంలోనైనా మనల్ని మాయలో పడేసే లోకంలో జీవిస్తున్నాం! ఒకరికి ఒకరం ఎన్ని జాగ్రత్తలు చెప్పుకుని మోసపోవటం అన్నది ఎప్పుడూ కొత్తగా జరుగుతుంది. కాలింగ్ బెల్ కొడతారు. ఫలానా కంపెనీ నుంచి వచ్చాం అంటారు. మనల్ని బుట్టలో పడేసి, 'సర్దుకుని' వెళ్లిపోతారు... ఇదొక రకం మోసం! ఎవరో ఒక పెద్ద కంపెనీ నుంచి ఫోన్ చేస్తారు. మీరు ఫారిన్ ట్రిప్‌కి ఎంపికయ్యారని చెబుతారు. ఫలానా చోటుకు రమ్మంటారు. వెళ్లాక అక్కడ మనల్ని పెద్ద వెంచర్‌లో ఇరికించేస్తారు... ఇది ఇంకో రకం మోసం! ఇక ఓటీపీ మోసాలైతే ఏ మార్గంలో మనల్ని వెతుక్కుంటూ వస్తాయో అంతే పట్టదు. అనుక్షణం జాగ్రత్తగా ఉండటం, ప్రతిదాన్నీ అనుమానించటం జీవితానికి ఇప్పుడు అవసరమైన నైపుణ్యాలు అయ్యాయి!

వాట్సాప్‌లో తరచూ మిమ్మల్ని హెచ్చరిస్తూ వస్తుండే సందేశాల వంటిదే ఇది. గడప గడపకూ తిరిగే సేల్స్‌మెన్‌తో జాగ్రత్త, రాత్రికి రాత్రి బిచాణా ఎత్తేసే కంపెనీల ఆకర్షణీయమైన ఆఫర్‌ల ఎరకు చిక్కుకోకండి, బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని చెప్పి మిమ్మల్ని మీ క్రెడిట్ కార్డు పిన్ నెంబర్ అడిగితే ఇవ్వకండి... అంటూ అప్రమత్తం చేసే మెసేజ్‌లు నాకు నిరంతరం వస్తూనే ఉంటాయి. మీక్కూడా వస్తుంటాయని కచ్చితంగా చెప్పగలను. అలా వారు ఒక హెచ్చరికగా తప్పించాలనుకున్న సంఘటన గతవారం నా సోదరి కిరణ్ విషయంలో జరిగింది.

శనివారం మధ్యాహ్నం ఆమె ఇంటి కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపు తీయగానే ద్వారం ముందు ముగ్గురు వ్యక్తులు కనిపించారు. తాము ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) ఇంజినీర్లమని చెప్పుకున్నారు. గ్యాస్ కనెక్షన్‌ను పరిశీలించేందుకు వచ్చామని చెప్పారు. అదృష్టవశాత్తూ వారిని గుర్తింపు కార్డులు అడగాలన్న ఆలోచన కిరణ్‌కు వచ్చింది. వాళ్లవి చూపించినప్పటికీ, నేననుకోవటం అవి నకిలీవి అయుంటాయని. ఆమె తెలివిగా ఇంకో పని చేసింది. ఆ ఐడీ కార్డులను ఫొటో తీసుకుంది. వారి ఫోన్ నెంబర్‌లను అడిగి రాసుకుంది. అందుకు వాళ్లు కంగు తిన్నప్పటికీ వాళ్ల ఆత్మవిశ్వాసం ఏ మాత్రం సడలలేదు.

కిరణ్... వాళ్లని వంటింట్లోకి తీసుకొని వెళ్లారు. కానీ, ఇంట్లో పనిమనుషులు కూడా వాళ్లతో పాటు అక్కడ ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఆ ముగ్గురు వ్యక్తులు గ్యాస్ పైపులను 'తనిఖీ' చేసి, ఆ పైపులలో ఒకటి వారెంటీ గడువును దాటేసింది కనుక దానిని మార్చవలసిన అవసరం ఉందని చెప్పారు. అందుకు కిరణ్, 'మాది పాతబడిపోతే మిగతా ఫ్లాట్‌లో ఉన్నవాళ్లవీ పాతబడి ఉండాలి కదా! మా గ్యాస్ కనెక్షన్‌లన్నీ ఒకేసారి బిగించినవి' అని వారితో అన్నారు.

ఆ మాటకు, ఆ ముగ్గురిలో సీనియర్ ఇంజినీర్‌నని చెప్పుకున్న వ్యక్తి ఏ మాత్రం వెరపు లేకుండా పక్క ఫ్లాట్‌లో చెక్ చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. కొన్ని నిమిషాల తర్వాత తిరిగొచ్చి, 'వాళ్ల పైప్ బాగానే ఉంది. కొత్తది మార్చి ఉంటారు, మీక్కూడ కొత్తది వెయ్యవలసిన అవసరం ఉంది' అని కిరణ్‌తో చెప్పాడు.

ఆ ముగ్గురు వ్యక్తులు పైప్‌ను మార్చే పని ప్రారంభించగానే కిరణ్



తన దగ్గరున్న ఐజీఎల్ నెంబర్‌లకు మెసేజ్ చేయటం మొదలు పెట్టారు. 'పైపును మార్చాలని, మా ఇంజినీర్లను పంపిస్తున్నామని' ఐజీఎల్ తనకు ముందే సమాచారం ఇవ్వకపోవటం పట్ల కిరణ్ విసుగ్గా ఉన్నారు. పది, పదిహేను, ఇంకా ఎక్కువ నెంబర్‌లకే ఆమె మెసేజ్ పెట్టి ఉంటారు. వాటిల్లో ఒకటి ఐజీఎల్ పూర్వపు సీఈవోది అన్నట్లు ఆమెకు గుర్తు.

ఆ నెంబర్‌ల నుండి రిప్లయ్‌లు రావటానికి మరీ అంత సమయం ఏమీ పట్టలేదు. ఆ వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఐజీఎల్ పంపినవారు కాదు! వారు మోసగాళ్లు. అంతకన్నా కూడా, 'వాళ్లను పైపులు మార్చనివ్వకండి' అని, 'ఐజీఎల్ సిబ్బంది ముసుగులో కొందరు మోసాలకు పాల్పడుతున్నార'ని హెచ్చరిస్తూ ఐజీఎల్ నంబర్లలో కొన్నింటి నుంచి కిరణ్‌కు వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయి. ఆ మనుషుల్ని తక్షణం బయటికి పంపించేయండి అన్నది వారి నుంచి వచ్చిన స్పష్టమైన సందేశం. నిజంగానే వాళ్లు మోసగాళ్లు!

కానీ అప్పటికే వారు పైపును తొలగించి, దాని స్థానంలో మరొక పైపును బిగించారు. చిత్రంగా వాళ్లు ఆ పనికి డబ్బులు అడగలేదు. పైగా వెళ్లిపోయే తొందరలో ఉన్నట్లు కనిపించారు. బహుశా కిరణ్ ఐజీఎల్ వాళ్లతో మాట్లాడినందువల్ల భయపడినట్లున్నారు. తదుపరి గ్యాసు బిల్లులో పైపు మార్పిడి చార్జీలు కలిసి ఉంటాయని చెప్పి బయల్దేరుతూ, అనుకోకుండా కందెన అంటిన ఒక ఫోల్డర్‌ను అక్కడ వదిలి వెళ్లారు.

ఈలోపు ఐజీఎల్ కంపెనీ వాళ్లు కిరణ్‌కి ఫోన్ చేసి, తక్షణం తమ ఇంజనీర్లను ఆమె ఇంటికి పంపుతున్నట్లు చెప్పారు. నిజానికి పూర్వపు సీఈఓ నెంబరు అయివుండవచ్చని మెసేజ్ ఇవ్వటం ద్వారా ఆమె చేసిన ప్రత్యేక ప్రయత్నం ఐజీఎల్ సొంత ఇంజనీర్‌లు – మెక్ కాయ్ కంపెనీ వాళ్లు – వీలైనంత త్వరగా ఆమె ఇంటికి చేరుకుని, ఆ మోసగాళ్లు బిగించి వెళ్లిన కొత్త పైప్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించటాన్ని సాధ్యం చేసింది.

మొత్తానికి మోసం జరగబోయిందన్నది స్పష్టం. కిరణ్ వసంత్ విహార్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కి ఫోన్ చేసిన వెంటనే ఆయన తమ పోలీసులను పంపారు. ఆఫీసర్ స్పందన నిజాయితీగా, చురుకుగా, సౌమ్యంగా ఉందని కిరణ్ చెప్పారు. ఆ ముగ్గురు మోసగాళ్లు తమ 'పని' పూర్తి చేసి వెళ్లిన కొద్దిసేపటికే ఐజీఎల్ ఇంజనీర్లు, పోలీసులు దాదాపుగా ఒకేసారి అక్కడికి చేరుకున్నారు.

మార్చిన పైపు నకిలీది అవటమే కాకుండా, దాని దిగువ భాగం సరిగా బిగించి లేదని ఐజీఎల్ ఇంజనీర్లు కిరణ్‌కు చెప్పారు. అంటే ఒకవేళ గ్యాస్ స్విచ్ ఆన్ చేసి ఉంటే లీక్ అయుండేది. కిరణ్ ఫొటో తీసిన గుర్తింపు కార్డుల్ని, ఆ మోసగాళ్లు వదిలి వెళ్లిన ఫోల్డర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి కిరణ్ తీసుకున్న ఫోన్ నెంబర్‌లను బట్టి వారిని కనిపెట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ విధంగా 90 నిమిషాల వ్యవధిలో పరిస్థితి చక్కబడి, నష్టం జరగకుండా ఆగింది. ఇందుకు విరుద్ధంగా జరిగి ఉంటే కిరణ్ దాని గురించి చెప్పవలసి వచ్చినప్పుడు అది మరింత దారుణమైన పరిస్థితిగా ఉండేది. అదృష్టవంతురాలు. అలా జరగలేదు.

మూడు విషయాలను ఆమెను రక్షించాయని నేను అంటాను. గుర్తింపు కార్డులను ఫొటో తీసుకోవటం, వాళ్ల ఫోన్ నెంబర్లను అడిగి తీసుకోవటం, 'మీ ఇంజినీర్లను పంపిస్తున్నట్లు ముందుగా నాకెందుకు సమాచారం ఇవ్వలేద'ని ఐజీఎల్ వాళ్లను ఆమె అడగటం! అన్నిటి కన్నా ముఖ్యంగా ఆ మోసగాళ్లు 'పాడైపోయిన' పైపును మార్చే 'పని' మీద ఉన్నప్పుడు తన ఇంట్లో పని చేసేవాళ్లు కూడా అక్కడ ఉండేలా జాగ్రత్త పడటం. ఒకవేళ ఆమె ఇవేవీ చేయకపోయుంటే?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మళ్లీ రావాలి!



ఇలాంటి ముఖ్యమంత్రిని ఎక్కడైనా చూశారా? ప్రజలకు ట్విట్టర్ ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు. పదవిలో లేకున్నా నిరంతరం ప్రజా సేవలోనే ఉంటున్నారు. ఈయన మళ్లీ సీఎం అవటం అవసరం. (జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయ్ సోరేన్ ఒక రోగికి సహాయం చేయమని కోరుతూ రాంచీ డిప్యూటీ కమిషన ర్‌కు, రాంచీ 'రిమ్స్' ఆసుపత్రికి, న్యూరో సర్జన్ డాక్టర్ వికాస్‌కు ట్వీట్ పెట్టడంపై).

– డాక్టర్ ధ్రువ్ చౌహాన్, హెల్త్ యాక్టివిస్ట్

ఏం మారలేదు!



కొన్నిసార్లు... వేరే కాలాలు, సమయ సందర్భాల నాటి మాటలు నేటికీ సరిగ్గా సరిపోతాయి! అందుకే, నేను – నా కూతురు కలిసి ఈ రోజు 'చారులత' (1964) సినిమా చూస్తున్నప్పుడు 'ఇక్కడ ఆపు, ఇక్కడ ఆపు, ఇక్కడ ఆపు' అంటూ పాజ్‌లతో చూశాను. నిజానికి బెంగాలీలను ఎవరైనా కాపాడగలరా? నాడు టాగూర్‌ది అదే ప్రశ్న సత్యజిత్‌రేది అదే ప్రశ్న. నేడు మా అమ్మాయిదీ, నాది కూడా!

– సహానా సింగ్, రచయిత్రి

ఆ మాత్రం ఉండదా!



ఏ రోజు చూసినా నా బరువులో 3 కిలోల వరకు అటూ ఇటూ అవుతుంటుంది. భోజనానికి ముందు, భోజనం తర్వాత; రన్నింగ్ ముందు, రన్నింగ్ తర్వాత ఈ తేడా కనిపిస్తుంది. అలాంటిది, జీవిత కాలం ప్రిపరేషన్ తర్వాత – ఒక్క క్షణంలోనైనా తగ్గగల 100 గ్రాముల బరువును అధికంగా ఉన్న బరువుగా పరిగణించి, బంగారు పతకం కోసం పోటీ పడబోతున్న వారిని బయటికి పంపటం పిచ్చికాకపోతే ఏంటి?!

– చేతన్ భగత్, మోటివేషనల్ పర్సనాలిటీ

అదే నిజమైతే..!



2020 ఢిల్లీ అల్లర్ల కేసుల్లో పోలీసులు నిందితులుగా పేర్కొన్న అనేకమంది కార్యకర్తల బెయిల్ దరఖాస్తులను పరిష్కరించటంలో న్యాయస్థానాలలో అనాలోచితమైన జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవి నిజమే కనుకైతే ఇది ఆ నిందితుల స్వేచ్ఛా హక్కులను పూర్తిగా ఉల్లంఘించటమే!

– ప్రశాంత్ భూషణ్, లాయర్

ముందే తెలుసు!



ఆరు నెలల క్రితం నేను నా తదుపరి చిత్రం 'ది ఢిల్లీ ఫైల్స్' కోసం ఇండో–బంగ్లాదేశ్ సరిహద్దులో ఇండియా వైపు ఉన్న వారిని ఇంటర్వ్యూ చేశాను. అప్పుడు నేను గ్రహించినదేమంటే – ఆ గ్రామస్థులకు భారత రాజకీయాల కంటే బంగ్లాదేశ్ రాజకీయాలపైనే ఎక్కువ అవగాహన ఉందని! షేక్ హసీనాపై తిరుగుబాటు జరగబోతోందని వారు ఆనాడే అంచనా వేశారు!

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, బాలీవుడ్ దర్శకుడు

ఎవరికి పట్టింది?



దేశంలోని ముస్లిమేతరులందరి హక్కులను తొలగిస్తూ ఇరాక్ ప్రభుత్వం కొత్త చట్టాన్ని ఆమోదించింది. కనీస వివాహ వయస్సును 9 సంవత్సరాలకు తగ్గించటం ద్వారా బాల్య వివాహాలను సమర్థంగా చట్టబద్ధం చేసింది. ఈ చర్యకు వ్యతిరేకంగా ఆ దేశంలో ఏదైనా నిరసన ఉంటుందా? ఉండక పోవచ్చు!

– డా॥ మాలౌఫ్, జియో పొలిటికల్ కామెంటేటర్

ఇన్ బాక్స్

ఊపిరి తీస్తున్న వాయు కాలుష్యం

మనిషి బ్రతకడానికి ఊపిరి తీసుకుంటాడు. అలాంటిది ఈ మధ్య కాలంలో ఊపిరి తీసుకోవడమే ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించింది. వాతావరణంలో కర్బన ఉద్గారాలు విపరీతంగా పెరిగిపోవడం వలన స్వచ్ఛమైన ప్రాణవాయువు శాతం తగ్గిపోతోంది. దీనివలన చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు అనేక ఆరోగ్య సమస్యలు అనుభవించాల్సి వస్తోంది.

మనం పీల్చే గాలిలో ప్రాణాంతకమైన కాలుష్య కారకాలు కలుస్తున్నాయి. ఊపిరి తీసుకున్న తరువాత శరీరంలోకి చేరిపోయి అవయవాలను నిర్వీర్యం చేస్తున్నాయి. మనదేశంలో అతిపెద్ద నగరాలలో సంభవిస్తున్న మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలకు వాయు కాలుష్యమే కారణమని తాజా అధ్యయనంలో తెలిసింది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలలోని గాలిలో అత్యంత సూక్ష్మమైన 'పి.ఎం 2.5' ధూళి కణాలు అధికంగా ఉన్నట్లు ఒక నివేదిక తెలిపింది. మనదేశ రాజధాని ఢిల్లీ మహానగరంలో చాలా మరణాలకు వాయు కాలుష్యమే కారణమవుతున్నట్లు తెలిపింది. పి.ఎం అంటే పార్టిక్యులేట్ మ్యాటర్. 2.5 అంటే... గాలిలో ఉండే సూక్ష్మ కణాల వ్యాసం 2.5 మైక్రోమీటర్లు లేదా అంతకంటే తక్కువ ఉన్నవని అర్థం. ఈ కణాలు ఆరోగ్యానికి చాలా హాని చేస్తాయి. ఇవి ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు, శ్వాసనాళాల మీద ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. ఈ గాలిలోకి చేరే సల్ఫేట్లు, బొగ్గు సంబంధమైన కలుషితాల వంటివి ఊపిరితిత్తులకు పట్టేస్తున్నాయి. గుండెకు వెళ్లే రక్తపునాళాల్లో పేరుకుపోతున్నాయి.

మనదేశంలోని పెద్ద పెద్ద నగరాలలో నిత్యం వెలువడుతున్న పి.ఎం 2.5 ధూళికణాల వలన మరణాలు రేటు నానాటికీ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఒక క్యూబిక్ మీటర్ గాలిలో 2.5 ధూళి కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే రోజువారీ మరణాల సంఖ్య 1.4 శాతం పెరుగుతున్నట్లు ఒక పరిశోధనలో గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమాల ప్రకారం ఒక రోజు అనగా 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 15 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం వుండదు, అంతకంటే పెరిగితే ముప్పు తప్పదు.

భారతదేశ వాయు నాణ్యతా ప్రమాణాల ప్రకారం 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 60 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం అంతగా ఉండదు. కానీ మనదేశంలో ప్రస్తుతం 75 మైక్రోగ్రాముల కంటే అధికంగానే ఉంటున్నట్లు తెలిసింది. క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే మరణాల రేటు సగటున 3 శాతం దాకా పెరుగుతున్నట్లు గుర్తించారు. వాయు కాలుష్యం వలన బ్రెయిన్ స్ట్రోక్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ వ్యాధులు, న్యూమోనియా, శ్వాసకోశ ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది. కళ్లు, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల్లో చీకాకుతో పాటు దగ్గు, తుమ్ములు పెరుగుతాయి. దీనితో పాటు ఆస్తమా లాంటి సమస్యలు వస్తాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ వాయుకాలుష్యం ఇలానే పెరిగితే భూమికి రక్షణ కవచం అయిన ఓజోన్ పొర క్షీణించడం ఎక్కువవుతుంది. ఓజోన్ పొర దెబ్బతింటే యూవీ కిరణాలు నేరుగా భూమిపైన పడడం వలన చర్మ, నేత్ర సమస్యలు వస్తాయి. వ్యవసాయంపైన కూడా ప్రభావం చూపుతుంది. కాబట్టి వాయుకాలుష్యం తగ్గించడానికి ప్రభుత్వాలు సాధ్యమైనంత సత్వర చర్యలు తీసుకోవాలి.

– మోతె రవికాంత్ । సేఫ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, హైదరాబాద్

పగటి నిద్ర మేలే సుమా!

అభిప్రాయం



డా॥ కె. బి. గోపాలం

పగటి నిద్ర పనికి చేటు అన్నారు మనవాళ్లు. కానీ పరిశోధకులు మరోరకంగా అంటున్నట్టున్నారు. పగటి పూట పని చేసుకునేటప్పుడు కళ్ళు బరువెక్కుతాయి. నిద్ర వస్తున్న భావన కలుగుతుంది. అప్పుడు కాసేపు పడుకుంటే తప్పా? అంటే కాదు అంటున్నారు పరిశోధకులు. ఆరోగ్యం దృష్ట్యా చూస్తే కొంతసేపు పడుకోవడం మంచిదే అంటున్నారు. అయితే ఈ పగటి నిద్ర అందరిపైనా ఒకే ప్రభావం కలిగిస్తుందా అన్న ప్రశ్న కూడా ఉంది. చాలామందిలో మాత్రం కొంతసేపు పడుకుంటే మంచి జరుగుతుంది అని గమనించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. క్రమంగా ప్రతి నిత్యం మధ్యాహ్నం కొంచెం సేపు పడుకుంటే అన్ని రకాల మంచిదే. దాని వల్ల గుండెకు సంబంధించిన సమస్యలు దూరం అవుతాయి అని కొంత కాలం క్రితమే తెలుసుకున్నారు. మెదడుకు కూడా మంచిదే అంటున్నారు. మెదడు కణాలు తగ్గకుండా ఉంటే జ్ఞాపకశక్తి తగ్గడం అనే సమస్య తగ్గుతుంది.

అయితే ఎంతసేపు పడుకోవాలి అన్నది పెద్ద ప్రశ్న. అరగంట వరకు పడుకుంటే తప్పు లేదు. మెదడుకు మంచి ఆరోగ్యం అందుతుంది, అది పనిచేసే, పెరిగే తీరు సక్రమంగా సాగుతుంది అంటున్నారు విక్టోరియా గార్ఫీల్డ్. ఆమె యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌లో పరిశోధకురాలు.

సరైన సమయంలో కొద్దిపాటి నిద్ర వెంటనే మెదడు మీద ప్రభావం చూపిస్తుంది. ఈ విషయాన్ని చాలా పరిశోధనల్లో నిర్ధారించారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఒక క్రమంలో నిద్రపోతూ ఉంటే వాళ్ల మీద పరిశోధనలు జరిగాయి. పాత పరిశోధనల ఫలితాలను ఇక్కడి ఫలితాలతో సరిపోల్చి చూశారు. నిజానికి 2009లోనే ఇటువంటి పరిశోధనా ఫలితాలు 'స్లీప్ రీసెర్చ్' అనే పత్రికలో వచ్చాయి. కొంతసేపు పడుకున్న వారిలో వారు పరిస్థితులకు ప్రతిచర్య చూపించే తీరు, చురుకుదనం, జ్ఞాపకశక్తి లాంటి అంశాలలో మంచి ప్రభావాలు కనిపించాయి. నిద్రపోయి లేచిన తర్వాత సృజనాత్మకత కూడా పెరుగుతుంది. అంటే కొత్త అంశాలను ఊహించడం కూడా బాగా జరుగుతుంది. ఈ అంశం ఇటీవల పరిశోధనల్లో గమనించారు.

పరిశోధనకు కూర్చున్న వారికి కొన్ని



లెక్కలు ఇచ్చి చేయమన్నారు. ఆ లెక్కల్లో కొన్నింటికి సులభ మార్గాలు ఉన్నాయి. వాటి గురించి మాత్రం వాలంటీర్లకు చెప్పలేదు. ప్రశ్న ఇచ్చిన తర్వాత కాసేపు పడుకుంటే మాకేమీ అభ్యంతరం లేదు అన్నారు పరిశోధకులు. కొద్దిసేపు కునికిన వారు కూడా ఆ లెక్కలను సులభంగా సాల్వ్ చేయగలిగారు. వారికి స్వల్ప మార్గాలు చటుక్కున తోచాయి. అదే ఎక్కువ సేపు నిద్రపోయిన వారిలో మాత్రం ఇటువంటి చురుకుదనం కనిపించలేదు. అంటే మెదడులో ఎక్కడో విరామం కలిగే అవకాశం గల స్థానం ఉందని, దానివల్ల యురేకా అనుభవం కలుగుతుందని పరిశోధకులు భావిస్తున్నారు.

నిద్ర సరిగా రానివారూ, కావలసినంత నిద్ర పోలేని వారు కూడా కొద్దిసేపు పడుకున్నందుకు మంచి ప్రభావాలు ఉంటాయి అంటున్నారు. షిఫ్టులలో పనిచేసేవారూ, చిన్న శిశువులతో బతికే తల్లితండ్రులూ, రాత్రిపూట సరిగా నిద్ర పట్టని పెద్ద వయసు వారూ చిన్న కునుకు వల్ల లాభం పొందినట్టు గమనించారు. రాత్రి షిఫ్టులో పని చేస్తున్న వాళ్లు షిఫ్ట్ మధ్యలో కొద్దిసేపు పడుకుంటే తప్పకుండా నిద్ర మత్తు తగ్గుతుంది. అసలు నిద్ర వస్తున్న భావమే కలుగదు. కొద్దిసేపు పడుకుని లేచిన తరువాత త్వరలోనే పరిస్థితి మారిపోతుంది. వారిలో చురుకుదనం కనిపిస్తుంది.

వర్జీనియా కామన్వెల్త్ యూనివర్సిటీలో పని చేస్తున్న నటాలి డాటోవిచ్ బృందం వారు కూడా ఈ అంశం గురించి పరిశోధిస్తున్నారు. వారికి నిజానికి ఔషధాలు తయారు చేసే కంపెనీలు, వైద్య పరికరాల కంపెనీలు ఆర్థిక సహాయం చేస్తున్నాయి. 20 నిమిషాలు పడుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. గంట నుంచి గంటన్నరసేపు పడుకుంటే మరింత మంచి ఫలితాలు కనిపిస్తాయి అంటున్నారు నటాలి. పడుకుంటే 20 నిమిషాలు పడుకోవాలి, లేదంటే గంటపైన పడు కోవాలి. అంతే కానీ మధ్యలో లేస్తే అంత మంచి ప్రభావం ఉండదు అని గమనించారు.

ఎక్కువ రోజులపాటు ఇలా కునుకులు తీసేవారి మీద ప్రభావం గురించి మాత్రం అంతగా సమాచారం లేదు. నిద్రకు ముఖ్యంగా గుండె ఆరోగ్యానికి గల సంబంధాన్ని గురించి చెప్పడం అంత తేలిక కాదు అని కూడా ఈ పరిశోధకులు అంటున్నారు.

'కొంచెం సేపు నిద్రపోతే మంచిదేనట' అని నిద్రకు ఉపక్రమించేవారు ఫలితాలను గురించి కూడా పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. మంచి ఫలితాలు కనిపిస్తే కొంచెం సేపు నిద్రించవచ్చు. ఆ నిర్ణయం చాలా జాగ్రత్తగా తీసుకోవాల్సినది.

వ్యాసకర్త సైన్స్ విషయాల రచయిత

అర్థం చేసుకోవడంలోనే...

శ్రీ రామకృష్ణ పరమహంస ఓ కథ చెప్పారు. అది ఇలా సాగుతుంది:

''ఊరి పొలి మేరలో ఓ ఆశ్రమంలో గురువు ఉండేవారు. ఆయనకు శిష్యులనేకమంది. ఒకరోజు వారందరినీ కూర్చోపెట్టి... 'ఈ లోకంలో ఉన్నవన్నీ దేవుడి రూపాలే. దానిని మీరు అర్థం చేసుకుని నమస్కరించాలి' అన్నారు. శిష్యులందరూ సరేనన్నారు.



జ్యోతిర్మయం

ఓరోజు ఓ శిష్యుడు గురువుగారు చెప్పిన పని మీద అడవిలోకి బయలుదేరాడు. ఇంతలో 'ఎవరెక్కడున్నా సరే పారిపోండి... మదమెక్కిన ఏనుగొకటి వస్తోంది. దాని కంట పడకండి' అని హెచ్చరిస్తూ ఒక వ్యక్తి పారిపోతున్నాడు. ఈ హెచ్చరికతో అక్కడక్కడా ఉన్నవారు పారిపోయారు. కొందరు చెట్టెక్కి కూర్చున్నారు. కానీ ఈ గురువుగారి శిష్యుడున్నాడు చూశారూ, అతను తన ధోరణిలోనే నడుస్తున్నాడు. పైగా 'నేనెందుకు పరుగెత్తాలి... నేనూ దేవుడు, ఆ ఏనుగూ దేవుడే! ఇద్దరం ఒక్కటే... ఏనుగు నన్నేం చేస్తుంద'నుకుని దారి మధ్యలో నిల్చుండిపోయాడు. ఏనుగు సమీపిస్తోంది. కానీ అతను ఉన్న చోటనే నిల్చున్నాడు. చేతులు రెండూ పైకెత్తి నమస్కరించాడు. పైగా దైవప్రార్థన చేశాడు. ఇంతలో ఏనుగుమీదున్న మావటివాడు కూడా అతనిని పక్కకు తప్పుకోమని హెచ్చరించాడు. కానీ శిష్యుడు ఆ హెచ్చరికను ఖాతరు చేయలేదు. అతను కావాలంటే ఏనుగుని దేవుడిగా భావించవచ్చు. కానీ ప్రతిగా ఏనుగు అలా అనుకోదుగా! అతను చేతులు రెండూ పైకెత్తి నిల్చోడంతో ఏనుగు పని మరింత సులువైంది. అది అతనిని ఒక చుట్ట చుట్టి కింద పడేసి ముందుకు వెళ్ళిపోయింది. అతనికి గాయాలయ్యాయి. విషయం తెలిసి ఆశ్రమానికి చెందినవారు అక్కడికి చేరుకుని కింద పడి ఉన్న అతనిని అతికష్టం మీద గురువుగారి వద్దకు తీసుకుపోయారు. అతను జరిగినదంతా చెప్పాడు. అప్పుడు గురువుగారు 'నువ్వనుకున్నది నిజమే, కానీ మావటివాడు కూడా దేవుడే కదా! అతను నిన్ను హెచ్చరించాడుగా తప్పుకోమని! ఆ మాటైనా పట్టించుకోవాలి కదా' అని చెప్పగా శిష్యుడు అయోమయంగా చూశాడు. 'వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోక పోవడం వల్ల వచ్చిన ప్రమాదమిది' అంటూ గురువుగారు కథ ముగించారు.''

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.అష్టమి తె.4.56 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ఉ.11.45 నుండి 1.25 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.20 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.53 వరకు, **అమృతఘడియలు:** రా.9.56 నుండి 11.44 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.25.

వ్యవసాయం యువరైతు దూరం!

పెట్టుబడి ఖర్చుకు తగ్గ ఆదాయం రాక అవస్థలు

- చిన్న భూకమతాలు, వాతావరణ అనిశ్చితి, తక్కువ దిగుబడులూ కారణం
- కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ ఉపాధి వైపు అడుగులు
- స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్–2024 నివేదికలో వెల్లడి
- యువతకు నైపుణ్యాల పెంపుతో ఆదాయం పెంచొచ్చంటున్న నిపుణులు



వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికవేడు గ్రామానికి చెందిన ఇతని పేరు గారె రాజు. అతనికి వారసత్వంగా ఎకరం భూమి ఉంది. ఇది పంట సాగుకు సరిపోకపోవడంతో 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, మొక్కజొన్న, పత్తి సాగు చేశాడు. ట్రాక్టర్ కూడా కొన్నాడు. 2020 నుంచి 2024 వరకు రూ. లక్షలు వెచ్చించి వ్యవసాయం చేసినా కష్టానికి తగ్గ ప్రతిఫలం రాలేదు. దీంతో ఫొటోగ్రఫీని జీవనాధారంగా మార్చుకున్నాడు. వ్యవసాయంపై ప్రేమ ఉన్నా సాగు ఖర్చులకు తగ్గట్టు లాభాల్లేక సాగుకు దూరమైనట్లు చెప్పాడు.

రాష్ట్రంలో భూ కమతాల శాతమిలా..

	సన్నకారు రైతులు	చిన్నకారు రైతులు	పాక్షిక మధ్యతరహా	మధ్యతరహా	పెద్ద భూకమతం
2015-16	64.6	23.7	9.5	2.1	0.2
2021-22	68.7	22.7	9.1	1.4	0.1

సాక్షి, వరంగల్: రాష్ట్రంలో వ్యవసాయానికి యువరైతులు దూరమవుతున్నారు. వాతావరణ అనిశ్చిత పరిస్థితులు, తక్కువ దిగుబడులకు తోడు చిన్న భూ కమతాల సంఖ్య పెరగడంతో ఆ విస్తీర్ణంలో పండిన పంటకు వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోక ఈ రంగాన్నే వీడుతున్నారు. నగరీకరణకు అనుగుణంగా గ్రామాల్లోనూ జీవనోపాధి ఖర్చులు పెరగడంతో అంత మేర ఆదాయం పొందేందుకు ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మరలుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని డెవలప్‌మెంట్ ఇంటెలిజెన్స్ యూనిట్, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇంక్యుబేటర్, ట్రాన్స్‌ఫార్మింగ్ రూరల్ ఇండియా సంస్థలు నిర్వహించిన సంయుక్త అధ్యయనంలో వెల్లడైంది. ఈ సంస్థలు 'స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్–2024' పేరుతో ఇటీవల నివేదికను విడుదల చేశాయి. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లతో యువ రైతులు ఈ రంగాన్ని వీడి పట్టణాలు, నగరాల్లో చిన్నపాటి ఉద్యోగాలు చేసుకొనేందుకు లేదా ఇతర రంగాలను ఎంచుకొనేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని నివేదిక పేర్కొంది. దాదాపు 60 శాతం మంది యువత సాగును వీడారని పేర్కొంది.

చిన్న కమతాలు ఎక్కువే... : రాష్ట్రంలో సగటు భూకమతాల విస్తీర్ణం ఒక హెక్టార్ (2.47 ఎకరాలు) నుంచి 0.89 హెక్టార్ల (2.19 ఎకరాలు)కు తగ్గింది. కుటుంబాల విభజనతో భూముల పంపకంతోపాటు కొత్తగా సాగు, జీవనోపాధి కోసం సొంతంగా భూముల కొనుగోళ్లకు మొగ్గు చూపడం తదితర కారణాలతో చిన్న కమతాలు పెరిగాయి. 2.47 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం గల భూమిని సన్నకారు, 2.48 నుంచి 4.94 ఎకరాలను చిన్నకారు, 4.95 ఎకరాల నుంచి 9.88 ఎకరాలను పాక్షిక మధ్యతరహా, 9.89 నుంచి 24.77 ఎకరాలుంటే మధ్యతరహా, 24.78 ఎకరాలకన్నా పైన ఉంటే పెద్ద భూకమతంగా పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, కొమురం భీం, భద్రాద్రి జిల్లాల్లో 1.5, 1.4, 1.3 హెక్టార్ల విస్తీర్ణం సగటున ఉంటే కరీంనగర్, వరంగల్ జిల్లా, మెదక్ జిల్లాల్లో 0.75, 0.74, 0.60 హెక్టార్లుగా సగటు విస్తీర్ణం ఉంది. రాష్ట్రంలో చిన్న కమతాలతో సేద్యం ఎక్కువగా జరుగుతుందని ఇటీవల విడుదలైన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక పేర్కొంది.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలి



వ్యవసాయానికి దూరమవుతున్న యువతకు బ్రేక్ వేయాలంటే విలువ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలి. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తృతంగా నెలకొల్పాలి. మొక్కజొన్నల నుంచి పేలాల తయారీ, మామిడి నుంచి గుజ్జు తీయడం, మిరపకాయ నుంచి కారం... ఇలా వివిధ పరిశ్రమలను గ్రామాల్లో నెలకొల్పాలి. అలాగే యువతకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలు పెంపొందించాలి.

– ఉమారెడ్డి, ఏడీఆర్, వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం

ట్రైనింగ్ కోర్సులు అందించాలి



యువ రైతులకు పంటల సాగు పద్ధతులపై సర్టిఫికెట్ ట్రైనింగ్ కోర్సులు అందించాల్సిన అవసరం ఉంది. యాంత్రీకరణతో కూడిన యాజమాన్య పద్ధతులు తీసుకురావాలి. కస్టమ్ హైరింగ్ సెంటర్లను విస్తృతం చేయాలి. ఈ కేంద్రాల ద్వారా పనిముట్లను అద్దెకు ఇస్తే యువ రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది. ఈ దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలి. అప్పుడే యువ రైతులకు మేలు జరుగుతుంది.

– కె. భాస్కర్, సంచాలకుడు, జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం, మహబూబాబాద్ జిల్లా

క్లుప్తంగా...

ఆ పోలీసులపై చర్యలు తీసుకోండి

- షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బాధిత దళిత మహిళ ఫిర్యాదు

షాద్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత మహిళపై పోలీసుల దాడి ఘటనలో బాధితురాలు ఆదివారం షాద్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. తనను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ భర్త భీమయ్యతో కలిసి పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫరూఖ్‌నగర్‌లోని హరిజనవాడకు చెందిన నాగేందర్ ఇంట్లో బంగారం చోరీ జరిగిన ఘటనలో విచారణ నిమిత్తం గత నెల 30న షాద్‌నగర్ డీఐ రామిరెడ్డితో పాటు మరో నలుగురు కానిస్టేబుళ్లు కలిసి తనతో పాటు తన భర్త భీమయ్య, కుమారుడి (మైనర్)ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపారు. పోలీసులు తన బట్టలు విప్పదీసి నిక్కరు వేసి బూతులు తిడుతూ, మర్మాంగాలపై విపరీతంగా కొట్టినట్లు పేర్కొన్నారు. తన భర్త, కుమారుడిని సైతం కొట్టినట్లు చెప్పారు. విషయం బయటకు చెబితే పెట్రోల్ పోసి తగలబెడతామని తమను బెదిరించారని, ఫిర్యాదుదారుడైన నాగేందర్ కారులోనే ఇంటికి పంపించినట్లు వివరించారు. తమను అకారణంగా కొట్టిన డీఐ రామిరెడ్డితో పాటు మిగతా కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేయాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలీసుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. కాగా, 24 తులాల బంగారంతో పాటు రూ.2లక్షల నగదు హరిజనవాడకు చెందిన సునీత చోరీ చేసిందని ఆరోపిస్తూ బాధితుడు నాగేందర్ ఆదివారం సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

పిచ్చికుక్క దాడి

- ఆరుగురికి తీవ్ర గాయాలు



నర్సయ్య



పోసాని

పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఆదివారం ఉదయం ఓ పిచ్చి కుక్క దాడి చేసి ఎనిమిది మందిని గాయపరిచింది. గ్రామానికి చెందిన వేల్పుల నర్సయ్య, ఇందూర్ పోసాని, రాజ్యు గంగాధర్, నూత్‌పల్లి లలిత, బట్టు లాస్య, జలీల్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో రెండు నెలల క్రితం ఇలాగే కుక్కలు దాడి చేసి పలువురిని గాయపరిచాయని గ్రామస్తులు వెల్లడించారు.

విప్లవ ద్రోహులను ప్రజలు క్షమించరు

- మావోయిస్టు బీకే –ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: విప్లవ ద్రోహులు, కోవర్టులను పార్టీ, ప్రజలు ఎన్నటికీ క్షమించరని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – తూర్పుగోదావరి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూరజ్‌కుండ్ బహుముఖ దాడిలో భాగంగా ఆపరేషన్ కగార్ చేపడుతున్న ప్రజాయుద్ధాన్ని నిర్మూలించలేరని ఆయన ఆదివారం విడుదల చేసిన ఓ లేఖలో తెలిపారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన కాకర్ల రవి 2016లో మావోయిస్టుల్లో చేరగా..2023లో ఆయన ప్రవర్తనలో మార్పులను గమనించి ఇంటికి పంపిస్తే, తన భార్య కల్పనతో కలసి పోలీసులకు లొంగిపోయాడని పేర్కొన్నారు. ఆపై పలువురిని పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమేణా బాపట్ల జిల్లా చీరాలకు చెందిన దుండి తేజ అమర్‌నాథ్ అలియాస్ అర్జున్ పార్టీలో పనిచేస్తూనే రవి మాటలు నమ్మి కోవర్టుగా మారాడని తెలిపారు. వీరిని ప్రజలు క్షమించరని ఆజాద్ హెచ్చరించారు.

35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక

- పదిహేను రోజుల్లో సీతారామ ఎత్తిపోతలకు అన్ని అనుమతులు
- 15వ తేదీన సీఎం చేతుల మీదుగా 'సీతారామ' పంప్‌హౌజ్‌ల ప్రారంభం
- ట్రయల్‌రన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హాజరైన మంత్రులు తుమ్మల, పొంగులేటి



సీతారామ ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్2 ట్రయల్‌రన్‌లో భాగంగా మోటార్ ఆన్ చేయడంతో ఉబికి వస్తున్న గోదావరి జలాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల నుంచి 35 లక్షల ఎకరాల వరకు కొత్త ఆయకట్టును అందుబాటులోకి తీసుకొస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకపల్లి మండలం పూసుగూడెం వద్ద నిర్మించిన రెండో పంప్‌హౌజ్‌లో ఆదివారం ఆయన మోటార్ల ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. మోటారు స్విచ్ వేయగానే గోదావరి నీళ్లు గ్రావిటీ కెనాల్‌లోకి చేరి పంప్‌హౌజ్ –3 దిశగా పరుగులు పెట్టాయి. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి ఉత్తమ్ గోదావరి జలాలకు పూజలు చేశారు. కాగా, ఇదేరోజు జరగాల్సిన మూడో పంప్‌హౌజ్ ట్రయల్‌రన్‌ను వాయిదా వేశారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు..

రెండో పంప్‌హౌజ్‌లో ట్రయల్‌రన్‌ను ప్రారంభించాక మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి రంగంపై రూ.1.80 లక్షల కోట్లను వెచ్చించినా నామమాత్రంగానే కొత్త ఆయకట్టును అందుబాటులోకి తెచ్చిందని విమర్శించారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును అందుబాటులోకి తేవాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా, గోదావరి నుంచి సీతారామ ప్రాజెక్టు ద్వారా 67 టీఎంసీల నీటిని వాడుకునేందుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఉత్తమ్ ఆరోపించారు. కానీ ఈ అంశంపై తాము దృష్టి సారించి, కేంద్రంతో చర్చించామని.. మరో పది, పదిహేను రోజుల్లో కేంద్రం నుంచి అన్ని అనుమతులు వస్తాయనే నమ్మకం ఉందని తెలిపారు. ఈనెల 15వ తేదీన ప్రాజెక్టు పంప్‌హౌజ్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, అదేరోజు వైరాలో జరిగే సభలో రూ.2 లక్షల రుణమాఫీ చెక్కులను పంపిణీ చేస్తామని వెల్లడించారు.

పీవీ హయాం నుంచి

గోదావరి నీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందించాలని పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయం నుంచి ప్రయత్నాలు జరగ్గా.. అవి ఇన్నాళ్లకు నెరవేరుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రధాన కాల్వ వెంట డి్స్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు వెంటనే ప్రారంభించేలా అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కనీసం రెండు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందే విధంగా పనులు జరగాలని ఆదేశించారు.

తలాతోక లేకుండా

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జలయజ్ఞం ద్వారా రూ.3,500 కోట్ల వ్యయంతో మొదలుపెట్టిన ప్రాజెక్టులను తెలంగాణ ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన ఓ మహానుభావుడు (మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి) తలాతోక లేకుండా రీ డిజైన్ పేరుతో ఆ వ్యయాన్ని రూ.18 వేల కోట్లకు పెంచారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆ ప్రభుత్వం గడిచిన ఏడేళ్లలో పొంతన లేకుండా అక్కడో పని, ఇక్కడో పని చేయడంతో రూ.8వేల కోట్లు వెచ్చించినా ఎకరాకు కూడా నీరు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ లోపాలు సవరిస్తూ, పరిస్థితులను చక్కదిద్దుతున్నామని తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి టన్నెళ్లు, డి్స్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణం పూర్తి చేసి పొలాల్లోకి గోదావరి నీరు పారిస్తామని చెప్పారు.

వడ్డె రాజు ఎక్కడున్నాడు?


- పెరోల్‌పై బయటకు వచ్చిన ఖైదీ.. కనిపించని ఆచూకీ
- తాజాగా హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో వెలుగులోకి..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చిన ఖైదీ ఇంటికి వెళ్లలేదు..నాలుగేళ్లుగా ఎక్కడ ఉన్నాడు.. ఎంతకీ అతని ఆచూకీ ఎక్కడో.. ఏ వివరాలూ తెలియడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పోలీస్ స్టేషన్ పరిధిలో 2014లో మహిళ హత్య కేసులో వడ్డె రాజు చర్లపల్లి జైలుకు వెళ్లాడు. ఆరేళ్ల తర్వాత సత్ప్రవర్తన కింద 17.10.2020న పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. 45 రోజుల తర్వాత అంటే 02.12.2020న చర్లపల్లి జైలులో అతను సరెండర్ కావాలి. కానీ ఇప్పటి వరకు అక్కడకు వెళ్లలేదు. అయితే చర్లపల్లి జైలర్ 2024 ఫిబ్రవరి 14న మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వడ్డె రాజు పెరోల్‌పై బయటకు వచ్చి ఇంకా జైలులో సరెండర్ కాలేదని ఫిర్యాదు చేశాడు. అయితే ఇటీవల మహిళ హత్య కేసులో కింది కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను హైకోర్టు రద్దు చేయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. హైకోర్టు ఆదేశాల మేరకు శిక్ష రద్దు అయిన ఖైదీ విడుదల కావాల్సిన సందర్భంలో జైలులో లేకపోవడం, అప్పటికే పెరోల్‌పై తాత్కాలికంగా బయటకు వచ్చిన వ్యక్తి మళ్లీ జైలులో సరెండర్ కాలేదన్న విషయం బయటకు వచ్చింది. జైలు అధికారులు సైతం 2020 డిసెంబర్‌లో సరెండర్ కావాల్సిన ఖైదీ విషయంలో నిర్లక్ష్యం చేసినట్లు తెలుస్తోంది.

రాజుపై పలు కేసులు: మహబూబ్‌నగర్‌రూరల్ మండలం కోడూర్ గ్రామానికి చెందిన వడ్డె రాజు 23.03.2014 నాడు హన్వాడ మండలం వేపూర్‌కు చెందిన డి.నర్సమ్మ హత్య కేసులో నిందితుడు. 16.04.2014 నాడు ఇదే మండలంలోని కొనగంటిపల్లికి చెందిన జి.అలివేలు జమిస్తాపూర్ వెళ్లడానికి వన్‌టౌన్ దగ్గర వడ్డె రాజు ఆటో ఎక్కింది. ఈ క్రమంలో జమిస్తాపూర్ వైపు వెళ్లిన తర్వాత ఆమెను బెదిరించి కాళ్ల కడియాలు, గొలుసులు అపహరించాడు. ఈ కేసులో ఏడాది 5 నెలల జైలుశిక్ష పడింది. 28.04.2014 నాడు మాచన్‌పల్లి వాగులో దొడ్డలోనిపల్లికి చెందిన వడ్డెర శాంతమ్మ అస్థిపంజరం లభ్యమైంది. ఈ హత్య సైతం వడ్డె రాజు చేసినట్టు విచారణలో ఒప్పుకున్నాడు. 06.05.2014 నాడు జైనల్లీపూర్‌కు చెందిన బి.ఎల్లమ్మ హత్య జరిగింది. 19.05.2014 గుర్తు తెలియని మహిళను హత్య చేసి ఆమె దగ్గర ఉన్న 36 తులాల సిల్వర్ దొంగిలించాడు. రూరల్ పరిధిలో మొత్తం 5 కేసులు నమోదు కాగా వీటిలో ఒక కేసులో శిక్ష అనుభవించగా మరో నాలుగు కేసులను జిల్లా కోర్టు కొట్టివేసింది. దేవరకద్రలో సైతం మరో నాలుగు కేసులు ఉండగా, సదరు కేసులపై స్పష్టత లేదు. ఈ వ్యవహారంపై మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లును వివరణ కోరగా విచారణ చేస్తామని, త్వరలో అదుపులోకి తీసుకొని జైలుకు పంపిస్తామని వెల్లడించారు.

పిల్లలను కాపాడబోయి...

- రైలు ఢీకొని తండ్రి..ఇద్దరు కూతుళ్లు మృతి
- ముగ్గురి మృతికి సాక్షిగా మిగిలిన కన్నతల్లి
- గౌడవెల్లి రైల్వే స్టేషన్‌లో ఘటన



ప్రమాదంలో మృతి చెందిన కృష్ణ, కూతుళ్లు

మేడ్చల్: మేడ్చల్ మండలం గౌడవెల్లి రైల్వే స్టేషన్‌లో రైలు ఢీకొని తండ్రితో సహా ఇద్దరు పిల్లలు మృతి చెందారు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు చెందిన తోగరి కృష్ణ (42) తన భార్య కవిత (37), కుమార్తెలు వర్షిత (12), వరిణి (8)లతో కలిసి అల్వాల్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. కృష్ణ రైల్వేలో ట్రాక్‌మన్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజులుగా మేడ్చల్ –మనోహరాబాద్ రూట్లో ట్రాక్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఆదివారం గౌడవెల్లి రైల్వే స్టేషన్‌లో కృష్ణకు డ్యూటీ ఉంది. తన స్వగ్రామం లింగారెడ్డిపేటలో బోనాల పండుగ ఉండటంతో తన భార్య, ఇద్దరు కుమార్తెలను వెంటబెట్టుకుని డ్యూటీ ముగిశాక లింగారెడ్డిపేట వెళ్దామని కారులో గౌడవెల్లి స్టేషన్‌కు మధ్యాహ్నం 3గంటల సమయంలో చేరుకున్నారు. భార్య, పిల్లలను స్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్లాట్ ఫాంపై కూర్చోబెట్టి కృష్ణ స్టేషన్ చివరిలో ట్రాక్‌పైకి పనిచేసేందుకు వెళ్లాడు. ఆయన అక్కడ పనిచేసుకుంటున్న సమయంలో చిన్న కూతురు వరిణి ట్రాక్‌పై దిగి తండ్రి వైపు వస్తోంది. ఈ క్రమంలోనే పెద్ద కూతురు, కవితకూడా ట్రాక్‌పై దిగి కృష్ణ పనిచేస్తున్నవైపు నడుస్తున్నారు. 3.45 గంటల ప్రాంతంలో నిజామాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు గౌడవెల్లి స్టేషన్‌కు చేరింది. అక్కడ స్టాప్ లేకపోవడంతో రైలు వేగంగా వస్తుండటం, కూతుళ్లు ట్రాక్‌పైన ఉన్న విషయం గమనించిన కృష్ణ కేకలు వేసుకుంటూ పిల్లల వైపు పరిగెత్తాడు. ప్రమాదాన్ని తప్పించుకునేందుకు పెద్ద కూతురును పట్టుకుని ట్రాక్‌కు ప్లాట్ ఫాంకు మధ్యలో గోడవైపు నిలబడ్డాడు. అయితే అప్పటికే చిన్న కూతురును రైలు ఢీకొట్టింది. కవిత మరో ట్రాక్‌పైకి వెళ్లింది. ఈ క్రమంలో గోడ మధ్యలో ఇరుక్కుపోయిన తండ్రీకూతుళ్లను కూడా రైలు వేగంగా ఢీకొనడంతో ముగ్గురూ మృతి చెందారు. ట్రాక్‌పై వారి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. నిమిషాల వ్యవధిలోనే దారుణం జరిగిపోయింది. కవితకు విషయం అర్థమయ్యేలోపే ముగ్గురూ అనంతలోకాలకు వెళ్లిపోయారు. స్టేషన్‌లో ఉన్న వారు కవిత చిరునామా తెలుసుకుని బంధువులకు, అపార్ట్‌మెంట్ వాసులకు తెలియజేయడంతో వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

అతివేగానికి ఐదు నిండు ప్రాణాలు బలి

- లారీని ఢీకొన్న కారు
- చెన్నై– తిరుపతి జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు ఏపీ విద్యార్థులు, ఓ తమిళనాడు విద్యార్థి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం

పళ్లిపట్టు (తమిళనాడు): చెన్నై– తిరుపతి జాతీయ రహదారిలోని తిరుత్తణికి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కనకమ్మ సత్రం సీఐ రాజగోపాల్ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని రామంజేరి వద్ద చెన్నై–తిరుపతి జాతీయ రహదారిపై రాత్రి 7 గంటల సమయంలో చెన్నై వైపుగా అతివేగంగా దూసుకెళ్లిన వెర్టిగో కారు మరో వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న సరుకుల లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారులో మొత్తం ఏడుగురు యువకులు ఉండగా ఐదుగురు ఘటనా స్థలంలోనే మరణించారు. కనకమ్మసత్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాలలో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ ఇద్దరిని 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు తిరువళ్లూరు ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కారులో లభించిన ఓ గుర్తింపు కార్డు ఆధారంగా మరణించిన వారు చెన్నై శివారులోని ఓ ప్రైవేటు కళాశాలలో కంప్యూటర్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది. ఆదివారం సెలవు దినం కావడంతో తిరువణ్ణామలై, కాణిపాకం ఆలయాల దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్నప్పుడు ఈ ప్రమాదం జరిగినట్లు తేలింది. మృతి చెందిన విద్యార్థుల్లో చేతన్ (21), యుగేష్ (21) తిరుపతికి చెందిన వారుగా భావిస్తున్నారు. మిగిలిన వారిలో నితీష్ (21), నితీష్‌వర్మ(21), రామ్‌గోపాలన్ (21)గా గుర్తించారు. వీరిలో రామగోపాలన్ తమిళనాడులోని తిరువణ్ణామలైకు చెందిన యువకుడు అని తేలింది. గాయపడ్డ ఇద్దరిని తిరుపతి జిల్లా గూడురు న్యూ బాలాజీ నగర్‌కు చెందిన శ్రీనివాసన్ కుమారుడు విష్ణు (21), ప్రకాశం జిల్లా పాదిలికి చెందిన చైతన్య (21)గా గుర్తించారు. వీరు ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, చెన్నై–తిరుపతి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థులు మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పంటల బీమా ప్రీమియం

తక్షణమే చెల్లించండి

'ఎక్స్' వేదికగా ఏపీ సీఎం చంద్రబాబును డిమాండ్ చేసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియాన్ని కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ చెల్లించకపోవడంతో రైతులకు పంటల బీమా పరిహారం చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీ కింద పెట్టుబడి సాయంగా ఏపీ సీఎం చంద్రబాబు ఏటా రైతులకు ఇస్తామన్న రూ.20 వేలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ మేరకు వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే..

ఉచిత పంటల బీమాలో ఆదర్శంగా నిలిచాం..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియాన్ని మా ప్రభుత్వ హయాంలో ఏటా ఏప్రిల్–మే నెలల్లో చెల్లించి నష్టపోయిన రైతులను జూన్‌లో ఆదుకున్నాం. ఖరీఫ్‌లో పంటలు వేసే సమయానికి రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి సమర్థంగా పథకాన్ని అమలు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించిన వెంటనే కేంద్రం కూడా తన వాటా విడుదల చేస్తుంది. అనంతరం సుమారు 30 రోజుల్లోగా బీమా కంపెనీ పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుంది. ఇలా మా ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మంది రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.7,802 కోట్లు అందించి అండగా నిలిచాం. తద్వారా ఉచిత పంటల బీమా విషయంలో మన రాష్ట్రం దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనతతో రైతులకు తీవ్ర నష్టం..

2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎన్నికల కోడ్ కారణంగా ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మీ ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లించాల్సి ఉన్నప్పటికీ దాని గురించి పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ ప్రీమియం కట్టకపోవడంతో కేంద్రం కూడా తన వాటా ఇవ్వలేదు. ఇప్పటికే జూన్, జూలై మాసాలు గడిచిపోయాయి. ఆగస్టులో దాదాపు పక్షం రోజులు పూర్తి కావస్తున్నా మీ ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేకపోవడం అత్యంత విచారకరం. ఈ సంవత్సరం కోస్తాలో అతివృష్టి, రాయలసీమలో కరువు వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికైనా మేలుకుని వెంటనే ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులకు బీమా పరిహారం చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

14 నుంచి యాదాద్రిలో పవిత్రోత్సవాలు




పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేసేముందు పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈవో భాస్కర్‌రావు, అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో భాస్కర్‌రావు ఆదివారం తెలిపారు. మూడ్రోజుల పాటు జరిగే ఈ పవిత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, లక్ష పుష్పార్చన, శ్రీసుదర్శన నారసింహ హోమాలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఇక పాతగుట్ట ఆలయంలో కూడా మూడ్రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యాదాద్రిలో పాత సంప్రదాయాల పునరుద్ధరణ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పాత సంప్రదాయాలను పునరుద్ధరిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడించారు. యాదాద్రి కొండపైన విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం, సమీపంలోనే అఖండ దీపారాధన కార్యక్రమాలను ఆయన ఆదివారం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి ఐలయ్య పుష్కరిణిలో స్నానం చేసి, సంకల్ప పూజలో పాల్గొన్నారు.

ఉధృతంగా వాగు.. చిక్కుకున్న రైతులు



వాగు ఒడ్డున నిరీక్షిస్తున్న రైతులు, కూలీలు

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఆదివారం మరోసారి ఉప్పొంగింది. ఉదయం వాగు ఉధృతి తక్కువగా ఉన్న సమయంలో దిందా శివారులోని పత్తి చేలో పని చేసేందుకు కేతిని గ్రామానికి చెందిన రైతులు, కూలీలు వందమంది వరకు వెళ్లారు. మధ్యాహ్నం భారీ వర్షంతో వాగు ఉప్పొంగడంతో వారు దిందా గ్రామం వైపు చిక్కుకుపోయారు. రాత్రి 10 గంటల వరకు కూడా వాగు ఉధృతి తగ్గకపోవడంతో కేతిని గ్రామానికి వారు వెళ్లలేకపోయారు.

కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ కన్నుమూత



న్యూఢిల్లీ: మాజీ దౌత్యాధికారి, కేంద్ర మాజీ మంత్రి కున్వర్ నట్వర్ సింగ్ (93) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 15 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నట్వర్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రాజ కుటుంబీకుడు...

1931లో రాజస్తాన్‌లోని భరత్‌పూర్‌లో సంస్థానాధీశుల కుటుంబంలో నట్వర్ జన్మించారు. 1953లో విదేశాంగ శాఖ అధికారిగా కెరీర్ ప్రారంభించారు. చైనా, అమెరికా, పాకిస్తాన్, బ్రిటన్ తదితర దేశాల్లో కీలక హోదాల్లో పనిచేశారు. 1984లో కేంద్రం ఆయన్ను పద్మభూషణ్‌తో గౌరవించింది. అదే ఏడాది రాజకీయాల్లో చేరి భరత్‌పూర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. పలు అంశాలపై పుస్తకాలు కూడా రాశారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. 1985లో కేంద్ర ఉక్కు, బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. 1986లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి అయ్యారు. యూపీఏ-1 హయాంలో 2004లో మన్మోహన్ కేబినెట్లో ఏడాదిన్నరపాటు విదేశాంగ మంత్రిగా చేశారు. ఇరాక్ నుంచి చమురు కొనుగోలు అక్రమాల్లో నట్వర్ కుటుంబం లబ్ధి పొందినట్టు ఆరోపణలొచ్చాయి. ఈ విషయంలో సోనియా గాంధీ మద్దతివ్వకపోవడంతో రాజీనామా చేశారు. కుమారుడు జగత్‌సింగ్‌తో పాటు 2008లో బీఎస్పీలో చేరినా 4 నెలలకే బహిష్కరణకు గురయ్యారు. జగత్ ప్రస్తుతంలో బీజేపీలో ఉన్నారు. నట్వర్ సింగ్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. దౌత్య రంగానికి ఆయన ఎనలేని సేవలందించారన్నారు.

భూమి రెండో పొర నుంచి... రాళ్ల నమూనా!

సముద్రగర్భం నుంచి 1.26 కి.మీ. లోతులో సేకరణ

తొలిసారిగా చేజిక్కిన భూ ప్రవార శిల ● జీవావిర్భావం గుట్టు వీడే ఆస్కారం



అట్లాంటిక్ లోతుల నుంచి నమూనాలు సేకరించిన నౌక జోయిడిస్

బ్రిటన్ భూ భౌతిక శాస్త్రవేత్తలు అత్యంత అరుదైన ఘనత సాధించారు. భూమి రెండో పొర అయిన మ్యాంటిల్ (ప్రవారం) నుంచి తొలిసారిగా రాళ్ల నమూనాలను సేకరించగలిగారు. అట్లాంటిక్ మహాసముద్ర గర్భం నుంచి ఏకంగా 1,268 మీటర్ల మేర లోపలికి తవ్వి మరీ వాటిని వెలికితీశారు! భూగర్భంలో ఇప్పటిదాకా అత్యంత లోతైన ప్రాంతం నుంచి సేకరించిన శిల నమూనా ఇదే!! భూ ప్రవారంలో ఇంత లోతు దాకా డ్రిల్లింగ్ చేయగలగడమూ ఇదే మొదటిసారి. మహాసముద్రాల్లో డ్రిల్లింగ్ పనులు చేపట్టడంతో తిరుగులేని రికార్డున్న నౌక జోయిడిస్ రిజల్యూషన్ సాయంతో ఈ ఘనత సాధించారు. భూమి పుట్టుకకు సంబంధించిన ఇప్పటిదాకా మనకందని పలు కీలక రహస్యాల గుట్టు విప్పడంలో ఈ నమూనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఇప్పటిదాకా మనకంతగా తెలియని భూ ప్రవారం తాలూకు కూర్పు, అక్కడ నిత్యం జరిగే కీలక రసాయనిక ప్రక్రియల గురించి విలువైన సమాచారం కూడా తెలుస్తోందట.

అతి పెద్ద ముందడుగు

భూమి ప్రధానంగా మూడు పొరలుగా ఉంటుంది. బాహ్య పొరను పటలం అంటారు. రెండో పొర రాళ్లమయమైన ప్రవారం కాగా అత్యంత లోపలి భాగమైన కేంద్రమండలం మూడో పొర. భూమి మొత్తం పరిమాణంలో ప్రవారం వాటాయే 80 శాతం దాకా ఉంటుంది. అట్లాంటిక్ మహాసముద్ర గర్భంలో దాగున్న అట్లాంటిస్ పర్వత శ్రేణి నుంచి అత్యంత వ్యయ ప్రయాసలకు ఓర్చి మరీ తాజా నమూనాలను సేకరించగలిగారు. భూ ప్రవార శిలా ఖండాలు సముద్ర జలాలతో ఎలా ప్రతిచర్య చెందుతున్నాయో అర్థం చేసుకోవడానికి తాజా నమూనాల విశ్లేషణ బాగా దోహదపడిందట. వందలాది కోట్ల ఏళ్ల కింద భూమిపై తొలిసారిగా జీవం ఎలా పురుడు పోసుకుందో తెలుసుకునే క్రమంలో ఈ తాజా వివరాలను అతి పెద్ద ముందడుగుగా సైంటిస్టులు అభివర్ణిస్తుండటం విశేషం.

సేకరణ అంత ఈజీ కాదు...

భూ ప్రవార శిలలు మానవాళికి ఇప్పటిదాకా అందరానివిగానే ఉండిపోయాయి. అందుకు కారణం లేకపోలేదు. భూ పలకలు పరస్పరం కలిసే చోట్ల, అదీ సముద్ర గర్భంలో మాత్రమే వాటిని సేకరించే వీలుంది. దాంతో సైంటిస్టులు అదే మార్గంలో ప్రయత్నించి ఫలితం సాధించారు. మహాసముద్ర గర్భంలో మిడ్ అట్లాంటిక్ రిడ్జ్‌కు అతి సమీపంలో ఉన్న అట్లాంటిస్ పర్వతశ్రేణి వద్ద ప్రవార శిలలు మనకు గట్టి ప్రయత్నంతో అందేంతటి లోతులోనే ఉంటాయన్న అంచనాతో రంగంలోకి దిగారు. 2024 ఏప్రిల్ నుంచి జోయిడిస్ ఇదే పనిలో గడిపింది. చివరికి జూన్ నాటికి రికార్డు స్థాయి లోతు దాకా డ్రిల్లింగ్ చేసి 886 అడుగుల పొడవున్న శిలా నమూనాను వెలికి తీయగలిగారు. ఈ క్రమంలో సముద్రగర్భం నుంచి 200 మీటర్ల లోతుకు తవ్విన గత రికార్డు తుడిచిపెట్టుకుని పోయింది. పైగా నాటి ప్రయత్నంలో పెద్దగా ప్రవార శిలలేవీ చిక్కలేదు కూడా. కనుక ఎలా చూసినా తాజా నమూనాల వెలికితీత అన్ని రికార్డులనూ బద్దలు కొట్టిందని కార్డిఫ్ వర్సిటీ జియాలజిస్టు, ఈ అధ్యయన సారథి జొహాన్ లీసెన్‌బర్గ్ చెప్పారు. ''ప్రవార శిలను పరిశీలించిన మీదట విలువైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిలోని ఖనిజ మూలకాలు వివిధ ఉష్ణోగ్రతల వద్ద సముద్ర జలంతో పలు రకాలుగా ప్రతి చర్య జరుపుతున్నట్టు తేలింది. ఫలితంగా సూక్ష్మజీవజాల ఉనికికి అతి కీలకమైన మీథేన్ వంటి సమ్మేళనాలు ఏర్పడుతున్నాయి. ఇంకా వీలైనన్ని ఉష్ణోగ్రతల వద్ద వాటిని విశ్లేషించిన మీదట భూమిపై జీవావిర్భావం తాలూకు రహస్యాలెన్నో విడిపోయే అవకాశముంది'' అని ఆయన వివరించారు. ఈ పరిశోధన వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నాపై అమెరికా కుట్ర

సెయింట్ మార్టిన్ ద్వీపం, బంగాళాఖాతంపై పెత్తనం కోరింది

షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు
- హింసాకాండ, మరణాలు చూడలేకే రాజీనామా చేశానని వెల్లడి
- త్వరలో బంగ్లాదేశ్‌లో అడుగు పెడతానని ప్రకటన

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ప్రధాని పదవి నుంచి తనను తప్పించడం వెనుక అమెరికా హస్తముందని చెప్పారు షేక్ హసీనా సంచలన ఆరోపణలు చేశారు. సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని, బంగ్లా సరిహద్దుల వెంబడి బంగాళాఖాతంపై పెత్తనాన్ని అప్పగించాలని అమెరికా కోరింది. అలా చేసి ఉంటే నా పదవికి ఢోకా ఉండేది కాదు'' అన్నారు. బంగ్లా ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు వంటి ఆ డిమాండ్లకు ఒప్పుకోనందుకే తనను దింపేసి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలని అమెరికా కుట్ర పన్నిందని మండిపడ్డారు. విద్యార్థుల శవాల మీదుగా అధికారం దక్కించుకోవాలని ప్రత్యర్థులు కుట్రలు చేశారని ఆరోపించారు. దేశంలో హింసాకాండను, మృతదేహాల ఊరేగింపులను చూడటం ఇష్టం లేకే రాజీనామా చేసినట్టు వెల్లడించారు. భారత్‌లో తలదాచుకుంటున్న హసీనా తాజాగా ఓ ఆంగ్ల పత్రిక ద్వారా బంగ్లాదేశ్ ప్రజలకు సందేశం విడుదల చేశారు. దేశం వీడే ముందు దీన్ని ప్రజలందరికీ చదివి విన్పించాలని భావించినా వీలు పడలేదన్నారు. కుట్రదారుల వలలో చిక్కుకోవద్దని బంగ్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలపై దాడులు, హత్యలు, వారి ఆస్తుల విధ్వంసంపై ఆవేదన వ్యక్తంచేశారు. భగవంతుడి దయతో త్వరలో బంగ్లాదేశ్ చేరుకుంటానన్నారు.

అమాయక విద్యార్థులను రెచ్చగొట్టారు

విద్యార్థులను రజాకార్లుగా తానెప్పుడూ సంబోధించలేదని హసీనా తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం వారిని రెచ్చగొట్టడానికి తన వ్యాఖ్యలను వక్రీకరించారని మండిపడ్డారు. అమెరికాపై హసీనా గతంలోనూ ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటుకు అనుమతిస్తే ఎన్నికల్లో ప్రధాని పదవి నిలబెట్టుకోవడానికి సహకరిస్తామంటూ ఓ దేశం ఆఫర్ ఇచ్చిందని గత మేలో ఆమె వెల్లడించారు.

చీఫ్ జస్టిస్‌గా రెఫాత్ అహ్మద్

ఢాకా: బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సయ్యద్ రెఫాత్ అహ్మద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విద్యార్థి నేతల డిమాండ్‌తో సీజే, ఐదుగురు న్యాయమూర్తులు శనివారం రాజీనామా చేయడం తెల్సిందే. దేశంలో అశాంతికి ఆజ్యం పోసే వదంతుల వ్యాప్తిపై యూనుస్ ప్రభుత్వం కన్నెర్రజేసింది. వాటిని ప్రచారం చేసే, ప్రచురించే మీడియా సంస్థలను మూసేస్తామని హెచ్చరించింది.

హసీనా ఎలాంటి ప్రకటనా చేయలేదు: కుమారుడు

హసీనా ఓ ఆంగ్ల పత్రిక ద్వారా విడుదల చేశారంటున్న ప్రకటన పూర్తిగా అవాస్తమని ఆమె కుమారుడు సాజిబ్ వాహెద్ జాయ్ చెప్పారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని మార్చేందుకు అమెరికా కుట్ర పన్నిందని ఆమె చెప్పినట్టుగా వచ్చిన ఆ కథనమంతా పూర్తిగా కట్టుకథ అని ఆరోపించారు. ''దీనిపై నా తల్లితో మాట్లాడాను. బంగ్లాను వీడే ముందు గానీ, వీడాక గానీ ఏ పత్రికకూ తాను అలాంటి ప్రకటన విడుదల చేయలేదని ఆమె స్పష్టం చేశారు'' అని తెలిపారు.



ఏమిటీ సెయింట్ మార్టిన్ ద్వీపం?

అమెరికాపై హసీనా ఆరోపణలతో సెయింట్ మార్టిన్ ద్వీపం ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. ఇది ఈశాన్య బంగాళాఖాతంలో బంగ్లాదేశ్‌కు చెందిన కాక్స్ బజార్-టిక్నాఫ్ ద్వీపకల్పానికి దక్షిణంది 9 కి.మీ. దూరంలో ఉంది. కేవలం 3 చదరపు కి.మీ. విస్తీర్ణముండే ఈ ద్వీపాన్ని బెంగాలీలో నారికేళ్ (కొబ్బరి) ద్వీపమంటారు. ఇందులో 3,700 మంది నివసిస్తున్నారు. చేపల వేట, వరి సాగు, కొబ్బరి తోటల పెంపకం వారి వృత్తి. ఈ ద్వీపం వ్యూహాత్మకంగా అతి కీలక ప్రాంతంలో ఉంది. చైనాతో వైరం దృష్ట్యా భావి అవసరాల దృష్ట్యా ఇక్కడ సైనిక స్థావరాన్ని ఏర్పాటుకు అమెరికా ప్రయత్నిస్తోంది.

వైద్యురాలి మృతికి నిరసనగా... నేటినుంచి వైద్యసేవలు బంద్

న్యూఢిల్లీ: కోల్‌కతాలో ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై రేప్, హత్యోదంతంపై వైద్యలోకం ఆందోళన ఉధృతం చేసింది. నిందితుడికి ఉరి శిక్ష విధించడంతోపాటు, ఆస్పత్రుల్లో మహిళా సిబ్బందికి రక్షణ కరువైన నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ జూనియర్ డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. నిరసనలను ఉధృతం చేస్తూ సోమవారం నుంచి దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఇండియా ఆదివారం ప్రకటించింది. అవసరమైతే ఆందోళనలు ఉధృతం చేస్తామంది.

గురువారం నాటి ఈ హత్యోదంతం శుక్రవారం వెలుగుచూసింది. దాంతో మొదలైన ఆందోళనలతో బెంగాల్ వ్యాప్తంగా ఆస్పత్రుల్లో వైద్యసేవలు స్తంభించాయి. డాక్టర్లు, సిబ్బంది విధులను బహిష్కరించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఢిల్లీలోనూ ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలో మరో వైద్యురాలిని బెదిరించిన పౌర వలంటీర్‌ను అరెస్ట్‌చేశారు. అతను పూటుగా తాగి శనివారం రాత్రి ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. తనకు వైద్యం త్వరగా చేయాలని వైద్యురాలిని గద్దించాడు. ''కోల్‌కతాలో ఏం జరిగిందో తెల్సుకదా? త్వరగా వైద్యం చేయకపోతే నీకు కూడా అదే గతి పడుతుంది'' అంటూ బెదిరించాడు. దాంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

అదానీ-సెబీ ఛైర్‌పర్సన్ ఉదంతంపై... జేపీసీతో దర్యాప్తు

విపక్షాల డిమాండ్
- సుమోటోగా స్వీకరించండి
- సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి
- మాధబీ బచ్ రాజీనామా చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లో సెబీ చైర్‌పర్సన్ మాధబీ పురీ బచ్ పెట్టుబడుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గుతేల్చడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని ప్రతిపక్షాలు ఆదివారం డిమాండ్ చేశాయి. ''అప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. దీనిపై మోదీ ప్రభుత్వం తక్షణం స్పందించాలి'' అన్నాయి. అదానీ గ్రూప్‌లో మాధబీ దంపతులు పెట్టుబడులు పెట్టినట్లు హిండెన్‌వర్గ్ తాజాగా ఆరోపించడం తెలిసిందే. అదానీ గ్రూప్, సెబీ చైర్‌పర్సన్ బంధంపై కేంద్రం నోరు విప్పాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ ఉదంతాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించాలని సుప్రీంకోర్టును కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నేతృత్వంలో దర్యాప్తు జరిపించాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న సంపన్న మిత్రులను కాపాడుకొనేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధబీ పదవిలో కొనసాగడం అనైతికమన్నారు. ఆమె ఇంకా రాజీనామా ఎందుకు చేయలేదని రాహుల్ ప్రశ్నించారు. నియంత్రణ సంస్థ సమగ్రతను కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. సెబీ చైర్‌పర్సన్-అదానీ బంధం స్పష్టంగా కనిపిస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని సీతా రాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), జైరాం రమేశ్ (కాంగ్రెస్), మహువా మొయిత్రా (టీఎంసీ), సంజయ్ సింగ్ (ఆప్), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐ-ఎంఎల్) ఆరోపించారు. అదానీ గ్రూప్‌ను కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు.

విపక్షాల కుట్ర: బీజేపీ

దేశంలో ఆర్థిక అస్థిరత సృష్టించడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని బీజేపీ మండిపడింది. హిండెన్‌బర్గ్ ఆరోపణలను కొట్టిపారేసింది. విదేశీ కుతంత్రాల్లో ప్రతిపక్షాలు భాగంగా మారాయని ధ్వజమెత్తింది.

నూతన వంగడాలను ఆవిష్కరించిన మోదీ

- కరువు, నీటి ఎద్దడిని తట్టుకుని అధిక దిగుబడి
- 109 రకాలు అందుబాటులోకి

వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రైతులు, శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న మోదీ



న్యూఢిల్లీ: కరువు కాటకాలను, నీటి ఎద్దడి పరిస్థితులను తట్టుకుంటూనే అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను ప్రధాని మోదీ ఆదివారం ఆవిష్కరించారు. వీటిలో 61 పంటలకు సంబంధించిన 109 రకాల విత్తనాలున్నాయి. వీటిలో 34 ఆహార, వాణిజ్య పంటల వంగడాలు కాగా 27 ఉద్యాన పంటలకు చెందినవి. పప్పు ధాన్యాలు, తృణధాన్యాలు, నూనె గింజలు, చెరకు, పత్తి, మొక్కజొన్న, పూలు, పండ్లు, కూరగాయలు, దినుసులు, ఔషధ గుణాల మొక్కల విత్తనాలు ఇలా పలురకాల నూతన వంగడాలను ఢిల్లీలోని పూసా క్యాంపస్‌లోని మూడు వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో ప్రధాని వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో మోదీ ముచ్చటించారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) ఈ నూతన వంగడాలను అభివృద్ధిచేసింది. ఏటా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వ్యవసాయానికి అదనపు విలువ జోడింపు ప్రస్తుతం తక్షణ అవసరమని ప్రధాని వ్యాఖ్యానించారు. కొత్త వంగడాల విశిష్టతపై అక్కడి రైతులతో కలిసి చర్చించారు. తక్కువ నిర్వహణ వ్యయం కారణంగా నూతన వంగడాలతో తమకు మరింత లబ్ధి చేకూరనుందని అక్కడి రైతులు చెప్పారు. '' తృణధాన్యాల గొప్పదనం, వాటిలోని పోషకవిలువ గురించి తెలిశాక ప్రజలు వాటి వినియోగానికి మొగ్గుచూపుతున్నారు. సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలు. ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగింది. సేంద్రీయ ఆహారం కావాలని జనం అడిగి మరీ కొనుగోలుచేస్తున్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన వంగడాలపై దేశవ్యాప్తంగా కృషి విజ్ఞాన్ కేంద్రాలు రైతులకు అవగాహన పెంచాలి. కొత్త రకాలను సృష్టిస్తున్న శాస్త్రవేత్తలకు నా అభినందనలు'' అని మోదీ అన్నారు. సహజసిద్ధ సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం పట్ల తమలో సానుకూలత పెరిగిందని, కృషి విజ్ఞాన్ కేంద్రాల పాత్ర ఇందులో కీలకమని రైతులు చెప్పారని ప్రభుత్వం తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వంగడాల్లో పోషక విలువలు మెండుగా ఉంటాయని తర్వాత ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు.

మా ఈ-మెయిళ్లు హ్యాకయ్యాయి

ట్రంప్ ప్రచార బృందం ఆరోపణలు



వాషింగ్టన్: తమ ఈమెయిళ్లు హ్యాకింగ్‌కు గురయ్యాయని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచార బృందం ప్రకటించింది. అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వెల్లడించిన మర్నాడే ట్రంప్ బృందం ఈ ఆరోపణలు చేయడం గమనార్హం. ''మెయిళ్లలోని సున్నిత సమాచారాన్ని తస్కరించి బయట పెడుతున్నారు. అమెరికాకు ముప్పు వాటిల్లేలా విదేశీ శక్తులు పని చేస్తున్నాయి. ట్రంప్ గెలిస్తే తమ ఉగ్ర చర్యలను అడ్డుకుంటారని ఇరాన్‌కు బాగా తెలుసు'' అని ఆయన బృందం పేర్కొంది. ఎన్నికల్లో విదేశీ శక్తుల జోక్యం తీవ్రమైన అంశమని అమెరికా జాతీయ భద్రతా మండలి పేర్కొంది. ఇందులో తమ జోక్యముందన్న వార్తలను ఇరాన్ ఖండించింది.

బిహార్‌లో కూలిన మరో వంతెన

పట్నా: బిహార్‌లో మరో వంతెన కూలింది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్ బ్లాక్‌లోని 20 ఏళ్ల నాటి వంతెన శనివారం రాత్రి కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి ప్రాణహాని జరగలేదు. 2021లో భారీ వర్షాలతో వంతెనకు ముప్పు వాటిల్లడంతో అప్పట్నుంచీ దాన్ని మూసేశారు. ఇటీవలి కాలంలో బిహార్‌లో డజనుకు పైగా వంతెనలు, కాజ్‌వేలు కూలడం తెలిసిందే.

టిప్‌లపై పన్ను ఎత్తేస్తా: హారిస్



లాస్ వెగాస్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే దేశంలోని రెస్టారెంట్ల సిబ్బంది టిప్పులపై పన్నులను రద్దు చేస్తానని డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ హామీ ఇచ్చారు. హోటళ్లు, రెస్టారెంట్లు, వినోద పరిశ్రమల పన్నులపైనే అధికంగా ఆధారపడే నెవెడా రాష్ట్రంలో ర్యాలీలో ఆమె ఈ మేరకు ప్రకటించారు. మాట్లాడారు. శ్రామికుల కనీస వేతనం పెంచుతానన్నారు. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ కూడా ఇదే హామీ ఇవ్వడం విశేషం. దాన్నే హారిస్ కాపీ కొట్టారంటూ ఆయన ఎద్దేవా చేశారు. తన ఐడియాలను దొంగిలించడం మినహా హారిస్‌కు ఇంకేమీ చేతకాదన్నారు.

ఈఫిల్ టవర్‌పైకి ఆగంతకుడు

పారిస్: ఒలింపిక్ క్రీడల ముగింపు ముంగిట్లో ఆదివారం ఓ వ్యక్తి పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌పైకి ఎక్కడం కలకలం రేపింది. 330 మీటర్ల ఎత్తున్న టవర్‌పై అతను రెండో సెక్షన్ వద్ద ఉండగా సిబ్బంది గమనించారు. దాంతో పర్యాటకులను ఖాళీ చేయించారు. అతన్ని కిందికి దించి అరెస్ట్ చేశారు. ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో ఈఫిల్ టవర్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలకు మరో వేదికను నిర్ణయించడం తెలిసిందే. వీటికోసం 30 వేల మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

అవును, రష్యాపై దాడి చేశాం: జెలెన్‌స్కీ



కీవ్: రష్యాలోని సరిహద్దు ప్రాంతం కర్స్క్‌లో ఉక్రెయిన్ ఆకస్మిక సైనిక దాడులు చేసినట్టు అధ్యక్షుడు జెలెన్‌స్కీ నిర్ధారించారు. తమ సైన్యం పోరాటాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళ్లిందన్నారు. కర్స్క్‌లో తమ దళాలు ముందుకు దూసుకెళుతున్నాయని చెప్పారు. ఈ యుద్ధంతో రష్యా గడ్డపై ఉక్రెయిన్ చేసిన అతిపెద్ద దాడి ఇది.

దాడిలో బాలుడు సహా ముగ్గురు మృతి

ఆదివారం రాత్రి కీవ్‌పై రష్యా డ్రోన్, క్షిపణి దాడుల్లో ఓ నాలుగేళ్ల బాలుడు, మరో ఇద్దరు మరణించారు. 53 డ్రోన్లను కూల్చేసినట్టు ఉక్రెయిన్ వెల్లడించింది. ఈ దాడిలో రష్యా వాడిన క్షిపణులు ఉత్తరకొరియావని జెలెన్‌స్కీ అన్నారు.



3,000 అడుగుల ఎత్తయిన విద్యుత్ భవనం!

అత్యంత ఎత్తయిన ఆకాశ హర్మ్యాల నిర్మాణం కొత్తేమీ కాదు. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్, విల్లీస్ టవర్, దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా వంటివి ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందాయి. అయితే ఇవన్నీ నివాసాలు, కార్యాలయాలే. వాటిని తలదన్నేలా 3,000 అడుగుల (914.4 మీటర్లు) ఎత్తయిన భవనాన్ని నిర్మించనున్నట్టు స్కిడ్‌మోర్, ఒవింగ్స్ అండ్ మెరిల్ (ఎస్‌ఓఎం) కంపెనీ ప్రకటించింది. నివాసానికే గాక విద్యుత్ నిల్వకు కూడా వీలు కల్పించడం దీని ప్రత్యేకత. ఇందుకోసం విద్యుత్ స్టోరేజీ కంపెనీ 'ఎనర్జీ వాల్ట్'తో ఒప్పందం చేసుకుంది. విద్యుత్‌ను నిల్వచేసే బ్యాటరీలాగా ఇది పని చేస్తుందని కంపెనీ పేర్కొంది. భవనం వెలుపలి భాగంలో అమర్చే ఫలకాల్లో విద్యుత్‌ను నిల్వ చేస్తారు. దాన్ని అవసరమైనప్పుడు ఉపయోగించుకుంటారు. ఈ భవనాన్ని ఎక్కడ నిర్మించాలన్నది ఇంకా ఖరారు చేయలేదు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్తరాదిన కుండపోత.. 28 మంది మృతి

న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు రెండు రోజులుగా వణికిస్తున్నాయి. ఇళ్లు కూలి, కొండచరియలు విరిగిపడి, జలాశయాలు పొంగిపొర్లిన ఘటనల్లో 28 మంది మృతి చెందారు. హరియాణాలో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. జమ్మూకశ్మీర్ యంత్రాంగం అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసింది. రాజస్తాన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 16 మంది చనిపోయారు. రాష్ట్రంలోని కరౌలీ జిల్లాలో రికార్డు స్థాయిలో 38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో ఆదివారం వరదల్లో వాహనం కొట్టుకుపోయిన ఘటనలో ఒకే కుటుంబంలోని 8 మంది చనిపోయారు. దేశ రాజధాని ఢిల్లీలో జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో నీరు నిల్చి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏడేళ్ల బాలుడు నీట మునిగి చనిపోయాడు. హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలతో కొండచరియలు విరిగిపడి ముగ్గురు బాలికలు మృత్యువాత పడ్డారు.

వాగులో కొట్టుకుపోయిన కారు

- ఒకే కుటుంబానికి చెందిన 8 మంది, డ్రైవర్ దుర్మరణం
- హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో ఘటన



వాగులో కొట్టుకుపోతున్న కారు (సర్కిల్‌లో)

సిమ్లా: ఎగువన కురుస్తున్న వర్షాలకు ఉనా జిల్లాలోని జైజోన్ చో వాగు ఉప్పొంగడంతో ఎస్‌యూవీ వాహనం కొట్టుకుపోయి తొమ్మిది మంది మృతి చెందారు. ఇద్దరు గల్లంతయ్యారు. మృతుల్లో 8 మంది ఒకే కుటుంబానికి చెందినవారు కాగా, మరొకరు డ్రైవర్. ఉనా జిల్లాలోని డెహ్రా నుంచి పంజాబ్‌లోని ఎస్‌బీఎస్ నగర్ జిల్లా మెహ్రోవాల్ గ్రామానికి ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఎస్‌యూవీ వాహనంలో ఒకే కుటుంబానికి చెందిన 11 మంది, డ్రైవర్ ప్రయాణిస్తున్నారు. భారీ వర్షం కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న జైజోన్ చో నదిని దాటుతుండగా వారి వాహనం కొట్టుకుపోయింది. స్థానికులు దీపక్ భాటియా అనే వ్యక్తిని రక్షించి జైజోన్ లోని ప్రభుత్వ డిస్పెన్సరీకి తరలించారు. వాహనం వరద నీటిలో ఇరుక్కుపోయింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందం రంగంలోకి దిగింది. వాగు నుంచి ఐదుగురు మహిళలతో సహా తొమ్మిది మంది మృతదేహాలను వెలికితీసింది. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాటొద్దని స్థానికులు హెచ్చరించినా డ్రైవర్ పట్టించుకోలేదని పోలీసులు తెలిపారు. మృతులను సూర్జిత్ భాటియా, అతని భార్య పరమజీత్ కౌర్, సోదరుడు స్వరూప్ చంద్, మరదలు బిందర్, మెహత్‌పూర్‌లోని భటోలీకి చెందిన షినో, ఆమె కుమార్తెలు భావన, అను, కుమారుడు హర్షిత్, డ్రైవర్ బిందుగా గుర్తించారు.



ఏడుపదుల వయసులో..
అద్భుతమైన శరీరాకృతితో ఆకట్టుకుంటున్నాడు నగరానికి చెందిన కుమనన్. ఏడు పదుల వయసులో ఏకైక మేల్ మోడల్‌గానూ ర్యాంప్‌పై మెరుస్తున్నాడు. - సిటీప్లస్‌లో




షాన్‌దార్.. షాండ్లియర్!
ఇళ్లయినా, స్టార్ హోటలైనా.. మిరుమిట్లుగొలిపే షాండ్లియర్స్ వినియోగం తప్పనిసరి. పైకప్పు నుంచి వేలాడే ఈ దీపాలంకరణ చూపరులను మంత్రముగ్ధుల్ని చేసేస్తుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.7/24.9
నగర పరిధిలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32.7.. కనిష్టంగా 24.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







మహనీయుల మార్గం..

స్వాతంత్య్ర దినోత్సవాలకు నగరం సిద్ధమవుతోంది. మహనీయుల త్యాగాలను స్మరించుకునే తరుణం ఆసన్నమైంది. వారి మార్గమే మనకు శిరోధార్యమైంది. ఈ క్రమంలో ఆ మహానుభావుల రూపాలు మదిలో మెదిలేలా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చిత్రాలు ప్రాణం పోసుకుంటున్నాయి. ఖైరతాబాద్ దారిలోని ఫ్లై ఓవర్‌పై ఇరువైపులా ఉన్న గోడలపై కళాకారులు మహనీయుల చిత్రాలను ఇలా రూపుదిద్దుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నగరాభివృద్ధికి సీఎం చొరవ చూపాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: నగరాభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపించి నిధుల కేటాయింపులు పెంచాల్సిన అవసరముందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్‌లో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ అత్యంత ప్రాముఖ్యతమున్న నగరమన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇది ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. నగరంలో మౌలిక వసతుల కల్పనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. నగరం నుంచి అధిక ఆదాయం వస్తున్నా కేటాయింపుల్లో పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. హైటెక్ సిటీ ప్రాంత అభివృద్ధికి చూపిస్తున్న శ్రద్ధ పాత నగరంపై కనబర్చడంలేదన్నారు. ప్రస్తుత, గత ప్రభుత్వాలు పాత నగర అభివృద్ధిని విస్మరించాయన్నారు.

మురుగు.. పరుగెత్తాల్సిందే..

- రూ.301 కోట్లతో డ్రైనేజీ నెట్‌వర్క్
- పాతబస్తీలో కొత్త పైపులైన్ పనులు
- 156 కిలో మీటర్ల పొడవుతో..
- త్వరలో నిర్మాణ పనులకు టెండర్లు



సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలో రూ.301 కోట్ల అంచనా వ్యయంతో మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు జలమండలి సిద్ధమైంది. నిజాం కాలం నాటి పైపులైన్‌లు తరచూ పగిలిపోవడం, పూడుకుపోతుండటంతో మురుగు నీటి వ్యవస్థ అధ్వానంగా తయారైంది. నిరంతరం రోడ్లపై మురుగు పొంగి పొర్లుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. చిన్నపాటి వానకు డ్రైనేజీలు పొంగిపొర్లి మురుగునీరు ఇళ్లలోకి వస్తోంది. మరోవైపు తాగునీటి పైపులైన్‌లు కలుషితమవుతున్నాయి. ప్రతిరోజూ పాతబస్తీ నుంచి జలమండలి కాల్ సెంటర్‌కు ఫిర్యాదుల తాకిడి అధికంగానే ఉంటోంది. దీంతో పాతబస్తీలో మురుగు నీటి సమస్యను చెక్ పెట్టేందుకు కొత్త పైపులైన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం ఇటీవల నిధులు కేటాయించింది. దీంతో జలమండలి త్వరలో టెండర్లను ఆహ్వానించి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

పాతవాటి స్థానంలో కొత్తవి..
మూసీకి దక్షిణంగా ఉన్న పాతబస్తీ జోన్–2లో సమగ్ర మురుగునీటి ప్రణాళికల్లో భాగంగా దాదాపు 156 కిలోమీటర్ల పొడవుతో పాత పైపులైన్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలకు జలమండలి ఉపక్రమించింది. లలితాబాగ్, రియాసత్ నగర్, జంగంమెట్, ఉప్పుగూడ, చాంద్రాయణగుట్ట, బార్కాస్, కంచన్‌బాగ్, సరూర్ నగర్ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న మురుగునీటి వ్యవస్థ మెరుగుపడనుంది. మొత్తం 141 కిలోమీటర్ల పొడవునా 200, 250, 300 ఎంఎం పైపులైన్‌తో మురుగు కాల్వలు, ప్రధాన కాల్వలు, 14.64 కిలోమీటర్ల పొడవున 400 ఎంఎం నుంచి 1800 ఎంఎం పైపులైన్‌లతో ప్రధాన మురుగు కాల్వలను మెరుగు పర్చేందుకు జలమండలి చర్యలు చేపట్టింది.

నృత్యం.. మనోహరం



సంప్రదాయ నృత్యకళా రూపకాలు ఆహుతులను సమ్మోహితుల్ని చేశాయి. నృత్య దీక్షాలయ 7వ వార్షిక వేడుకలు ఆదివారం రవీంద్రభారతిలో నయన మనోహరంగా సాగాయి. ఈ సందర్భంగా నృత్య దీక్షాలయ విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ అనుపమా కైలాష్, ప్రొఫెసర్ రమాదేవి, కూచిపూడి నృత్యగురువు వేదాంతం వెంకటనాథ చలపతి రావు, సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మీశంకర్ పాల్గొన్నారు. –గన్‌ఫౌండ్రీ



స్మగ్లింగ్ కేరాఫ్ కొరియర్స్

బంగారం నుంచి మాదకద్రవ్యాల వరకు



- నిఘా, పన్నులు తప్పించుకోవడానికే..
- నగదు చెల్లింపులన్నీ అక్రమ మార్గంలోనే
- కలకలం సృష్టించిన ఎఫిడ్రిన్ స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: బెంగళూరులో తయారైన మాదకద్రవ్యం ఎఫిడ్రిన్‌ను నగరంలోని అక్బర్‌బాగ్ నుంచి కొరియర్ ద్వారా ఆస్ట్రేలియా పంపాలని చూసిన ముఠాను నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు.

- ఢిల్లీలోని ఓ కొరియర్ సంస్థ హిమాయత్‌నగర్‌లోని వ్యాపారికి వజ్రాలను పార్శిల్ చేసింది. వీటిని కొరియర్ ఉద్యోగులే తస్కరించడంతో ఏళ్లుగా జరుగుతున్న అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది.
- ఓ కొరియర్ సంస్థ ద్వారా హాంకాంగ్ వెళ్తున్న ఓ పార్శిల్‌ను ఎయిర్‌పోర్ట్‌లోని కస్టమ్స్ అధికారులు స్కానింగ్ చేశారు. ఫలితంగా అందులో రూ.5 లక్షల విలువైన ఎర్ర చందనం ఉన్నట్లు తేలడంతో అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.
- హైదరాబాద్ నుంచి న్యూజిలాండ్‌కు కొరియర్ ద్వారా అక్రమంగా ఎఫిడ్రిన్ రవాణా చేస్తున్నారంటూ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌కు (డీఆర్ఐ) సమాచారం అందింది. శనివారం ఓ కొరియర్ కార్యాలయంలో సోదాలు చేసి మూడు కేజీలు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ ఉదంతాలే కాదు.. తెరపైకి రాకుండా చాపకింద నీరులా కొరియర్స్ ద్వారా సాగిపోతున్న బంగారం, వజ్రాలు, ఎర్రచందనం, మాదకద్రవ్యాల దందాకు నగరంలో కొదవేలేదు. ఏళ్లుగా 'బులియన్ మార్కెట్' అక్రమ దందా సాగుతుండగా.. కొన్నేళ్లుగా ఎర్ర చందనాన్నీ కొరియర్స్ ద్వారా దేశం దాటించడం మొదలుపెట్టారు. ఇటీవల కాలంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకూ కొరియర్స్‌ను వాడుతున్నారని వెలుగులోకి వచ్చింది.

అవి ఇక్కడికి.. ఇవి అక్కడికి..
హోల్‌సేల్‌గా బంగారాన్ని కిలోల లెక్కన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు, వజ్రాలను ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ తీసుకువచ్చి రిటైలర్స్‌కు, జ్యువెలరీ దుకాణ యజమానులకు విక్రయిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో తీసుకుని రావడానికీ వెనుకంజ వేస్తున్న వ్యాపారులు ఏకంగా పార్శిల్స్ చేసి పంపిస్తున్నారు. అలాగే నగర శివార్లతో పాటు చుట్టు పక్కల రాష్ట్రాల్లోనూ ఖాయిలా పడ్డ ఫార్మా పరిశ్రమలు అనేకం ఉన్నాయి. వీటితో పాటు కొందరి ఇళ్లు డ్రగ్స్ కార్ఖానాలుగా మారిపోతున్నాయి. ప్రధానంగా ఎఫిడ్రిన్, ఆల్ప్రాజోలం తదితరాలు వీటిలో తయారవుతున్నాయి. వీటి ధర ఇక్కడ కిలో రూ.లక్షల్లో ఉండగా.. విదేశీ విపణిలో మాత్రం రూ.కోట్లు పలుకుతోంది. దీంతో ఆ సరుకులు కొరియర్స్ ద్వారా సిటీకి వస్తుండగా.. ఎఫిడ్రిన్, సూడో ఎఫిడ్రిన్ వంటి డ్రగ్స్ సిటీ నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి.

ఆర్థిక లావాదేవీలకు అక్రమ మార్గంలో..
వీటిలో ఏవి ఎటు వచ్చినా, వెళ్లినా... చెల్లింపులు మాత్రం నేరుగా, బ్యాంకు ఖాతాల ద్వారా సాగించరు. దీనికి అనేక మంది వ్యాపారులు, స్మగ్లర్లు అక్రమ ద్రవ్య మార్పిడైన హుండీ, హవాలాలను ఆశ్రయిస్తున్నారు. నగరంలో ఉన్న ఏజెంట్లకు డబ్బు అప్పగించే వ్యాపారులు, అది చేరాల్సిన వ్యక్తి వివరాలు చెప్పి కమీషన్ ఇస్తే చాలు. గంటలోపే డెలివరీ అయిపోతుంది. ఇక్కడకు రావాలన్నా ఇదే పంథా కొనసాగుతోంది. ఈ విధానమే తమకు సురక్షితమని భావిస్తున్న స్మగ్లర్లు, వ్యాపారస్తులు దీన్నే అవలంబిస్తున్నారు. నగరంలోని బేగంబజార్, పాతబస్తీ, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ రోజూ రూ.కోట్లలో ఈ అక్రమ ద్రవ్యమార్పిడి బిజినెస్ నడుస్తోందని పోలీసులే అంగీకరిస్తున్నారు. ప్రతి రూ.లక్షకు కేవలం రూ.300 నుంచి రూ.600 వరకు మాత్రమే కమీషన్‌గా ఉండటం వీరికి కలిసి వస్తోంది. ఏవైనా ఉదంతాలు చోటు చేసుకున్న సందర్భంలో మాత్రమే ఏజెన్సీల రికార్డుల్లోకి ఈ వ్యవహారాలు ఎక్కుతున్నాయి. డ్రగ్స్ రవాణా వ్యవహారాల్లో పాత్రధారులు మినహా సూత్రధారులు దొరుకుతున్న సందర్భాలు లేవు.



కొరియర్ పార్శిల్స్ ద్వారా డ్రగ్స్, పేలుడు పదార్థాలు, డబ్బు, నగలు, మానవ అవయవాలు, మత్తు పదార్థాలు తదితరాలను పార్శిల్ చేయడంపై పూర్తి నిషేధం ఉంది. అయినా పట్టుబడిన నిందితులు చెప్పిన వివరాలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ప్రకారం అనేక కొరియర్స్ ద్వారా ఈ రవాణా జరుగుతోంది. ఇలాంటి అంశాల్లో పూర్తి వివరాలను వెలికితీసే అవకాశం పోలీసు, ఏజెన్సీలకు ఉండట్లేదు. ఎయిర్‌కార్గో ద్వారా రవాణా అయ్యే ప్రతి పార్శిల్‌ను స్కానింగ్ చేయడం, క్షుణ్ణంగా పరిశీలించడం సాధ్యం కాదు. సంబంధిత విభాగంలో ఆ సాంకేతిక పరిజ్ఞానం, మానవవనరులు లేవు. నిరంతర నిఘా, ప్రతి కేసులోనూ మూలాలను అన్వేషించడం ద్వారానే ఇలాంటి వాటికి చెక్ చెప్పగలం.
– శ్రీనివాస్, కస్టమ్స్ విభాగం మాజీ అధికారి

మద్యం మత్తులో డ్రైవింగ్

నిండు ప్రాణం బలి



గోపి మృతదేహం

జీడిమెట్ల: అతివేగం.. మద్యం మత్తు.. నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ ఓ అమాయకుడి ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ చెప్పిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన కూన నవీన్ గౌడ్ కుమారుడు మనీష్ గౌడ్ (20), అయిదుగురు స్నేహితులు కలిసి ఆదివారం ఉదయం 6 గంటలకు కారులో దేవేందర్ నగర్ నుంచి గాజులరామారం వైపు వస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న మనీష్ గౌడ్ డ్రైవింగ్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దేవేందర్‌నగర్ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పింది. అదే సమయంలో గాజులరామారంలోని రాజీవ్ గృహకల్పలో ఉండే గోపి (38) రోడ్డుకు దూరంగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. కారు అతి వేగంతో వచ్చి ఢీకొనడంతో గోపి పైకి ఎగిరి రెండు కరెంటు స్తంభాల మధ్యలోంచి 7 మీటర్ల దూరంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న అయిదుగురు యువకులు పారిపోయారు. డ్రైవింగ్ సీట్లో ఉన్న మనీష్ కారు దిగేందుకు ప్రయత్నించగా రోడ్డుపై వెళ్లే ఓ వ్యక్తి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. మృతుడు గోపి తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

నాంపల్లి: డీఎస్సీ నియామకాలు పూర్తయ్యే వరకు అన్ని జిల్లాల్లో విద్యా వలంటీర్లను సత్వరమే నియమించాలని తెలంగాణ విద్యా వలంటీర్ల సంఘం (టీవీవీఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కె.కవిత ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని తెలిపారు. అప్పటి వరకు అన్ని జిల్లాల్లో విద్యా వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బాసటగా నిలవాలని కోరారు. డీఎస్సీ పరీక్షలు ముగిసి వారం రోజులు గడుస్తున్నా ప్రాథమిక కీ ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయ నియామకాలు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యా వలంటీర్లను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నియమించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఓయూ డిగ్రీ ఫలితాల్లో అమ్మాయిల హవా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ డిగ్రీ ఫలితాల్లో అమ్మాయిల హవా కొనసాగింది. ఉస్మానియా పరిధిలో ఈ ఏడాది జూన్, జులై నెలల్లో జరిగిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ రెగ్యులర్ కోర్సుల చివరి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలకు 72 వేల మంది హాజరు కాగా.. 46 వేలకు పైగా (65 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలికల శాతం 75 కాగా.. బాలురు 53 శాతం ఉన్నట్లు ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు వివరించారు. బీఏ కోర్సులో 66 శాతం, బీకాంలో 65, బీఎస్సీలో 58, బీబీఏ 82 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. మార్కుల జాబితాలను ఉస్మానియా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తక్కువ మార్కులతో పాటు పరీక్షలో తప్పిన విద్యార్థులు రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

ఉచిత బియ్యం పక్కదారి

- ప్రతి నెలా 80– 90 శాతం కోటా డ్రా
- వండి తినడానికి లబ్ధిదారుల అనాసక్తి
- కిలో రూ.8 చొప్పున విక్రయం
- ఇడ్లీ, దోశ, పిండి వంటలకు వినియోగం
- బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్ బియ్యం

ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న 'ఉచిత బియ్యం' బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. తాము డ్రా చేస్తున్న బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు కిలో రూ.8 చొప్పున విక్రయిస్తుండటంతో అధికారులను విస్మయానికి గురి చేస్తోంది. శనివారం పాతబస్తీలోని చాంద్రాయణ గుట్టలో 14 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి రెండు వాహనాల్లో రవాణా చేసేందుకు సిద్ధమైన ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. - సాక్షి, సిటీబ్యూరో



ఎందుకిలా?
పీడీఎస్ బియ్యం వండి తినడానికి లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. బియ్యం దొడ్డుగా, నాసిరకం, ముక్కి పోయి ఉండడం, వండి తిన్న తర్వాత జీర్ణం కాకపోవడం అంశాలు ప్రధాన కారణంగా మారాయి. కుటుంబం గడవని పేదలు మినహా మిగతా కుటుంబాలు రేషన్ బియ్యాన్ని ఇడ్లీ, దోశ, పిండి వంటలకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా ఉచితంగా అందుతుండటంతో అవసరానికి మించి నిల్వలు ఉండటంతో ఇంటి వద్దకు వచ్చే చిరు వ్యాపారులకు, ఇడ్లీ, దోశ, మిర్చీ కేంద్రాలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా సుమారు 80 నుంచి 90 శాతం కోటా డ్రా అవుతోంది.

నగదు రూపంలో..
కొందరు లబ్ధిదారులు రేషన్ షాపు వద్దనే ఉచిత బియ్యాన్ని నగదు రూపంలో మార్చుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. నెలవారీ కోటా డ్రాలో ఒక యూనిట్ కోటా బియ్యం మినహా మిగతా యూనిట్ల కోటాను డీలర్లకు అప్పగించి నగదు రూపంలో బదిలీ చేసుకుంటున్నారు. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఈ– పాస్ (బయోమెట్రిక్) అమలు కంటే ముందు రేషన్ డీలర్లు చేతివాటం ప్రదర్శించి డ్రా చేయని లబ్ధిదారుల సబ్సిడీ సరుకులు గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునేవారు. సంస్కరణలో భాగంగా ఈ– పాస్ అమలుతో లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తప్పనిసరి కావడంతో డీలర్లు లబ్ధిదారుల ప్రమేయంతో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. లబ్ధిదారులచే ఈ–పాస్‌పై బయోమెట్రిక్ తీసుకొని అక్రమ తంతు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ–పాస్ ద్వారా బియ్యం కోటా డ్రా కాగానే లబ్ధిదారుల అంగీకారంతో బియ్యం బదులు నగదు ముట్టజెప్పడం తంతుగా మారింది.

నిద్ర మత్తులో నిఘా..
పీడీఎస్ బియ్యం అక్రమ దందాను అడ్డు కట్టవేయాల్సిన పౌరసరఫరాల శాఖ నిద్ర మత్తులో జోగుతోంది. అడపాదడపా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల దాడుల్లో పీడీఎస్ బియ్యం క్వింటాళ్ల కొద్దీ పట్టుబడుతోంది. ఇటీవల ఎల్బీ నగర్, అత్తాపూర్, రాజేంద్రనగర్, మహేశ్వరం, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో వందలాది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. స్పెషల్ డ్రైవ్ సమయంలో బియ్యం వ్యాపారులు ఎక్కడి దొంగలు అక్కడే గప్.. చుప్ అన్నచందంగా మౌన పాత్ర పోషిస్తున్నారు. ఆ తర్వాత తిరిగి దందాను కొనసాగించడం షరామామూలుగా మారింది.

రైస్ మిల్లు సీజ్ - పీడీ యాక్ట్ కింద కేసు

రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన ఓ రైస్ మిల్లుపై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొరఢా ఝుళిపించింది. కొనుగోలుదారులపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడంతో పాటు రైస్ మిల్లును అధికారులు సీజ్ చేశారు. పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందం నగర శివారు పెద్ద గోల్కొండలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లుపై దాడులు నిర్వహించింది. సుమారు 40 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంది. కొందరు ముఠాగా ఏర్పడి పెద్ద గోల్కొండ, శంషాబాద్, కందుకూరు, కడ్తాల్, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి మిల్లులో డంప్ చేస్తున్నట్లు గుర్తించినట్లు రఘునందన్ వివరించారు. మిల్లు నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మీరు ఒలింపిక్స్‌కు వెళ్తే గోల్డ్ మెడలే

- సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో నెటిజనుడి వ్యాఖ్య
- సానుకూలంగా స్పందిస్తూ ఫొటోలు పెట్టిన ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: పారిస్ ఒలింపిక్స్ సీజన్‌లో 'ఎక్స్' వేదికగా ఆదివారం ఆసక్తికర అంశం చోటుచేసుకుంది. కొందరు నెటిజనులు మాజీ కొత్వాల్, ప్రస్తుత ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్‌లోని క్రీడాకారుణ్ని పలకరించారు. వారి ప్రశ్నలకు ఓపికగా జవాబు ఇచ్చిన ఆనంద్.. తాను చదువుకున్న, ఐపీఎస్ శిక్షణలో ఉన్న రోజుల్లో సాధించిన పతకాలకు సంబంధించిన జ్ఞాపకాలు పంచుకున్నారు. 'ఎక్స్'లో ఆనంద్‌కు, నెటిజనులకు మధ్య సంభాషణ ఇలా సాగింది..

హైదరాబాద్ వైబ్: సర్.. మీరు చదువుకునే రోజుల్లో మంచి అథ్లెట్ అని మీ స్కూల్‌మేట్ ఒకరు చెప్పారు.

సీవీ ఆనంద్: హాయ్.. ఆ స్కూల్ మేట్ ఎవరు? ఆ రోజుల్లో నేను 100 మీటర్లు, 200 మీటర్లు, హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌ల్లో పతకాలు సాధించా. కాలేజీ రోజులతో పాటు జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న రోజుల్లోనూ బెస్ట్ అథ్లెట్‌నే. అప్పట్లో 100 మీటర్ల పరుగును కేవలం 11.2 సెకన్లలో పూర్తి చేశా. ఇవిగో నేను సాధించిన మెడల్స్ అంటూ.. రెండు ఫొటోలు పోస్టు చేశారు.

రియాజ్: అబ్బా.. ఎన్ని మెడల్సో.. మీరు ఒలింపిక్స్‌లో పాల్గొని ఉంటే కచ్చితంగా బంగారు పతకం వచ్చేది.

సీవీ ఆనంద్: ఔను రియాజ్... నిజమే. బతుకుదెరువు కోసం చదువు, పరీక్షలు తప్పలేదు. ఇప్పుడు ఇదిగో ఇలా ఉన్నా.

ఎయిర్‌పోర్టుకు వెళ్లి వచ్చేలోగా...

- చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ
- పది తులాల బంగారం, కేజీ వెండి రూ.2.20లక్షల నగదుతో పాటు స్కూటీ చోరీ


చెల్లాచెదురైన వస్తువులు

మియాపూర్: కుటుంబసభ్యులు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి వచ్చే లోగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళాలు పగులగొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చందానగర్,గౌతమీనగర్‌లో బీహెచ్‌ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగి వెంకటేశ్వర్‌రావు భార్య, పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. శనివారం రాత్రి ఆయన కుమార్తె అమెరికాకు వెళ్లాల్సి ఉండటంతో ఆమెను శంషాబాద్‌లో ఎయిర్‌పోర్టులో విడిచివచ్చేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపుల బద్దలు కొట్టి ఉన్నట్లు గుర్తించాడు. లోపలికి వెళ్లి చూసేసరికి బెడ్‌రూమ్ బీరువాలో ఉన్న 10 తులాల బంగారం, కేజీ వెండి, రూ.2.20లక్షల నగదుతో పాటు స్కూటీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో అతను చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు

14 బైక్‌లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

మోతీనగర్: జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనుకున్న యువకులను అల్లాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన గాయత్రి నగర్ క్రాస్ రోడ్డు దగ్గర బైక్‌లను తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై అటుగా వెళుతున్న నలుగురు వ్యక్తులపై అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 14 బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితులను నానక్‌రామ్‌గూడకు చెందిన చప్పిడి గణేష్, బాచుపల్లికి చెందిన గుబ్బల పవన్‌కుమార్, మోతీనగర్‌కు చెందిన గుబ్బల శ్రీరాం, మైనర్‌గా గుర్తించారు. వీరు చిన్ననాటి స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు 14 బైక్‌లను చోరీ చేసి, అదను చూసి అమ్ముకునేందుకు ఓ ఇంట్లో దాచి పెట్టారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాల దొంగలను చాకచక్యంగా పట్టుకున్నందుకు ఉన్నతాధికారులు అల్లాపూర్ క్రైమ్ సిబ్బందిని అభినందించి, రివార్డు అందజేశారు.

యువతికి ఆశ్రయం ఇచ్చాడని..

యువకుడిపై దాడి

అమీర్‌పేట: బ్యాచిలర్స్ ఉంటున్న గదిలో యువతికి ఆశ్రయం కల్పించాడని ఓ యువకుడిని ఇద్దరు వ్యక్తులు బెదిరించి దాడికి పాల్పడటంతో పాటు సెల్ ఫోన్లు లాక్కెళ్లిన సంఘటన అమీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా, రామగుండంకు చెందిన రోహిత్ నెల రోజుల క్రితం ఉద్యోగం కోసం నగరానికి వచ్చి స్నేహితులైన అక్షయ్, మనుతేజ, అరుణ్‌కుమార్‌తో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. రామగుండానికి చెందిన యువతి ఉద్యోగం చేస్తూ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె ఆరోగ్యం బాగాలేకపోవడంతో కొన్ని రోజులుగా రోహిత్ గదిలో ఆశ్రయం పొందుతోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా టీ స్టాల్ నడిపే సమీరుద్దీన్ ఈ నెల 9న రాత్రి తన స్నేహితుడు షేక్ అలీతో కలిసి రోహిత్ గదికి వచ్చి బ్యాచ్‌లర్స్ ఉంటున్న గదిలో యువతికి ఎలా ఆశ్రయం ఇస్తావని బెదిరించి అతడిపై దాడి చేయడంతో పాటు రెండు సెల్ ఫోన్లు తీసుకుని వెళ్లి పోయారు.10న ఉదయం మళ్లీ అక్కడికి వచ్చిన వారు మరోసారి రోహిత్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో రోహిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు సమీరుద్దీన్, అలీని అరెస్టు చేశారు.

హైదరాబాద్ పోలీసుల పేరుతో జైపూర్‌లో బెదిరింపులు

ఇంపర్సినేషన్ స్కామ్‌తో రూ.4.55 లక్షలు స్వాహా

- ఆర్బీఐ అధికారుల పేరుతో యువకుడికి ఫోన్
- ఉగ్రవాదానికి నిధులు ఇస్తున్నావంటూ వేధింపులు
- 8 రోజులు చెల్లించాక అక్కడి పోలీసులకు ఫిర్యాదు



సాక్షి, సిటీబ్యూరో: 'డ్రగ్స్ పార్సిల్ అంటూ ఫెడెక్స్ కంపెనీ పేరుతో', 'అక్రమ ద్రవ్య మార్పిడి అంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పేరుతో' 'బ్యాంకు ఖాతా అక్రమ వినియోగం అంటూ ఆయా బ్యాంకుల అధికారుల పేరుతో' ఫోన్లు చేసి, బెదిరించి డబ్బు గుంజడాన్ని ఇంపర్సినేషన్ స్కామ్‌గా పిలుస్తారు. తీవ్రత ఎక్కువగా ఉంటే డిజిటల్ అరెస్టు స్కామ్‌గానూ సంబోధిస్తారు. ఉత్తరాదికి చెందిన ఈ ముఠాలు నగరంతో పాటు రాష్ట్రంలో అనేక మందికి కాల్స్ చేసి డబ్బులు వసూలు చేశాయి. ఈ సందర్భాల్లో వారు ఫోన్ కాల్‌ను ముంబై లేదా ఢిల్లీ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు చెబుతుంటారు. అయితే రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు చెందిన ఓ యువకుడిని ముంచడానికి మాత్రం ఈ-కేటుగాళ్లు హైదరాబాద్ పోలీసుల పేరు చెప్పారు. ఇక్కడి అధికారిగా మాట్లాడుతూ భయపెట్టిన నేరగాడు సదరు యువకుడి నుంచి రూ.4.55 లక్షలు కాజేశాడు. దీనిపై శనివారం కేసు నమోదు చేసుకున్న జైపూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జైపూర్‌కు చెందిన ఓ యువకుడిని గత నెల ఆఖరి వారంలో ఆర్బీఐ అధికారి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. అతడి ఆధార్ నెంబర్ చెప్పిన 'ఆర్బీఐ అధికారి' దానిని వినియోగించి హైదరాబాద్‌లో ఓ బ్యాంకు ఖాతా తెరిచారని అన్నాడు. ఈ ఖాతా నుంచి ఉగ్రవాదులకు నిధులు బదిలీ అయ్యాయని, దీనిపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని చెప్పాడు. ఫోన్ కాల్‌ను అక్కడి అధికారికి బదిలీ చేస్తున్నట్లు యువకుడితో అన్నాడు. ఆపై లైన్‌లోకి వచ్చిన ఓ మహిళ తాను హైదరాబాద్‌కు చెందిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారిగా పరిచయం చేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే 200 మందిని విచారించామని, ఇప్పుడు నిన్ను విచారిస్తున్నామని భయపెట్టింది. ఆ యువకుడు భయంతో ఉన్నాడని, తమ మాట వింటాడని నిర్ధారించుకున్న సైబర్ నేరగాళ్లు మరో అడుగు ముందుకు వేశారు. అతడి ఫోన్‌లోకి స్కైప్ డౌన్‌లోడ్ చేయించారు. దాని ద్వారా వీడియో కాల్ చేసి పోలీసు యూనిఫాంలో ఉన్న యువతి మాట్లాడింది. ఉగ్రవాదులతో ఉన్న సంబంధాలపై పూర్తి స్పష్టత వచ్చే వరకు డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, అవసరమైతే ఆ తర్వాత తమ బృందం వచ్చి హైదరాబాద్ తీసుకువస్తుందని చెప్పింది. ఆ ఖాతా తనది కాదని, తనకు ఎలాంటి సంబంధం లేదని యువకుడు చెప్తున్నా పట్టించుకోలేదు. అంతటితో ఆగకుండా డిజిటల్ అరెస్టులో భాగంగా ఒక రోజంతా కుటుంబానికి దూరంగా ఉండాలని చెప్పింది. అలా యువకుడిని జైపూర్‌లోని ఓ లాడ్జికి పంపి రోజంతా అక్కడే ఉంచింది. దీంతో విసిగివేసారిన బాధితుడు కేసు నుంచి తప్పించుకోవాలంటే ఏం చేయాలని కోరారు. ప్రస్తుతం వినియోగిస్తున్న బ్యాంకు ఖాతా నుంచి తమకు కొన్ని దఫాలుగా డబ్బు బదిలీ చేయాలని, దీని ఆధారంగా దర్యాప్తు చేస్తామని చెప్పింది. వారి మాటలు నమ్మిన యువకుడు ఈ నెల 1 తేదీ నుంచి నగదు చెల్లించడం మొదలెట్టాడు. ఇలా ఎనిమిదో తేదీ వరకు దఫదఫాలుగా డబ్బు చెల్లిస్తూనే ఉన్నాడు. మొత్తం రూ.4.55 లక్షలు చెల్లించాక యువకుడికి అనుమానం రావడంతో అప్పటి నుంచి చెల్లింపులు ఆపేసిన అతగాడు విషయం కుటుంబీకులకు చెప్పాడు. వారి సాయంతో జైపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నగరంలో నేడు..

- కేంద్ర 17వ ఆర్థిక సంఘం ముఖ్య సలహారు కేవీ సుబ్రమణియన్ రచించిన ఇండియా : 100, రేపటి ఆర్థిక శక్తి కేంద్రం పుస్తకం ఆవిష్కరణ మధ్యాహ్నం 3.30గంటలకు గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బి) హైదరాబాద్ క్యాంపస్‌లో జరుగుతుంది.
- ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో ఉదయం 10.30 గంటలకు అవయవ దానంపై అవగాహన శిబిరం జరుగుతుంది.

వలలో కాళ్లు చిక్కుకుని..

నీట మునిగి వ్యక్తి మృతి


దశరథ్ (ఫైల్)

గచ్చిబౌలి: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుల్బర్గాకు బహంత్రి ధశరథ్(35) ఏడాది క్రితం నగరానికి వలస వచ్చి గోపన్‌పల్లి ఎన్‌టీఆర్‌నగర్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతను తాజ్‌నగర్‌లోని చెరువులోకి చేపల వేటకు వెళ్లాడు. మధ్యాహ్నం చెరువులోకి దిగగా కాళ్లకు చేపల వల చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. అతడి కేకలు విని అక్కడే ఉన్న వెంకటేష్ అనే వ్యక్తి కాపాడేందుకు యత్నించగా దశరథ్ అప్పటికే నీటిలో మునిగిపోయాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శైలజామిత్ర రచనల ఆవిష్కరణ


శైలజా మిత్రను సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి: విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి శైలజా మిత్ర రచించిన జన్మించడమే కవిత్వం, వష్టి సంపుటిల ఆవిష్కరణ ఆదివారం రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో జరిగింది. సమితి అధ్యక్షుడు జల్ది విద్యాధర్ మాట్లాడుతూ మానవ సంబంధాలను కేంద్రంగా చేసుకుని శైలజామిత్ర సాహిత్యాన్ని సృష్టిస్తున్నారన్నారు. బళ్లారి తెలుగు సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ దేవన్న మాట్లాడుతూ శైలజా మిత్ర రచనల్లో అభ్యుదయ భావాలను వివరిస్తూనే ఔన్నత్యాన్ని చాటారన్నారు. ఆమె ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు బిక్కి కృష్ణ, నరసింహారాజు, రాధాకుసుమ, తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ నేటి తరానికి ఆదర్శం



చిక్కడపల్లి: అరుదైన సేవామూర్తి డొక్కా సీతమ్మ అని విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతి శర్మ అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభలో 'ఆంధ్ర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ యాదిలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ... గోదావరి జిల్లాల్లో డొక్కా సీతమ్మ పేరు చెప్పగానే ఆకలిని తీర్చే అన్నపూర్ణ అని కొనియాడతారన్నారు. ప్రతి రోజు ఇంట్లోనే అన్నదానం చేస్తూ ఎందరో ఆకలిని తీర్చిన మహోన్నతురాలన్నారు. అన్నార్థుల కోసం తన సంపాదనను ఖర్చు పెట్టి నేటి తరాలకు ఆదర్శంగా నిలిచిందనానరు. కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు జయసూర్య, భవాని, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో ఉత్తమ సేవలు



సాక్షి, సిటీబ్యూరో: రాణీరుద్రమాదేవి లెజెండరీ అవార్డును క్యాపిటల్ విద్యాసంస్థల డైరెక్టర్ హేమలత అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 78వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పదేళ్లలో విద్యారంగంలో అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించినట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డా.ఎస్.సరోజనమ్మ తెలిపారు. తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యా విధానాల అమలు, ఉద్యోగుల సేవలను పరిగణలోకి తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, దైవజ్ఞ శర్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీ కొట్టిన టిప్పర్

నలుగురికి గాయాలు


గాయపడిన లారీ డ్రైవర్ సతీష్


కారుపై ఒరిగిపోయిన లారీ

మణికొండ: వేగంగా దూసుకు వచ్చిన ఓ టిప్పర్ లారీ అకస్మాత్తుగా మలుపు తీసుకున్న ఓ కారును ఢీ కొట్టి దానిపై పడిపోయిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైహోం అవతార్ సర్కిల్‌లో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగి నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్న వ్యాగన్ ఆర్ కారు మైహోం సర్కిల్ వద్దకు రాగానే గచ్చిబౌలి నుంచి నార్సింగి వైపు వస్తున్న టిప్పు ఢీ కొట్టింది. ఈ ఘటనలో టిప్పర్ కారుపై ఒరిగి పోవడంతో కారులో ప్రయాణిస్తున్న సుదీప్, గౌతమ్, ఈశ్వర్ గాయపడ్డారు. లారీ డ్రైవర్ సతీష్ అందులోనే ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తప్పించి లారీలో ఇరుక్కుపోయిన డైవర్‌ను బయటకు తీశారు. బాధితులను చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన 'పీడియాట్రిక్ అనస్తీషియా కనెక్ట్'


ముగింపు కార్యక్రమంలో ఐఎస్‌ఏ, ఐఏపీఏ ప్రతినిధులు..

సనత్‌నగర్: బేగంపేటలోని హోటల్ ది ప్లాజాలో రెండు రోజుల పాటు 'పీడియాట్రిక్ అనస్తీషియా కనెక్ట్' థీమ్‌తో జరిగిన పీడియాట్రిక్ అనస్తీషియాలజిస్టుల సదస్సు ఆదివారం ముగిసింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్ట్స్ (ఐఎస్‌ఏ), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ అనస్తీషియాలజీ (ఐఏపీఏ) తెలంగాణ రాష్ట్ర శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 150 మంది అనస్తీషియా నిపుణులు, పీడియాట్రీషియన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఏపీఏ తెలంగాణ అధ్యక్షుడు రాజా నర్సింగ్‌రావు మాట్లాడుతూ సమాజంలో పీడియాట్రిక్ అనస్తషియా అత్యంత ముఖ్యమైన అంశాల్లో ఒకటి అన్నారు. దేశంలో పీడియాట్రిక్ అనస్తీషియాలజీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పీడియాట్రిక్ అనస్తీషియాలో స్పెషాలిటీ ట్రెనింగ్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందన్నారు. చాలామంది పిల్లలకు సాధారణ అనస్తీషియన్‌లు మత్తు మందు ఇస్తారని, తగినంత మంది స్పెషలిస్టులు అందుబాటులో లేరన్నారు. ఐఏపీఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శైలజ మాట్లాడుతూ ఐఏపీఏ పీడియాట్రిక్ అనస్తీషియా రంగంలో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి, సమాచారాన్ని పంచుకోవడానికి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ అనస్తీషియన్లు పాల్గొన్నారు.

జాతీయ ట్రాన్సిట్ పర్మిట్ విధానంలో మార్పులు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

నాంపల్లి: నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ విధానంలో మార్పులు చేయాలని, జీఎస్టీ వే బిల్లు తరహాలోనే ఫార్మ్-2 పర్మిట్ అమలులోకి తీసుకు రావాలని ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ టింబర్ మర్చంట్స్ సామిల్ అలైడ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు చక్కిలం రమణయ్య అన్నారు. ఆదివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో నిర్వహించిన సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మ్-2 పర్మిట్ ఆన్‌లైన్‌లో వచ్చే వరకు మాన్యువల్ బిల్స్ ఇవ్వాలని కోరారు. సామిల్ రూల్‌లో, జీఓ నెం.69లో లేని విధానాన్ని వ్యాపారస్తులు పర్మిట్ ద్వారా ఖరీదు చేసి దిగుమతి చేసుకున్న టింబర్‌ను 24 గంటల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలియజేయాలన్నారు. కలప కోత మిషన్లలో దుగోడ మిషన్‌కు అనుమతి ఇవ్వాలని, గ్రౌండ్ స్టాక్ అనే అంశాన్ని జీ.ఓ నెం.69 నుండి తీసివేయాలని కోరారు. జీ.ఓ నెం.69 ప్రకారం లైసెన్స్‌లు రెన్యువల్ చేస్తున్నప్పుడు, రాష్ట్రంలోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు మూడేళ్ల పరిమితిని తప్పనిసరిగా అమలు చేయాలని, సామిల్లు లైసెన్సులు రెన్యువల్ అప్లికేషన్స్‌లో ఫార్మ్-2లో జీఎస్టీ, ఐటీ రిటర్న్స్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రామకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, కోశాధికారి పురుషోత్తం పటేల్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో ఖుదిరామ్ బోస్ వర్ధంతి

లక్డీకాపూల్: బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి 18 ఏళ్ల వయసులో ఉరికంభం ఎక్కిన మహనీయుడు ఖుదిరామ్ బోస్ వర్ధంతిని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జే.మల్లేష్ మాట్లాడుతూ నేటి యువత బోస్‌ను ఆదర్శంగా తీసుకుని తమ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు స్వాతి, నితీష్, ప్రతిభ, నాగరాజు, వినోద్, సిద్ధార్థ్, ప్రణవ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.


పరిమిత సక్రోలోజ్ వినియోగం సురక్షితమే

మద్రాస్ డయాబెటిస్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: చక్కెరకు ప్రత్యామ్నాయంగా సక్రలోజ్ వినియోగం అనారోగ్యకారకం కావచ్చునని కొన్ని సందేహాలు రేకెత్తుతున్న తరుణంలో సక్రలోజ్ పరిమిత వినియోగం సురక్షితమేనని ఓ అధ్యయనం వెల్లడించింది. డయాబెటిస్ రోగులకు దేశవ్యాప్తంగా సేవలు అందించే స్వచ్ఛంద సంస్థ మద్రాస్ డయాబెటిస్ ఫౌండేషన్ 12 వారాల పాటు 179 మంది టైప్ 2 డయాబెటిస్ రోగులపై ఈ అధ్యయనాన్ని నిర్వహించి ఫలితాలను వెల్లడించింది. కేలరీలను తగ్గించడంలో సక్రలోజ్ సహాయపడుతుందని, టీ లేదా కాఫీ వంటి రోజువారీ పానీయాల్లో అనుమతించిన మోతాదు మేర వినియోగించడం అనేది టైప్ 2 డయాబెటిస్ రోగులకు సురక్షితమేనని స్పష్టం చేసింది.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

25 ఫోన్లు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఆధీనంలోని స్పెషల్ టీమ్ అధికారులు వారి నుంచి 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డీసీపీ ఎస్.శ్వేత ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాన్గార్‌బస్తీకి చెందిన ఆటోడ్రైవర్లు దయ, మహ్మద్ జహంగీర్ స్నేహితులు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. వీరిలో దయాపై గతంలో ఆరు కేసులు, జహంగీర్‌పై ఒక కేసు ఉన్నాయి. వీరి కదలికలపై నిఘా వేసిన ఇన్‌స్పెక్టర్ డి.బిక్షపతి నేతృత్వంలోని బృందం ఆదివారం వీరిని అదుపులోకి తుసుకుంది. విచారణ నేపథ్యంలో చోరీ సొత్తును చెప్పల్‌బజార్‌కు చెందిన వినోద్‌కుమార్ తివారీకి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో అతడినీ అరెస్టు చేసిన పోలీసులు మొత్తం 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఆరు ఫోన్ల చోరీలకు సంబంధించి హుమాయున్‌నగర్, దోమలగూడ, హుస్సేని ఆలం, గుడిమల్కాపూర్, చాదర్‌ఘాట్, అఫ్జల్‌గంజ్ ఠాణాలో కేసులు నమోదై ఉన్నాయి. మిగిలిన ఫోన్ల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఫిలింనగర్‌లో చోరీ..

ఫిలింనగర్: బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి విలువైన బంగారు ఆభరణాలను తస్కరించిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-80లో నివసించే శారదారెడ్డి ఈ నెల 9న రాత్రి వజ్రాలతో పొదిగిన మంగళసూత్రంతో పాటు ఇతర ఆభరణాలను టేబుల్‌పై ఉంచింది. ఆదివారం ఉదయం ఆభరణాలు వేసుకునేందుకు చూడగా అవి కనిపించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా శనివారం తెల్లవారుజామున బైక్‌పై ఇద్దరు యువకులు అక్కడికి వచ్చినట్లు గుర్తించారు. వారిలో ఒకరు బైక్‌పై కూర్చోగా, మరో వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూంలో ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్తున్నట్లుగా రికార్డయ్యింది. ఫిర్యాదుతో పాటు ఆమె సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయుల విగ్రహాలకు పాలాభిషేకం



మహనీయుల విగ్రహాలను శుభ్రపరుస్తున్న బీజేపీ నేతలు

ఫిలింనగర్: స్వాతంత్ర్య, అమృత మహోత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా అభియాన్–2024 బీజేపీ పిలుపు మేరకు ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గం బీజేపీ నేతలు ఫిలింనగర్ చౌరస్తాలోని మహనీయుల విగ్రహాలను శుభ్రపరిచారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయుల విగ్రహాలకు పాలాభిషేకం చేయడమే కాకుండా పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ నెల 13న పంజగుట్ట నుంచి లిబర్టీ వరకు ఖైరతాబాద్ అసెంబ్లీ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించే తిరంగా యాత్ర బైక్ ర్యాలీలో ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి సగర్వంగా దేశభక్తిని చాటుకోవాలని ఈ సందర్భంగా చింతల కోరారు.

పబ్‌లలో పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని తబులారసా పబ్‌లో జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అర్ధరాత్రి పలువురు కస్టమర్లకు డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహించారు. 20 మందికి ఈ టెస్ట్‌లు నిర్వహించగా అందరికీ పాజిటివ్‌గా వచ్చిందని పోలీసులు తెలిపారు. ఇటీవల పబ్‌ల్లో డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తరచూ ఎక్సైజ్ పోలీసులు కూడా డ్రగ్స్‌తో పాటు గంజాయి టెస్ట్‌లు కూడా నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్‌లోని జోరా పబ్‌లో కూడా టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని అరికట్టే దిశలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

మందకృష్ణ పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ : రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రహమత్‌నగర్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఎన్నోఏళ్లుగా చేసిన పోరాట ఫలితంగానే ఎస్సీవర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ నాయకుడు దుడ్డు రామకృష్ణ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ రాజీవ్‌గాంధీనగర్‌లో ఆదివారం డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకుడు దేవదానం ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశంలో నగర ఎమ్మార్పీఎస్ నాయకుడు రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ నగరానికి ఈనెల 13న మందకృష్ణ మాదిగ వస్తున్న తరుణంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున మాదిగ సోదరులు తరలివచ్చి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలకాలని కోరారు. మందకృష్ణ మాదిగ ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని కొనియాడారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ కన్వీనర్ చిట్యాల ఆనంద్ మాదిగ, చిన్నా మాదిగ, దాసరి సతీష్ మాదిగ, మహేందర్ మాదిగ, మొగలయ్య మాదిగ, అంజి మాదిగ, శేఖర్ మాదిగ, శాంసన్ మాదిగలు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ హిందువులపై దాడికి నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సామాజిక, సామరస్య వేదిక నాయకులు

రహమత్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందు ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం రహమత్‌నగర్‌లో సామాజిక సామరస్య వేదిక ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తంగలపెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై కావాలనే ఒక వర్గం వరుస దాడులు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్ హిందువులకు భారత్ హిందువులు అండగా ఉంటారని తెలిపారు. నిరసన ర్యాలీ రహమత్‌నగర్ నుంచి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. కాగా నిరసనకారులకు పోలీసులు అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

యువకుడిని చితకబాదిన ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్: పాత కక్షను మనస్సులో పెట్టుకొని ఓ యువకుడిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురి యువకులపై కేసు నమోదైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ పోచమ్మగుడి సమీపంలో నివసించే ఎండీ అబ్బాసు లేమాన్ అలియాస్ మైఖేల్ సౌండ్స్ అండ్ లైట్స్‌లో పనిచేస్తుంటాడు. బోనాల పండుగ రోజు అన్నపూర్ణ స్టూడియో సమీపంలో స్కూటీ విషయంలో రాము అనే యువకుడితో మైఖేల్‌కు గొడవ జరిగింది. ఇది దృష్టిలో పెట్టుకుని శనివారం రాత్రి మైఖేల్ తన స్నేహితుడు ఈశ్వర్‌తో కలిసి స్కూటీపై వెళ్తుండగా గ్రీన్‌బావర్చి హోటల్ వద్ద రాము అడ్డుకుని గొడవకు దిగడంతోపాటు దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో రాము స్నేహితులు దుర్గాచైతన్య, వెంకట్‌లు కూడా మైఖేల్ ముఖం, వీపుపై తీవ్రంగా దాడి చేశాడు. దీంతో మైఖేల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని రాము, దుర్గాచైతన్య, వెంకట్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బస్తీల్లో శ్రావణమాస బోనాల సందడి

• భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ • ఆకట్టుకున్న పోతరాజుల ప్రదర్శనలు • వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



దుర్గా భవానీనగర్ బస్తీలో బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల



బోనాన్ని తీసుకొస్తున్న మహిళ

బంజారాహిల్స్: శ్రావణమాస బోనాల వేడుకలతో బస్తీల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, హిమా యత్‌నగర్, ఖైరతాబాద్ డివిజన్లలోని పలు అమ్మవారి ఆలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ ఫేజ్–1 బస్తీలో ఈదమ్మ–ఎల్లమ్మ ఆలయంలో జరిగిన బోనాల వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు వేముల జగన్, ఒర్సు శ్రీను పాల్గొన్నారు. అదే విధంగా జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పటేల్‌నగర్, బండారు బాల్‌రెడ్డినగర్, బసవతారకం నగర్, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46లోని అంబేద్కర్‌నగర్ బస్తీల్లో పెద్ద ఎత్తున బోనాల వేడుకలు నిర్వహించారు. బస్తీవాసులు ఒకేసారి సామూహికంగా అమ్మవారికి బోనాలు సమర్పించే వేడుక కన్నుల పండువగా జరిగింది. ఆయా ఆలయాల వద్ద శివసత్తుల, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం5 దేవరకొండ బస్తీలో అమ్మవారి ఆలయంలో బస్తీవాసులు సామూహికంగా బోనాలు సమర్పించారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బంజారాహిల్స్, ఫిలింనగర్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఫిలింనగర్‌లో జరిగిన బోనాల వేడుకల్లో సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావుతో పాటు వంశీకృష్ణ, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో కార్పొరేటర్ కవితారెడ్డి

శ్రావణమాస బోనాల వేడుకలు వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో అత్యంత వైభవంగా జరిగాయి. కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి దేవరకొండ బస్తీ, దూద్‌ఖాన్ బస్తీ, ఇబ్రహీంనగర్ బస్తీల్లో కొలువుదీరిన అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించి స్థానికులతో కలసి బోనమెత్తి సంబరాలు జరుపుకున్నారు.

కార్పొరేటర్ వెంకటేష్ ప్రత్యేక పూజలు

శ్రావణమాస బోనాల పండుగ వేడుకలు జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బాల్‌రెడ్డినగర్, బసవతారకనగర్, పటేల్‌నగర్ బస్తీల్లో కొలువుదీరిన అమ్మవారి ఆలయాల్లో ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేష్ బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.





వేడుకల్లో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్



పూజల్లో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి







పటేల్‌నగర్ బస్తీలో ..



బోనాలు తీసుకొస్తున్న మహిళలు..

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలి

శ్రీనగర్‌కాలనీ: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లంకల దీపక్‌రెడ్డి సూచించారు. ఆదివారం నాగార్జుననగర్ కాలనీలోని బీజేపీ జూబ్లీహిల్స్ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 15 వరకూ హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా జాతీయ జెండాను ఏర్పాటు చేసుకొనేలా నేతల, కార్యకర్తలు తగు సహాయ, సహకారాలు ఆ దిశగా కృషి చేయాలని కోరారు. ఈనెల 12న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల విగ్రహాలను శుభ్రపరిచి నివాళులర్పించాలని కోరారు. 13న బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలను, 15 న ప్రతి బూత్ లెవెల్ పోలింగ్ కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేయా లని సూచించారు.ఈ సమావేశంలో నేతలు కిలారి మనోహర్, అట్లూరి రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, కొలన్ సత్యనారాయణ, కుంభాల గంగరాజు, నాగేశ్వరరావు, శాంతికుమార్, మల్లారెడ్డి,అనంతలక్ష్మి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంకల దీపక్‌రెడ్డి

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం

రెండోసారి కూడా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

వెంగళరావునగర్: వెంగళరావునగర్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిలకల వెంకటేశ్వరరావు రెండోసారి కూడా నియమితులయ్యారు. వెంగళరావునగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం వెంగళరావునగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఈసారి ఎన్నికల్లో కార్యవర్గాన్ని మొత్తాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలిసారి పోటీ లేకుండా ఎన్నిక ఏకగ్రీవం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నికల్లో అధ్యక్షులుగా వెంకటేశ్వరరావు నియమితులు కాగా ప్రధాన కార్యదర్శిగా పూదోట శౌరి రాజు, ఉపాధ్యక్షులుగా పిహెచ్‌ఎస్ ప్రసాద్, అర్జున్, కోశాధికారిగా రాజశేఖర్, జాయింట్ సెక్రటరీగా డి.ధనుంజయరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉదయ భాస్కర్‌లతో పా టుగా మరో 23 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. కాగా ఎన్నికల అధికారులుగా కె.రాజశేఖర్, ముత్తయ్యలు వ్యవహరించారు.



వెంగళరావునగర్‌కాలనీ నూతన కార్యవర్గం

కాలనీవాసుల సహకారంతో మరింత అభివృద్ధి : వెంకటేశ్వరరావు

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు చిలకల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు పేర్కొన్నారు. తనతో పాటుగా నియమితులైన అసోసియేషన్ కార్యవర్గం. కాలనీవాసుల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడిపై హత్యాయత్నం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఆర్‌నగర్ ఏసీపీ
- మూడు నెలల వ్యవధిలో రెండు ఘటనలు



రహమత్‌నగర్ (బోరబండ): నిమ్స్‌మే మైదానంలో గుర్తుతెలియని యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కార్మికనగర్ చిల్లా పక్కన ఉన్న నిమ్స్‌మే మైదానంలో రక్తపు మడుగులో ఓ యువకుడు పడి ఉన్నాడనే స్థానికుల సమాచారంతో ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ, వీరశేఖర్, డీఐ భూపాల్‌గౌడ్‌లు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలు అయి కొన ఊపిరితో ఉన్న యువకుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. హత్యాయత్నం శనివారం రాత్రి జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. గాయపడిన యువకుడి ఫొటో ఆధారంగా అతను ఏ ప్రాంతానికి చెందిన వాడని విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇదే మైదానంలో రెండు ఘటనలు

కార్మికనగర్ చిల్లా పక్కన ఉన్న నిమ్స్‌మే మైదానంలో మూడు నెలల క్రితం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. తాజాగా ఆదివారం మరో యువకుడిపై హత్యాయత్నం జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిర్మానుష్య ప్రదేశం కావడంతో ఈ మైదానంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. మైదానం చుట్టు ప్రహరీ గోడ ఉన్నప్పటికీ నాలా వద్ద పిల్ల దారి ఉండటంతో అక్కడకు ప్రవేశిస్తున్నారని బస్తీవాసులు చెపుతున్నారు. మైదానంలోని చెట్లను తొలగించి, విద్యుత్తు దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే అసాంఘిక కార్యకలాపాలు కొంత మేరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీల మధ్య చిచ్చు

బంజారాహిల్స్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారి రాజకీయ లబ్ధి కోసం ఎస్సీల మధ్య చిచ్చు పెడుతుందని మాల వెలుగు సంఘం నాయకుడు దండు లక్ష్మణ్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఫిలింనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దండు లక్ష్మణ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎస్సీలను విడగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్నాయన్నారు. ఎస్సీలు ఒక్కటిగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాల వెలుగు సంఘం నేతలు పాల్గొన్నారు.



'పుష్పాంజలి' కార్యక్రమానికి వందవారాలు పూర్తి



కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకుంటున్న దళిత నాయకులు

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ డివిజన్ వీకర్ సెక్షన్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి డా.బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే పుష్పాంజలి కార్యక్రమం వంద వారాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఏడీ మధు మాట్లాడుతూ బోరబండ డివిజన్‌లో కొనసాగుతున్న ఈ వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాల నుంచి అనూహ్య స్పందన లభిసుందన్నారు. ఈ అంబేడ్కర్ పుష్పాంజలి కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు పాల్గొంటున్న దళిత నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పీజీడీఎం ప్రోగ్రాంకు ఏఐయూ గుర్తింపు

ఐసీబీఎం–ఎస్‌బీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జరార్

బంజారాహిల్స్: ఐసీబీఎం–ఎస్‌బీఈ పీజీడీఎం ప్రోగ్రాంను అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ (ఏఐయూ) ఎంబీఏతో సమానంగా గుర్తించిందని ఐసీబీఎం–ఎస్‌బీఈ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ జరార్ తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీజీడీఎం కోర్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. క్యాంపస్‌లో ప్రస్తుతం 300 సీట్లు ఉన్నాయని రెండు సంవత్సరాల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వందశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రొఫెసర్ జరార్

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన





వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లోని సీనియర్ సిటిజన్స్ డిగ్నిటీహాల్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సాధారణ రోగాలతో పాటుగా కార్డియాలజీ, వైటల్ చెక్, జనరల్ ర్యాండం బ్లడ్ షుగర్, బీ.పీ. ఈసీజీ, 2డి, ఎకో, ఆర్థో చెకప్, మహిళలకు సంబంధించిన వ్యాధులతోపాటు కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు తదితర సమస్యలపై పరీక్షలను నిర్వహించారు. నగరంలోని ప్రముఖ ఆసుపత్రులైన కేర్, మ్యాక్స్‌విజన్, గౌడ ఈఎన్‌టీ ఆసుపత్రులకు చెందిన ప్రముఖ వైద్యులు ఆయా ఆసుపత్రులకు చెందిన సిబ్బంది తమ వైద్యసేవలను అందించి మందులు పంపిణీ చేశారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వైద్య శిబిరంలో దాదాపు 250 కాలనీవాసులు వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించిన వైద్యులకు, సహకరించిన సిబ్బందితో పాటుగా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశిరావు, జాయింట్ సెక్రటరీ సి.హనుమంత రావు, కోశాధికారి కె.సుగుణ, మాజీ ఉపాధ్యక్షులు సిహెచ్.సత్యనారాయణరాజు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జిమ్.. ఆరెంజ్ థీమ్..



సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యేకమైన ఆరెంజ్ థీమ్‌తో వినూత్నంగా అనిపించే ఆరెంజ్ థియరీ ఫిట్‌నెస్ ఇండియా.. నగరంలో తన సెంటర్‌ను నెలకొల్పింది. బంజారాహిల్స్ రోడ్ నెం–7లో ఏర్పాటైన ఈ ఫిట్‌నెస్ సెంటర్‌ను నగరవాసులకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆదివారం బ్రాండ్ చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ దృష్టి చాబ్రియా తెలిపారు. దాదాపు 2,700 చదరపు అడుగులపైగా విస్తీర్ణంలో ఈ విశాలమైన అత్యాధునిక వ్యాయామ కేంద్రం నెలకొల్పామని, శాస్త్రీయ నేపథ్యం కలిగిన వర్కవుట్స్‌కి తమ బ్రాండ్ పేరొందిందని వివరించారు. మితిమీరిన శిక్షణ అవసరం లేకుండా తమ సభ్యులు ఫిట్‌నెస్ లక్ష్యాలు చేరుకునేలా తమ వర్కవుట్ రొటీన్ డిజైన్ చేశామన్నారు. అంతర్జాతీయ జీవన ప్రమాణాలకు నిలయమైన హైదరాబాద్‌లో స్థానికులకు నచ్చే వ్యక్తిగతీకరించిన వర్కవుట్ అనుభవాలను అందిస్తామన్నారు.

నా ఆత్మలో.. బ్యాడ్మింటన్

సైనా నెహ్వాల్

మణికొండ: బ్యాడ్మింటన్ తన ఆత్మలో ఉందని, దాన్ని ఎప్పటికీ వదలిపెట్టనని పద్మవిభూషన్ అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్–3 వద్ద యోనెక్స్ స్పోర్ట్స్ స్టోర్‌ను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో క్రీడాకారుల సంఖ్య మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువులతో పాటు వారికి నచ్చిన క్రీడలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలకు మన దేశంలో రాబోయే రోజుల్లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఫిట్‌గా ఉండేలా చూసుకుని క్రీడల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. రెజ్లర్ వినేష్ పోగట్‌కు మరో పతకం వస్తుందనే ఆశతోనే ఉన్నానన్నారు. కార్యక్రమంలో స్టోర్ యజమానులు అమర్, కిరణ్, వెంకట్‌తో పాటు ఆమె అభిమానులు పాల్గొన్నారు.







దేశంలో ఏడు పదుల వయసులోని తొలి మోడల్

లాస్ ఏంజెల్స్ ర్యాంప్‌పైనా మెరవనున్న కుమనన్

ఏడుపదుల వయసులో.. ఫిజిక్ ఫిట్

20 ఏళ్లలో చెక్కిన శిల్పమైన టాలీవుడ్ హీమాన్

రమణా లోడ్ ఎత్తాలిరా అనే డైలాగ్ వింటే ప్రేక్షకులకు ఆయన గుర్తొస్తాడు కానీ సిటీలోని ఫిట్‌నెస్ స్టూడియోల్లో మాత్రం సీనియర్ సిటిజన్స్ ఫిజిక్ గురించి మాట్లాడాలంటే ఆయన తప్ప మరెవరూ గుర్తురారు. జన్మతః తమిళనాడుకు చెందిన కుమనన్. ప్రస్తుతం టాలీవుడ్ నటుడిగా రాణిస్తున్నారు. అంతేకాదు అద్భుతమైన శరీరాకృతితో ఆకట్టుకుంటూ ఏడు పదుల వయసులో ఏకైక మేల్ మోడల్‌గానూ ర్యాంప్‌పై మెరుస్తున్నారు. ఇటీవలే అంతర్జాతీయంగా పనిచేసే బియర్డ్స్ క్లబ్ నుంచి వాషింగ్టన్‌లో నిర్వహించే ఈవెంట్‌లో ర్యాంప్ వాక్‌కు ఆహ్వానం సైతం అందుకున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'తో ఆయన పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..

– సాక్షి, సిటీబ్యూరో

ఓ టీవీలు తయారు చేసే కంపెనీలో ఉద్యోగం చేసే సమయంలో చాలా లావుగా ఉండేవాడ్ని. డీలర్ల మీట్స్ కాక్‌టెయిల్ పార్టీస్‌తో వెయిట్ పెరిగాను. అదే సమయంలో నాకు వ్యక్తిగతంగా ఉన్న ఇష్టంతో ఫ్యాషన్ ఫొటోగ్రఫీ కూడా పార్ట్‌టైమ్‌గా చేసేవాడ్ని. అలా వైజాగ్‌తో పాటు పలు నగరాల్లో ఫ్యాషన్ ఈవెంట్స్‌కు హాజరయ్యేవాడిని. అలాంటి సమయంలో వారిని చూసినప్పుడు మోడల్స్‌లా మనమెందుకు లేం? ఈ పొట్ట, ఫ్యాట్ మనల్ని వదిలిపోవా? అని ఆలోచించేవాడ్ని.

మార్చిన మోడల్స్..

ఇలాంటి ఆలోచనలతో కొందరు మోడల్స్‌తో మాట్లాడుతూ అనేక విషయాలపైన అవగాహన పెంచుకున్నాను. ముందు వెయిట్‌లాస్ అవ్వాలి. రోజూ వాకింగ్ చేసి వెయిట్ లాస్ అయ్యాక వర్కవుట్ చేయాలనేది తెలుసుకున్నా. ఒక శుభముహూర్తాన కాక్‌టెయిల్ పార్టీలు సహా అన్ని అనారోగ్యకర అలవాట్లకు గుడ్‌బై చెప్పేసి ఫిట్‌నెస్ లవర్‌గా మారిపోయాను. రోజూ విశాఖ బీచ్‌లో కాళిమాత గుడి నుంచి పార్క్ హోటల్ వరకూ 2గంటల పాటు ఇసుకలో జాగింగ్ చేసేవాడ్ని.. ఆ తర్వాత లెమన్ వాటర్ మాత్రమే తాగేవాడ్ని. ఆర్నెళ్లలో బాగా వెయిట్ లాస్ అయ్యాను. ఆ తర్వాత జిమ్‌లో జాయిన్ అయ్యా.. కట్ చేస్తే.. పొట్ట, కొవ్వు అన్నీ మాయమై.. చక్కని ఫిజిక్ సాధ్యమైంది. అదే ఫిజిక్ నాకు సినిమాల్లో నటుడిగా అవకాశం వచ్చేలా చేసింది. అలా 20 ఏళ్ల నుంచి నా శరీరం పూర్తిగా నా నియంత్రణలోనే ఉంటోంది. సినిమాల్లో అవకాశాలతో నగరానికి షిఫ్ట్ అయ్యాక కృష్ణానగర్‌లోని ఓ చిన్న జిమ్‌తో మొదలెట్టి, వెంకట్ ఫిట్‌నెస్ వగైరా జిమ్స్‌లో నా జర్నీ కంటిన్యూ చేశా..



ఆరోగ్యకరమైన వంటలు..

తొలిదశలో రోజుకు డజను గుడ్లు.. 4గంటల వర్కవుట్ చేసేవాడ్ని. వయసుతో పాటు మార్పు చేర్పుల్లో భాగంగా ఇప్పుడు అరడజను గుడ్లు కనీసం, 3గంటల పాటు వ్యాయామం చేస్తున్నా. ఇప్పటికీ ఆపకుండా 100 దండీలు ఒకే స్ట్రెచ్‌లో తీయగలను. ట్రైన్ చేయమని టాలీవుడ్ ప్రముఖులు అడుగుతుంటారు. అయితే అది ఒక పూర్తిస్థాయి ప్రొఫెషన్ అనుకుంటేనే అటు వెళ్లాలి. అందుకే సలహాలు చెబుతా తప్ప ట్రైనర్‌గా మారను.

డైట్ రొటీన్ ఇదీ...

ఉదయం 7గంటలకల్లా నిద్ర లేస్తా. వేడినీళ్లలో నిమ్మకాయ వేసుకుని తీసుకుంటా.. పంచదార, బెల్లం, పెరుగు, వైట్‌రైస్ వినియోగించను. జిమ్ అయ్యాక 4 వైట్ బాయిల్డ్ ఎగ్స్ తీసుకుంటాను. లంచ్‌లో ఉప్పు లేకుండా బాయిల్డ్ వెజిటబుల్స్ అవి కూడా కాలీఫ్లవర్, బ్రొకోలీ, క్యారెట్, బీన్స్, క్యాబేజీ లాంటివి మాత్రమే తీసుకుంటాను. రాత్రి మిల్లెట్స్, కొర్రలు, లేదా క్వినోవా.. మితంగా తీసుకుంటాను.

వర్కవుట్ రొటీన్ ఇదీ..

రోజూ ఉదయం 7గంటలకు నిద్రలేచి వేడి నిమ్మకాయ నీళ్లు తాగి జిమ్‌కు వెళతాను. అక్కడ 45 నిమిషాల వార్మప్.. ఇందులో ట్రెడ్‌మిల్ మీద వాకింగ్, బోనియం పాటకి ఎరోబిక్స్.. (ఈ ఒక్కపాట చేస్తే చాలు రోజుకు సరిపడా వర్కవుట్ చేసినట్లు అవుతుంది) వంటివి ఉంటాయి. ఆ తర్వాత వర్కవుట్ స్టార్ట్. రోజుకు 2 బాడీ పార్ట్స్ చేస్తాను. మొదటి రోజు ఫ్లెయిన్ రాడ్ మీద బెంచ్ ప్రెస్, ఫ్లైస్ ఒక రోజు స్క్వాట్, కాఫ్ మజిల్, మరో రోజు ఆ తర్వాత రోజు మొత్తం లాటిస్, ఆ తర్వాత ట్రైసప్, బైసప్ ఇలా.. రొటీన్‌గా సాగుతుంది.

వెయిట్స్‌తో ఇలా.. చేస్తే భళా..

నేను జిమ్‌లో అడుగుపెట్టిన తొలిరోజే 50 చొప్పున డంబెల్స్‌తో రిపిటీషన్స్ చేయడంతో రెండోరోజు చేతులు పనిచేయలేదు. అయినా తగ్గించకుండా అలాగే చేస్తూ వచ్చా. అలవాటైపోయింది. తక్కువ వెయిట్స్‌తో ఎక్కువ రిపిటీషన్స్ చేయడం వల్ల ఆర్నెళ్లు వర్కవుట్ చేయకపోయినా షేప్ మారకుండా అలాగే ఉంటుంది. అదే వెయిట్స్ పెంచుకుంటూ పోతే ఇమ్మీడియట్‌గా మజిల్ పంప్ అయి మళ్లీ త్వరితంగానే బెలూన్‌లో గాలి తీసినట్లు అయిపోతాం. బాడీ బిల్డింగ్ చేయవచ్చు కదా అని కొందరు అడిగేవారు.. నాకు అలాంటి లక్ష్యాలేవీ లేవు.. జస్ట్ చూడడానికి లుక్ బాగుండాలి.. అంతేకాదు శరీరం ఎప్పుడూ రెడీ ఫర్ వార్ అన్నట్టు ఉండాలి. ఇక్కడ నుంచి దూకు అంటే దూకేయాలి అలా చురుగ్గా ఉండాలి. ఇప్పటికీ నేను గంటకు 16.5, 17కి.మీ స్ప్రింట్ చేయగలను.

మోడల్‌గా జర్నీ..

నటుడిగా చేస్తుండగానే పలుచోట్ల ర్యాంప్ షోలపై మోడల్‌గానూ వచ్చిన అవకాశాలను ఉపయోగించుకున్నాను. వేర్వేరు నగరాల్లో జరిగిన మోడలింగ్ ఈవెంట్స్‌లో పాల్గొన్నాను. ఇటీవలే అంతర్జాతీయంగా పనిచేస్తున్న బియర్డ్ క్లబ్ వాళ్లు వాషింగ్టన్‌లో నిర్వహిస్తున్న ఫ్యాషన్ షోకు ఆహ్వానించారు. అయితే నేనింకా ఈ విషయంలో ఫైనల్ నిర్ణయం తీసుకోలేదు.



షాన్‌దార్ షాండ్లియర్!

గృహాలంకరణలో వీటిది ప్రత్యేక స్థానం

- మిరుమిట్లు గొలిపే విద్యుత్తు వెలుగు
- అందుబాటులో స్మార్ట్ లైటింగ్ టెక్నాలజీ



సాక్షి, సిటీబ్యూరో: ఇళ్లయినా, స్టార్ హోటలైనా.. మిరుమిట్లుగొలిపే షాండ్లియర్స్ వినియోగం తప్పనిసరి. పైకప్పు నుంచి వేలాడే ఈ దీపాలంకరణ చూపర్లను మంత్రముగ్ధుల్ని చేసేస్తుంది. వెలుగుతో పాటూ వినసొంపైన సంగీతాన్ని వినిపించడమే షాండ్లియర్స్ ప్రత్యేకత. గృహాలంకరణలో దీనికి ప్రాధాన్యం పెరిగిపోయింది. షాండ్లియర్స్ వినియోగం కొత్తేమీ కాదు.. నిజాం నవాబుల కాలం నుంచే దీనికి ప్రాధాన్యత ఉంది. కానీ, తాజాగా స్మార్ట్ టెక్నాలజీతో వినూత్న రీతిలో, ఫీచర్లతో మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి.

కలల గృహాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు నగరవాసులు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. ఈక్రమంలో ఇంట్లో విద్యుత్తు వెలుగులకు ప్రాధాన్యత సంతరించుకుంటోంది. కళ్లు మిరిమిట్లుగొలిపే షాండ్లియర్స్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రస్తుతం నగరంలో 5 అడుగుల నుంచి 7 అడుగుల ఎత్తు గల షాండ్లియర్స్ ఎక్కువ అమ్ముడవుతున్నాయి. షాండ్లియర్స్ రూ.5 వేల నుంచ రూ.50 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇందులోని విద్యుత్తు దీపాలను రిమోట్, సెన్సార్ సిస్టం, మొబైల్ ఆపరేటింగ్ సిస్టం, మాన్యువల్‌గాను ఆపరేట్ చేయవచ్చు.



విదేశాల నుంచి దిగుమతి..

షాండ్లియర్స్ తయారీలో వినియోగించే ముడిసరుకును మలేషియా, ఇటలీ, చైనా, సింగపూర్, ఈజిప్టు, మన దేశంలోని ఢిల్లీ, ముంబై తదితర ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లో ప్రధానంగా మాదాపూర్, బేగంబజార్, కోటి, ఉస్మాన్‌గంజ్ తదితర ప్రాంతాలు షాండ్లియర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా కనిపిస్తున్నాయి. మొరాకిన్, ఇండియన్, యాంటిక్, నిజాంలు వినియోగించిన రస్టిక్ తదితర మోడల్స్‌కు ఇక్కడ మంచి ఆదరణ ఉంది.



మనసు ప్రశాంతంగా..

క్రిస్టల్ మేడ్ షాండ్లియర్ తీసుకున్నాను. రూ.7 లక్షలు అయ్యింది. ఎన్నో పనులపై బయట తిరిగి ఇంటికి చేరుకున్నాక సోఫాలో కూర్చుని షాండ్లియర్ నుంచి వచ్చే డిఫరెంట్ లైటింగ్, మనసుకు నచ్చిన పాటలు చిన్నగా సౌండ్ పెట్టుకుని వింటాను. మనసుకు ప్రశాంతంగా ఉంటుంది. ఒకరకంగా షాండ్లియర్ ఒత్తిడిని తగ్గిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

– టి.ప్రణీత్‌రెడ్డి, హైదరాబాద్

వినియోగం పెరిగింది

డూప్లెక్స్ హౌస్ కట్టుకుంటున్న ప్రతి కుటుంబం షాండ్లియర్స్‌ను వినియోగిస్తున్నారు. ఉన్నత స్థాయి కుటుంబాలు, స్టార్ హోటల్స్, లగ్జరీ లైఫ్‌లో షాండ్లియర్ తప్పనిసరి అయ్యింది. కొత్తకొత్త మోడల్స్ కోరుకుంటున్నారు. రూ.లక్ష నుంచి షాండ్లియర్స్ అందుబాటులో ఉంటాయి. కె9 క్రిస్టల్, ఏక్రలిక్, సిరామిక్, వంటివి ఎక్కువ మంది అడుగుతున్నారు. ఇప్పుడు నెలకు కనీసం 100 వరకు సరఫరా చేస్తున్నాం. అత్యాధునిక కలెక్షన్స్, వస్తువులో నాణ్యత, వినియోగదారుడికి సమస్య వచ్చినప్పుడు మేం అందించే సేవలు మాకంటూ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి. జీవితకాలం సర్వీస్ ఇస్తున్నాం.



– రిషబ్ తివారీ, లైట్స్ లైబ్రరీ, మాదాపూర్



రవీంద్రభారతిలో 'జయహో భారత్'

గన్‌ఫౌండ్రీ: భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రవీంద్రభారతిలో జయహో భారత్ పేరిట సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన 300 మంది కళాకారులు వివిధ దేశభక్తి, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నృత్య గురువులను సన్మానించారు. పలు దేశభక్తి గీతాలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సినీ నటి గీతాసింగ్, నిర్మాత టి.రామసత్యనారాయణ, సంస్థ వ్యవస్థాపకురాలు లలితారావు తదితరులు పాల్గొన్నారు.



అమెరికా విద్యపై అంతకంతకూ ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునేవారిలో అమెరికా ప్రధాన గమ్యంగా మారిందని విద్యారంగ ప్రముఖులు అభిప్రాయపడ్డారు. నగరంలో ప్రధాన కార్యాలయం ఉన్న ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ టెక్సాస్ రివ్యూ, బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్‌లో ఆదివారం యుఎస్‌ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు మాట్లాడుతూ అమెరికాలోని విద్యావకాశాలను వివరించారు. అమెరికాలోని 35కు పైగా ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరయ్యారు. టెక్సాస్ రివ్యూ సహ వ్యవస్థాపకుడు సీఈఓ రాజేష్ దాసరి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో సగటున ఏటా 4 వేల మంది విద్యార్థులు ప్రవేశం పొందేందుకు తాము ఊతమవుతున్నట్లు వెల్లడించారు.





కుంచె పడితే.. అద్భుతాలే..

చిత్రలేఖనంలో డెలివరీ బాయ్ వారెవ్వా..

సాక్షి, సిటీబ్యూరో: అతడో డెలివరీ బాయ్.. అది సమాజానికి తెలిసిన విషయం. కానీ ప్రపంచానికి తెలియని మరో విషయం ఏంటంటే అతడో మంచి చిత్రకారుడు. కుంచె పట్టాడంటే అద్భుతాలు అలా జాలువారుతాయి. చక్కటి రూపాలను మలచడంలో ప్రసిద్ధుడు. కానీ కుటుంబ పరిస్థితులు మాత్రం ఓ డెలివరీ బాయ్ పనికి పరిమితం చేశాయి. అతడి పేరే రాకేశ్ రాజ్ రెబ్బా. పుట్టింది మహారాష్ట్రలోని సోలాపూర్‌లో.. పొట్టకూటి కోసం హైదరాబాద్ వచ్చేసి ఇక్కడే డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు.

చిన్నప్పటి నుంచీ ఆసక్తి..

రాకేశ్‌కు చిత్రలేఖనం అంటే చిన్నప్పటి నుంచే ఆసక్తి.. ఆ కళపై ఎలాగైనా పట్టుసాధించాలనే తపనతో చిన్నప్పుడు.. ఎప్పుడూ చూసినా ఏదో ఒక బొమ్మ గీస్తుండేవాడట. అలా కొన్ని వందల చిత్రాలను పుస్తకాల్లో గీసి అపురూపంగా దాచిపెట్టుకున్నాడు. మనుషుల ముఖాలను కూడా గీస్తూ ప్రశంసలు పొందుతున్నాడు. ప్రస్తుతం అప్పుడప్పుడూ వాల్ పెయింటిగ్స్ వేస్తూ తన కళను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన కళకు మరిన్ని నగిషీలు అద్దితే ఎన్నో ఎత్తులకు చేరుకుంటాడనడంలో అతిశయోక్తి లేదు.

మంచి ఆర్టిస్టు కావాలని కోరిక..

ఆర్ట్ వేయడం అంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. సొంతంగానే ఎన్నో బొమ్మలు వేశాను. డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నా. ఎవరైనా ప్రోత్సాహం అందిస్తే మంచి ఆర్టిస్టుగా జీవితంలో పేరు తెచ్చుకోవాలనేది నా కోరిక.

– రాకేశ్ రాజ్ రెబ్బా





క్లుప్తంగా...

18 నుంచి దుర్గగుడిలో పవిత్రోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సమయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ తెలిపింది. 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఉదక శాంతి జరుగుతుంది. 18వ తేదీ తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, అనంతరం విశేష అలంకరణ, పవిత్రమాల ధారణ జరుగుతుంది. ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుంది. చండీహోమ యాగశాలలో గణపతి పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, దేవతారాధన, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు మూలమంత్ర హవనం, దేవ పారాయణ, హారతి జరుగుతుంది. 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. అనంతరం కలశోద్వాసన, మార్జన, మహాదాశీర్వచనం జరుగుతుంది.

టీటీడీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్ల భారీ విరాళం



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చెక్కును అందజేస్తున్న దాతలు

తిరుమల: పంజాబ్‌లోని ట్రైడెంట్ గ్రూప్‌నకు చెందిన రాజిందర్‌గుప్తా టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును కుటుంబసభ్యులతో కలసి రాజిందర్‌గుప్తా టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.వెంకయ్య చౌదరికి తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు.

కొట్టుకుపోయిన 'తుంగభద్ర' గేటు

ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరి

- కొత్త గేటు ఏర్పాటు చేయాలంటే నీటిమట్టం తగ్గించాలి
- అంటే డ్యాం నుంచి 61 టీఎంసీలు వదలాల్సిందే
- నెలాఖరుకు కొత్త గేటు అమర్చే అవకాశం
- వచ్చే మూడు, నాలుగు నెలల్లో తుంగభద్రకు కనిష్టంగానే వరద
- దీంతో ఇక ఈ ఏడాది డ్యాం నిండే అవకాశాలు తక్కువే



తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన దృశ్యం

సాక్షి, అమరావతి/హొళగుంద: తుంగభద్ర డ్యాం 19వ గేటు లింక్ చానల్ శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో తెగి గేటు నదిలో కొట్టుకుపోయింది. దీంతో డ్యాం రక్షణలో భాగంగా అధికారులు 33 గేట్లలో 29 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలంటే.. గేటు బిగించే స్థాయి (క్రెస్ట్ లెవల్)కు అంటే 1,613 అడుగులకు నీటిమట్టం తగ్గించాలని నిపుణులు చెబుతున్నారు. అంటే.. అప్పుడు 43.83 టీఎంసీల నీరు మాత్రమే ఉంటుంది. గేటు కొట్టుకుపోక ముందు డ్యాంలో 1,632.6 అడుగుల్లో 104.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే.. ఆ స్థాయికి నీటిమట్టం తగ్గించాలంటే 61 టీఎంసీలను దిగువకు వదలాలి. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకుంటే రోజుకు 9 టీఎంసీల చొప్పున వారంపాటు నీటిని దిగువకు వదిలేస్తే.. డ్యాంలో నీటిమట్టం 1,613 అడుగుల స్థాయికి తగ్గుతుంది. ఆ తర్వాత కొత్త గేటు ఏర్పాటుకు కనీసం వారం రోజులు పడుతుందని తుంగభద్ర బోర్డువర్గాలు అంచనా వేస్తున్నాయి. దాదాపు నెలాఖరుకుగానీ కొత్త గేటును అమర్చలేరన్నది స్పష్టమవుతోంది. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పలువురు కర్ణాటక మంత్రులు డ్యాంను పరిశీలించారు. తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం అక్కడే మకాం వేసింది. హైదరాబాద్, చెన్నై నుంచి ప్రత్యేక నిపుణులు రానున్నారు. నిజానికి.. 71 ఏళ్ల 'తుంగభద్ర' చరిత్రలో ఎన్నడూ గేట్లు కొట్టుకుపోయిన దాఖలాల్లేవు.

17.33 లక్షల ఎకరాలపై ప్రభావం..

తుంగభద్ర డ్యాం ఆయకట్టు విస్తరించిన రాయలసీమ, ఉత్తర కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలు వర్షాభావ ప్రాంతాలు. రాయలసీమలో హెచ్చెల్సీ, ఎల్లెల్సీల కింద 4.42 లక్షల ఎకరాలు, ఉత్తర కర్ణాటకలో 8.96 లక్షల ఎకరాల ఆయకట్టు నేరుగా డ్యాంపై ఆధారపడ్డాయి. డ్యాం దిగువన రాయలసీమలో కేసీ కెనాల్ కింద 2.78 లక్షల ఎకరాల ఆయకట్టు.. ఉత్తర కర్ణాటకలో రాయబసవన చానల్స్ కింద 24,468 వేల ఎకరాలు.. ఉత్తర, కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్డీఎస్ (రాజోలి బండ డైవర్షన్ స్కీం) కింద 92,900 ఎకరాల ఆయకట్టు వెరసి 3.95 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేసీ కెనాల్, ఆర్డీఎస్, రాయ బసవన చానల్స్ కూడా తుంగభద్ర డ్యాంలో నీటి కేటాయింపులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ఏడాది 17.33 లక్షల ఎకరాల ఆయకట్టుపై గేటు కొట్టుకుపోవడం తీవ్ర ప్రభావం చూపుతుంది.

వీలైనంత త్వరగా గేటు పునరుద్ధరణ : డీకే

డ్యాం వద్ద కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ గేటు కొట్టుకుపోవడం బాధాకరమని.. వీలైనంత త్వరగా గేటు పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరు అందేలా చేస్తామని, అయితే మళ్లీ డ్యాంలోకి నీరు వచ్చేదాన్ని బట్టి రబీ పంటకు నీటివసతి కల్పిస్తామన్నారు.

వరుడిపై యాసిడ్, కత్తితో ప్రియురాలు దాడి!

- ఘర్షణలో వేరే మహిళపై పడిన యాసిడ్
- ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలింపు
- ఆగిపోయిన పెళ్లి.. పోలీసుల అదుపులో వరుడు, ప్రియురాలు

రాజంపేట: తనను కాదని వేరే యువతిని పెళ్లి చేసుకుంటున్నాడనే కక్షతో.. వరుడిపై యాసిడ్, కత్తితో ప్రియురాలు దాడి చేసిన ఘటన నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలోని అరవపల్లెలో ఆదివారం సంచలనం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన సయ్యద్‌బాషాకు, అరవపల్లెకు చెందిన వంటమాస్టర్ రసూల్ కుమార్తెతో వివాహం నిశ్చయమైంది. అరవపల్లెలోని ఓ షాదీఖానాలో సయ్యద్‌బాషాకు షాదీ జరుగుతున్న క్రమంలో తిరుపతికి చెందిన జయ అనే వివాహిత ఒక్కసారిగా వరుడు సయ్యద్‌బాషాపై కత్తి, యాసిడ్ బాటిల్‌తో దాడి చేసింది. ఈ క్రమంలో తోపులాట చోటు చేసుకోగా అక్కడే ఉన్న ప్రొద్దుటూరుకు చెందిన మహిళపై యాసిడ్ పడి తీవ్ర గాయాలయ్యాయి.ఈ ఘటనతో పెళ్లి ఆగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. వరుడు, ప్రియురాలిని అదుపులోకి తీసుకున్నారు. యాసిడ్‌లో గాయపడిన మహిళను స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. కాగా, తిరుపతిలో సయ్యద్ బాషా నానమ్మ ఇంటి వద్దే జయ కూడా నివాసం ఉంటోంది. జయ భర్త పెళ్లైన ఐదేళ్లకే మృతి చెందాడు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. అక్కడ సయ్యద్ బాషాతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తనను పెళ్లి చేసుకోకుండా వేరేవారిని చేసుకుంటున్నాడనే కారణంతోనే షాదీఖానాలో రభసకు దిగిందని వరుడి తరఫువారు చెబుతున్నారు. నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పంట పొలాల్లోకి గజరాజులు

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కెల్ల సమీపంలోని ఏనుగుల గుంపు నాగావళి నది దాటుకొని విజయనగరం జిల్లా వంగర మండలం వి.వి.ఆర్‌పేట గ్రామ సమీపంలోకి ప్రవేశించింది. ఆదివారం ఉదయం పట్టా చిన సింహాచలం, కోట్ల ఉమా, పెద్దింటి సింహాద్రి నాయుడులకు చెందిన మొక్కజొన్న, పామాయిల్ పంటలను నాశనం చేసింది. ఆరు ఏనుగుల గుంపులో ఒక ఏనుగు పిల్లకు జన్మనిచ్చింది. పంటలు దెబ్బతిన్న రైతులు లబోదిబోమంటున్నారు. -వంగర

గజేంద్రుడు.. 'తగ్గిపోతున్నాడు'

- తగ్గుతున్న గజరాజుల సంఖ్య
- అడవుల నరికివేత, ఆహారం కొరతే ప్రధాన కారణం
- నేడు ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం

భూమిపై నివసించే జంతువుల్లో అతి పెద్దది ఏనుగు. దీని నగటు జీవిత కాలం 70 ఏళ్లు. ఇది ఆహారం కోసం అడవిలో సుదూరం ప్రయాణించి అన్ని రకాల పండ్లను తింటుంది. అనంతరం దూర ప్రాంతాలకు వెళ్లి విసర్జన చేస్తుంది. ఆ విసర్జనలో పండ్ల గింజలు విత్తనాలుగా మారి అక్కడ చెట్లు పెరిగి దట్టమైన అడవి ఏర్పడుతుంది. అలా అడవుల విస్తీర్ణంలో ఏనుగు భాగస్వామి అవుతుంది. అటువంటి ఏనుగులు ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరాయి. వీటిపై ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆ వివరాలివిగో..

దేశంలో ఎలిఫెంట్ రిజర్వ్‌లు 33

2012లో ఏనుగుల సంఖ్య	2017లో ఏనుగుల సంఖ్య
31,368	27,312



ఆరిలోవ(విశాఖ తూర్పు): ప్రపంచంలో ఏనుగులు రెండు రకాలున్నాయి. ఆఫ్రికా ఏనుగులు, ఆసియా ఏనుగులు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్స్(ఐయూసీఎస్) ప్రకారం ఆసియా ఖండపు ఏనుగులు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఆ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఏనుగుల దంతాలతో తయారు చేసిన అలంకరణ వస్తువులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. దీంతో స్మగ్లర్లు వాటి దంతాలతో వ్యాపారం చేస్తున్నారు. అదే వాటి సంఖ్య తగ్గిపోవడానికి కారణమైందని అటవీ శాఖ అధికారులు భావిస్తు న్నారు. గడిచిన సుమారు 50 ఏళ్లలో 13 దేశాల్లో నివసించే ఆసియా ఏను గులు 70 శాతం వరకు తగ్గిపోయినట్లు ఐయూసీఎస్ గుర్తించింది. అందులో మన దేశంలో సుమారు 50 శాతం ఏనుగులు తగ్గిపోయాయని నిర్ధారించింది. వాతావరణంలో తీవ్ర మార్పులు, అడవులు నరికేయడం, ఆహారం భద్రత లేకపోవడంతో ఏనుగుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. వాటి పునరుత్పత్తికి అనువైన వాతావరణం లేకపోవడంతో ఆ సంఖ్య పెరుగుదల నిలిచిపోతోంది. పర్యావరణంలో ఏ ఒక్క జాతి తగ్గినా మాన వాళికే ముప్పు కలగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2012లో ప్రపంచ ఏనుగుల సంరక్షణ దినోత్సవం జరుపుకోవాలని థాయ్‌లాండ్‌కు చెందిన 'ఎలిఫెంట్రీ ఇంట్రొడక్షన్ ఫౌండేషన్' అనే సంస్థ నిర్ణయించింది. మొదటి సారిగా అదే సంవత్సరం ఆగస్టు 12న థాయ్‌లాండ్‌లో ఏనుగుల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. అప్పట్లో వారి పిలుపుతో వివిధ దేశాల్లో 65కు పైగా అంతర్జాతీయ వన్యప్రాణి సంరక్షణ సంస్థలు ఏనుగుల సంరక్షణ కోసం ముందుకొచ్చాయి

అత్యధికంగా కర్ణాటకలో 6,500

దేశంలో 2012 తర్వాత ప్రత్యేకంగా ఎలిఫెంట్ రిజర్వ్‌లు ఏర్పాటు చేయడంతో వాటి సంరక్షణ పెరిగి పునరుత్పత్తి కూడా పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 25,000 నుంచి 29,000 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాటిలో ఏపీలో 242 ఉన్నట్లు గుర్తించారు. అవి కూడా శ్రీకాకుళం, చిత్తూరు అడవుల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్నింటికంటే ఎక్కువగా కర్ణాటకలో సుమారు 6,500 ఏనుగులు ఉన్నాయి. అత్యల్పంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మిజోరంలలో పది లోపే ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణలో ఏనుగులు లేవు.

నగర వార్తలు

అటకెక్కిన ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్!

- ఆర్టీఏలో ఆటోమేటిక్ ఫిట్‌నెస్ తనిఖీలు తప్పనిసరి చేసిన కేంద్రం
- రహదారి భద్రతా చట్టంలో భాగంగా అమలు
- నగరంలో ఆ దిశగా చర్యల్లేవ్.
- మానవ ప్రమేయంతో డొల్ల తనిఖీలు
- సామర్థ్యం లేని వాహనాల వల్ల ప్రమాదాలు



సాక్షి, సిటీబ్యూరో:

- ఇటీవల ఓ స్కూల్ బస్సు బోల్తా పడింది. మైలార్‌దేవ్‌పల్లి వద్ద జరిగిన ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. నిజానికి పిల్లలకు పెద్ద ముప్పు తప్పినట్లే. గాయాలతో బయటపడ్డారు. బ్రేకులు ఫెయిల్ కావడం వల్లనే ఆ బస్సు ప్రమాదానికి గురైనట్లు గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కూడా కారణమే.
- అదే రోజు సికింద్రాబాద్ ప్రాంతంలో జరిగిన మరో స్కూల్‌బస్సు ప్రమాద ఘటనలోనూ ఫిట్‌నెస్ లోపం ఉన్నట్లు సమాచారం.
- ఈ ఒకటి, రెండు స్కూల్ బస్సులు మాత్రమే కాదు..రవాణా వాహనాల సామర్థ్యం అతిపెద్ద సవాల్‌గా మారింది. శాస్త్రీయమైన పద్ధతిలో వాహనం సామర్థ్యాన్ని కచ్చితంగా అంచనా వేసిన అనంతరమే రవాణా అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను అందజేయాలి. కానీ మానవ ప్రమేయంతో జరిగే ఫిట్‌నెస్ పరీక్షలు వాహనాల సామర్థ్యాన్ని నిర్ధారించడంలో అనేక వైఫల్యాలు ఉన్నాయి. రహదారి భద్రతకు ప్రమాదకరంగా మారుతున్న సామర్థ్యం లేని వాహనాలను నియంత్రించేందుకు ఆటోమేటిక్ పద్ధతిలో నిర్ణీత ప్రమాణాల మేరకు పరీక్షలు నిర్వహించాలని కేంద్రం స్పష్టంచేసింది. ఈ మేరకు రహదారి భద్రతా చట్టంలోను ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ల ఏర్పాటును తప్పనిసరి చేసింది. కానీ ఇప్పటి వరకు నగరంలో ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, లారీలు, వివిధ రకాల వస్తు రవాణా వాహనాలు ఉత్తుత్తి ఫిట్‌నెస్ పరీక్షలతో దర్జాగా రోడ్డు మీదకు వచ్చేస్తున్నాయి. అక్రమార్జనే ధ్యేయంగా ఆర్టీఏ అధికారులు సైతం అడ్డగోలుగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భవనం నిర్మించినా...

గ్రేటర్ హైదరాబాద్ రవాణా వాహనాల సామర్థ్య పరీక్షల కోసం ఒక ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ఇంచుమించు పదేళ్ల క్రితం చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ఈ టెస్టింగ్‌స్టేషన్‌కు ప్రణాళికలను రూపొందించారు. వాహనాల పార్కింగ్, టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు కోసం స్థలం సేకరించారు. అప్పట్లో కొన్ని వివాదాల కారణంగా జాప్యంజరిగింది. చివరకు ఆ స్థలం రవాణాశాఖకే చెందండంతో టెస్టింగ్ స్టేషన్ కోసం ఒక భవనాన్ని కూడా నిర్మించారు. కానీ ఇప్పటివరకు అక్కడ పరికరాలను ఏర్పాటు చేయలేదు. అప్పట్లో కట్టించిన భవనం కూడా దెబ్బతింటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లలో వాహనాల తనిఖీ పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ సూచించిన ప్రమాణాలు ప్రకారం వాహనం ఉంటేనే సామర్థ్యం ఉన్నటుగా నిర్ధారిస్తారు. వాహనం ఇంజన్, టైర్లు, బ్రేకింగ్ వ్యవస్థ, వాహనం బాడీ, తదితర అన్ని విభాగాలను టెస్టింగ్ స్టేషన్‌లోని పరికరాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తాయి. అనంతరం ఆన్‌లైన్‌లోనే నివేదిక లభిస్తుంది. ఎక్కడా మోటారు వాహన తనిఖీ అధికారులు, సిబ్బంది ప్రమేయం ఉండదు. ప్రస్తుతం ఆర్టీఏ కార్యాలయాల్లో ఎంవీఐలు, కానిస్టేబుళ్లే వాహనాలను పైపైన చూసి సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారు. ఇది ఒక ప్రహసనంగా మారింది. దీంతో బ్రేకులు ఫెయిల్ అయిన వాహనాలు కూడా యథేచ్ఛగా రోడ్డెక్కుతున్నాయి. లారీలు, ప్రైవేట్ బస్సులు, ఇతరత్రా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో దళారులు, ఎంవీఐలు కుమ్మక్కవుతున్నారు. దీంతో పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏజెన్సీలను ఏర్పాటు చేయాలి...

కేంద్ర రహదారి భద్రతా చట్టం మేరకు దేశవ్యాప్తంగా అన్ని చోట్ల ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ల ఏర్పాటు తప్పనిసరి. వాహనాల సామర్థ్య నిర్ధారణలో ఎలాంటి లోపాలకు తావు ఉండకూడదు.ఇందుకోసం రవాణాశాఖ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. నిబంధనలకు అనుగుణంగా ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణను అధికారులు పర్యవేక్షించాలి. ఏడాది క్రితమే ఈ ఆటోమేటిక్ టెస్టింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉండగా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టెస్టింగ్ సెంటర్‌కు, వాహనాల నిలుపుదలకు తగినంత స్థలం ఉండి టెస్టింగ్ సెంటర్‌ను నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థలను ఎంపిక చేయవలసి ఉంది. పలు రాష్ట్రాల్లో రవాణాశాఖల కార్యకలాపాలు, పౌరసేవల అమలు తీరుతెన్నులపైన కూడా ఆర్టీఏ అధికారులు ప్రత్యేకంగా అధ్యయనం చేసి వచ్చారు. రహదారి భద్రతలో కీలకమైన ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లపైన ప్రభుత్వం ఎలా స్పందించనుందనేది వేచి చూడవలసిందే.

వాహనదారులకు 'ఈ-చలాన్' వల!

- సైబర్ నేరస్తుల కొత్త తరహా మోసం
- నకిలీ ఈ-చలానా లింకు పంపిస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసుల సూచన
- లేకపోతే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవడం ఖాయం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన రాహుల్ ఈ-మెయిల్‌కు తన వాహన నంబరుపై ఉన్న రూ.10 వేలు పెండింగ్ చలాన్‌ను చెల్లించి, రాయితీ పొందండని మెయిల్ వచ్చింది. ప్రభుత్వం ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి ఆఫర్లు ప్రకటించలేదు కదా మరేంటి ఇలా వచ్చిందని రాహుల్‌కు అనుమానం కలిగింది. వెంటనే ట్రాఫిక్ పోలీసు టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు కనుక్కునే సరికి..అది సైబర్ నేరస్తులు పంపించిన నకిలీ మెయిల్ అని తేలింది.

- ఇలా సైబర్ నేరస్తులు కొత్త అవతారం ఎత్తారు. వాహనదారులకు నకిలీ ఈ-చలాన్ లింక్‌లను మెయిల్, మెసేజ్‌లు పంపిస్తున్నారు. పొరపాటున ఈ లింక్‌లను క్లిక్ చేశారో మన బ్యాంకు ఖాతా వివరాలు, ఇతరత్రా వ్యక్తిగత సమాచారం సైబర్ కేటుగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతాయి. అప్రమత్తంగా లేకపోతే బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ..

తెలిసో, తెలియకో ఈ లింక్‌పై క్లిక్ చేయగానే నకిలీ ట్రాఫిక్ పోలీసు వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. అందులో సైబర్ నేరస్తులు బ్యాంకు ఖాతా, డెబిట్/క్రెడిట్ కార్డు వివరాలను, సీవీవీ నంబర్లను నమోదు చేయాలని సూచిస్తారు. అవి నమోదు చేయగానే మన సెల్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లోకి మాల్‌వేర్ డౌన్‌లోడ్ అవుతుంది. దీంతో మన వ్యక్తిగత వివరాలు నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. వీటి సహాయంతో కేటుగాళ్లు మనల్ని బెదిరించి బలవంతపు వసూళ్లకు పాల్పడవచ్చు లేదా మీ బ్యాంకు ఖాతా వివరాలతో నగదును బదిలీ చేయవచ్చు.

ఇలా నిర్ధారించుకోండి..

- ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి ఈ-చలాన్ మెసేజ్ వస్తే.. దాన్ని నిర్ధారించుకోవడానికి echallan.parivahan.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. నిజమైన చలాన్‌ను ఇక్కడి నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకవేళ డౌన్‌లోడ్ చేయలేకపోతే అది నిస్సందేహంగా నకిలీ వెబ్‌సైటే.
- ట్రాఫిక్ ఉల్లంఘన చేసిన ప్రాంతం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధి, చలాన్ నంబరు, జరిమానా వివరాలు, ఫొటోతో సహా ఉంటాయి.
- అధికారిక వెబ్‌సైట్‌లో ఈ-చలాన్ యాజమాన్యం, వాహనం వివరాలతో సమగ్ర సమాచారం ఉంటాయి.
- అదే నకిలీ ఈ-చలానా నంబరు, చెల్లింపులకు సంబంధించిన లింకు తప్ప వాహనం నంబరు, యజమాని పేరు ఇతరత్రా వివరాలేవీ ఉండవు.

జాగ్రత్తలివే...

- ఈ-చలాన్ అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే చెల్లింపులు చేయాలి.
- చలాన్‌లో వాహన నంబరు, యాజమాన్యం వివరాలు లేకపోతే అది నకిలీదేనని గుర్తించుకోండి.
- ఈ-చలాన్ వెబ్‌సైట్ డొమైన్ జీఓవీ.ఇన్ అనే అక్షరాల ముగియకపోతే అది కచ్చితంగా నకిలీదే.
- అధికారిక ఈ-చలాన్ మెసేజ్‌లో వెహికిల్ ఐడెంటిఫికేషన్ నంబరు (వీఐఎన్), ఇంజిన్ నంబరు, ఇతరత్రా వివరాలు ఉంటాయి.
- ట్రాఫిక్ పోలీసులు వ్యక్తిగత ఫోన్ నంబర్ల నుంచి వాహనదారులకు ఈ-చలాన్ మెసేజ్‌లను ఎట్టిపరిస్థితుల్లోను పంపించరు.

అసలు, నకిలీ తేడా ఇదే..
అధికారిక చలాన్ మెసేజ్ లింక్ జీఓవీ.ఇన్ అనే అక్షరాలతో ముగుస్తుంది.

అసలు వెబ్‌సైట్ లింక్:
echallan.parivahan. gov.in

ఇదీ నకిలీ లింక్:
echallan.parivahan.in
నకిలీ లింక్ చివర్లో జీఓవీ ఉండదు.

పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది

తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్



సతీష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్ అన్నారు. గచ్చిబౌలిలో ఆదివారం స్నాడ్ డెవలపర్స్ ఇండియా ఆధ్వర్యంలో టెక్ ట్రెక్-2024 పేరుతో టెక్నాలజీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఐటీ రంగ నిపుణులు పాల్గొని వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఉద్యోగులు, నిర్వాహకులకు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లు, ఆర్థికమాంద్యం గురించి విశ్లేషించారు. ముఖ్యఅతిథిగా మన్నె సతీష్ హాజరై మాట్లాడుతూ ఐటీ అభివృద్ధికి ఇలాంటి సదస్సులు ఎంతో ముఖ్యమని, ఇలాంటి వాటికి ప్రాధాన్యం ఇస్తూ రెండవ ఏడాది ఈ టెక్ ట్రెక్‌ను నిర్వహించిన స్నాడ్ డెవలపర్స్‌ను ఆయన అభినందించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతీ కంపెనీ ఐటీ రంగాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ప్రయత్నించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని పెద్దపెద్ద కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. అనంతరం స్నాడ్ డెవలపర్స్ ఇండియా సీఈఓ నందిగమ్ నాగ దీప్తి మాట్లాడుతూ ఐటీ పరిశ్రమల భవిష్యత్‌ను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే కాన్సెప్ట్‌తో ఈ 'టెక్ ట్రెక్-2024'ను వరుసగా రెండవ ఏడాది నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఇలాంటి సదస్సు స్నాడ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో జరగడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మాజీ సెక్రెటరీ జేఏ చౌదరి మాట్లాడుతూ తన అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా లక్కీ డ్రా తీసి ఉచితంగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ముగ్గురికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 ఐటీ కంపెనీల నుండి 300 మంది ఐటీ నిపుణులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో నగర చిన్నారుల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: కల్వకుర్తి పట్టణంలో ఆదివారం జరిగిన 2వ జాతీయ స్థాయి కరాటే, కుంఫో ఓపెన్ చాంపియన్ షిప్-2024లో హైదరాబాద్ చిన్నారులు ప్రతిభ చూపారు. దాదాపు 1000 మంది పోటీపడిన ఈ పోటీలలో కరాటే మాస్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 28 మంది క్యాండర్ షేన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకున్నారు. విక్టరీ షోడే కాన్ అసోసియేషన్ డూ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

ఓయూలో ముగిసిన జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆంధ్ర మహిళ విద్య కళాశాల ఆడిటోరియంలో రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీల సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో గాంధర్వం-2, సాధనతో సాధ్యం అనే అంశంపై అనేక మంది వక్తలు ప్రసంగించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత విద్వాంసులు అనంద మోహన్ హాజరుకాగా జి.వసుంధర, తెలుగు వర్సిటీ ప్రొ.రాధా సారంగపాణి, శ్రీ వెంకటేశ్వర వేదాంత వర్ధిని కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డా.నందూరి విద్యారణ్య స్వామి, రజిత్, విజయ్ కుమార్, సుధామాల, డా.ఇందిరా హేమా, ఆర్ఎస్ సుధారాణి, యూహెచ్ హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల జాతీయ సదస్సులో 60 పరిశోధన పత్రాలను సమర్పించినట్లు వివరించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని బీజేవైఎం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం రాంనగర్ చౌరస్తా నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ భారత దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యాం సుందర్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, కార్పొరేటర్లు కె. రవిచారి, రచనశ్రీ, పావని వినయ్ కుమార్, బీజేవైఎం నేతలు బుర్ర రాజ్‌కుమార్, గడ్డం నవీన్, ఆయూష్ బీజేపీ నాయకులు రాంరెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.



హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

మంచి మాట



వివేచన అంటే సమయోచిత జ్ఞానం, యుక్తాయుక్త విచక్షణ, లోచూపు, శోధన, దార్శనికత, విశ్లేషణా సామర్థ్యం. ఇతరులకు తోచని, అవగాహనకు రాని సూక్ష్మాంశాలను గ్రహించగల ఓ శక్తి. ఈ వివేచన కొందరిలో మాత్రమే ఉండే ఓ అపురూపమైన శక్తి.

సమయోచిత జ్ఞానమే వివేచన

అసలు వివేచన ఎలా ఒనగురుతుంది... అని ప్రశ్నించుకుంటే... ప్రధానంగా చదువు వల్ల పొందే జ్ఞాన, పరిజ్ఞానాల వల్ల అని చెప్పాలి. ఈ భావాన్నే పోతన ''జదివిన సదసద్వివేక చతురత గలుగు జదువగ వలయును జనులకు.. '' అని హిరణ్యకశిపుని చేత పలికిస్తాడు. చదువు వల్ల జ్ఞానంతోపాటు ఔచిత్యానౌచిత్యాలు, మంచి చెడు విచక్షణలు తెలుస్తాయి. అవి మన పలుకులో, ప్రవర్తనలో, ఆలోచనాసరళిలో అభిలషణీయమైన చక్కని మార్పు తెస్తాయి. ఈ వివేచన మన వైయక్తిక జీవిత సుఖ సంతోషాలకు, ఆరోగ్యకరమైన సామాజిక వికాసానికి పునాదులు వేస్తుంది.

విద్యనభ్యసించటం వలన వివేచన అనే శక్తిని పొందటం జరుగుతుంది. కాని ఇది ఎల్లప్పుడూ నిజం

> పంచతంత్రంలోని పావురాలు – వేటగాడి కథ వివేచనా పార్శ్వమైన ముందుచూపుని సూచిస్తుంది. ఆకాశమార్గం లో పయనించే పావురాలు భూమిపై ఒక చోట చల్లిన నూకలను చూచి, కిందకు దిగి తిందామనుకున్నప్పుడు వారిని వారించిన చిత్రగ్రీవునిలో ఉన్నది ముందుచూపే. అప్రమత్తతే. ఇవి వివేచనలోని కోణాలే . చిత్రగ్రీవుని మాటను పెడచెవిని పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకున్న మిగిలిన పావురాలలో ఉన్నది తొందరపాటుతనం, విచక్షణారాహిత్యం. జ్ఞానాన్ని సందర్భానుసారంగా ఉపయోగించగలగాలని ఈ ఉదంతం మనకు చెపుతుంది. అలాగే మూడు చేపలకథలోని దీర్ఘదర్శి అన్న చేప తనప్రాణాలను కాపాడుకున్నది ఈ ముందుచూపు వల్లే కదూ!

కావలసిన అవసరం లేదని లోకానుభావం, పరిశీలన చెపుతాయి. కొందరు విద్యావంతులలో కనిపించని ఈ వివేచన కొన్ని సందర్భాలలో అక్షర జ్ఞానంలేని వారెందరిలోనో కనిపించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ, ఇది వాస్తవం. వారి సంభాషణల్లో, సమస్యలను పరిష్కరించే వేళల్లో సమయోచిత జ్ఞానాన్ని చూపుతూ,

విచక్షణను ప్రదర్శిస్తూ వివేచనాపరులుగా పేరు తెచ్చుకున్న వారున్నారు.

ఇది ఎలా సాధ్యమవుతుంది? జీవనక్రమంలో వచ్చే ఆటుపోట్లను తట్టుకుని, నిబ్బరంగా ఉంటూ, మనసును దిటవు చేసుకోవటంవల్ల వారికి ఇది సాధ్యమవుతుంది.

అలాగే చేదు అనుభవాలు, జీవితం నేర్పిన పాఠాలు పొందిన ఇంగితజ్ఞానంతో జీవితాన్ని మరింత లోతుగా పరిశీలిస్తూ, విశ్లేషించుకునే వీరికి ఈ వివేచనాశక్తి కరతలామలకమవుతుంది.

కౌరవులు పాండవులను పెట్టే ఇబ్బందులను, చేసే దుశ్చర్యలను గమనిస్తూ ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తులను చేసి, రక్షించినవాడు శ్రీ కృష్ణుడు. అలా వివేచనకు గొప్ప ఉదాహరణగా నిలిచాడు. వివేచనాశీలి ఎదుటవారి మాటలను, వాటి అంతరార్థాన్ని గ్రహించగలడు. వారి మనసులో మెదిలే ఆలోచనలను పసిగట్టగలరు. వాటిని విశ్లేషించగలరు. ఇవన్నీ వివేచనకున్న కోణాలే.

బెర్ట్రాండ్ రసెల్.. జ్ఞానం –వివేకం.. అన్న వ్యాసంలో ఈ రెండిటి మధ్య ఉన్న సూక్ష్మమైన భేదాన్ని ఒక ఉదాహరణతో ఎంతో స్పష్టంగా వివరించాడు. రివాల్వర్ ఎలా ఉపయోగించాలో తెలియటం జ్ఞానం. దాన్ని ఎప్పుడు వాడాలి, అసలు వాడాలా, వద్దా అన్న సందర్భానౌచిత్య నిర్ణయశక్తే వివేచన. మనలో చాలామందికి విషయం పరిజ్ఞానం ఉంటుంది. కాని ఎక్కడ ప్రదర్శించాలో, ఎక్కడ కూడదోనన్న వివేకం ఉండదు. మన ప్రతిభా నైపుణ్యాలను అసందర్భంగా ప్రదర్శించి, అవమానం పొందకూడదు.

ఉచితానుచితాలు తెలుసుకుని ప్రవర్తించటం కూడా వివేచనే.

సాంకేతికాభివృద్ధి... ముఖ్యంగా అంతర్జాల సాంకేతికత విశ్వాన్ని కుగ్రామం చేసింది. ఆ సాంకేతికతను అంది పుచ్చుకోవాలి. వాటి ఫలితాలు అనుభవించాలి. ఇందంతా జ్ఞానపరమైనది. అభినందనీయం. కాని సక్రమమార్గంలో ఉపయోగించుకోవటంలోనే మన వివేచన ఉంటుంది.

– లలితా వాసంతి

ఆధ్యాత్మికథ

వడ్డీ కాసులవాడా... గోవిందా..!

కేరళలోని కొట్టాయం పట్టణం. పేరెన్నిక గన్న ఆడిటర్ అతడు. డబ్బుకేమీ లోటు లేని అతన్ని పిల్లలు లేరన్న చింత ఒక్కటే పీడిస్తోంది. దాంతో ఏడుకొండల వాడిని ప్రార్థించాడు. మగ పిల్లవాడు పుడితే తన చేతి వేలికున్న బంగారు ఉంగరాన్ని హుండీలో వేస్తానని మొక్కుకున్నాడు. అతడి మొర స్వామికి వినిపించింది కాబోలు... ఏడాదికే మగ పిల్లవాడు పుట్టాడు. ఎంతో సంతోషించాడు ఆ ఆడిటర్. తిరుమల కొండకు వెళ్ళి మొక్కుబడి చెల్లించాలన్న విషయం జ్ఞప్తికి వచ్చింది. అయితే, 'ఈ వారం పోదాము, వచ్చే వారం పోదాము' అని సంవత్సరాల పాటు వాయిదాలు వేస్తూ వచ్చాడు.



ఇంట్లో వాళ్ళు గట్టిగా పట్టు పట్టే సరికి కొడుకు ఐదో పుట్టినరోజు నాడు కొండకు వెళ్దామని నిర్ణయించుకున్నాడు. బయలుదేరే సమయంలో తన మొక్కుబడి గుర్తు కొచ్చింది. చేతి వేలికున్న బంగారు ఉంగరాన్ని చూసుకున్నాడు. మిలమిలా మెరుస్తున్న ఆ ఉంగరాన్ని హుండీలో వేయాలనిపించలేదు.

ఇంతలో అతడికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. అయిదేళ్ళ క్రితం ఈ ఉంగరం ఖరీదు పదిహేనువేలు, ఇప్పుడు దీని ఖరీదు ఇరవై వేలు. ఈ ఉంగరం ఉంచేసుకుని స్వామి వారి హుండీలో పదిహేను వేలు వేద్దామనుకున్నాడు.

కొడుకును తీసుకుని తిరుమల కొండ చేరాడు. ఆరోజు శుక్రవారం. నిజపాద దర్శన సేవ టికెట్ దొరికింది అతడికి. అభిషేకానంతరం దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ, ఎలాంటి తొడుగు లేని నిజపాదాలతో దర్శనమిస్తున్నారు స్వామి. ఆపాదమస్తకం కన్నులారా తిలకించి ''ధన్యుడిని స్వామీ...'' అని నమస్కరించాడు. తర్వాత మొక్కుబడి చెల్లించుకోవడానికి కొడుకును తీసుకుని హుండీ దగ్గరకు వెళ్ళాడు. తను అనుకున్నట్లే పదిహేనువేల నూట పదహార్లు హుండీలో వేసి ''మొక్కు చెల్లించేశాను స్వామీ... బాకీ మొత్తం వడ్డీతో సహా చెల్లించేశాను. రుణ విముక్తుడినైనాను'' అని హుండీకి దండం పెట్టుకుని అక్కడి నుంచి కదిలాడు.

తండ్రీ కొడుకులిద్దరూ ఉచిత ప్రసాదం క్యూలో నిలుచున్నారు. చిన్నచిన్న లడ్డూలు అందరికీ ఇస్తున్నారు. అందరికి లాగే తనకి ఒక లడ్డు, కొడుక్కి ఒక లడ్డు ఇచ్చారు. తియ్య తియ్యగా ఉన్న లడ్డును ఆ అయిదేళ్ళ పిల్లవాడు గబగబా తినేశాడు. ''అడిగితే ఇంకో లడ్డు ఇస్తారా నాన్నా వీళ్ళు?'' అని ఆశగా అడిగాడు. 'ఒక్కరికి ఒక్కటే బాబూ... కావాల్సి ఉంటే నా లడ్డు తీసుకో!'' అని కొడుకు చేతికి ఇచ్చాడు.

తండ్రి చేతిని చూస్తూ కొడుకు ఆశ్చర్యంగా ''నీ ఉంగరం ఏది నాన్నా?'' అని అడిగాడు.

అప్పుడు చూసుకున్నాడు ఆ చార్టెడ్ అకౌంటెంట్ తన బోసిపోయిన ఉంగరపు వేలును. 'ఏమి జరిగిందా...' అని లిప్తపాటు కళ్ళు మూసుకుని ఆలోచించాడు.

ఆరు నెలల క్రితం వేలి ఉంగరం వదులుగా ఉంటే దానికి దారం చుట్టడం లీలగా గుర్తుకొచ్చింది. అలాగే వైకుంఠం షెడ్లల్లో కూర్చున్నప్పుడు ఉంగరం బిగుతుగా అనిపించి దారాన్ని తీసివేయడం కూడా స్పురణకు వచ్చింది.

'అంటే... హుండీలో డబ్బులు వేసేటప్పుడు డబ్బుతో పాటు ఉంగరం కూడా హుండీలో పడిపోయిందన్న మాట.

నిద్ర లేచింది మొదలు, రాత్రుల్లో నిద్ర పోయేంత వరకు డబ్బు లెక్కలతో ఆటలాడే నా దగ్గర వడ్డీకి వడ్డీ వసూలు చేశాడన్నమాట ఆ వడ్డీ కాసులవాడు... ఎంత తప్పు చేశాను... స్వామీ నన్ను క్షమించు!!'' అని తలెత్తి ధ్వజ స్తంభానికి భక్తితో నమస్కరించి లెంపలేసుకున్నాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



అల్లుడు కోడలు ఆయుర్దాయం

కోడలు.... ఆమె నాకు పుట్టిన పిల్ల కాదు. ఎక్కడో పుట్టిన పిల్ల. ఎక్కడో చదువుకుంది.. ఎవరి ఇంటినుండో వచ్చింది. అయితే నాకు కోడలిగా వచ్చింది. నా కొడుకును సంతోష పెట్టింది. నా వంశాన్ని పెంచింది. నాకు మనవడిని, మనవరాలిని ఇచ్చింది. నాకు, నా భార్యకు ఊతకర్ర.. చేతికర్ర అయింది. ముప్పూటలా ప్రేమను పంచిపెడుతున్నది. అటువంటి కోడలును చూసుకుని అత్తామామలు మురిసిపోతారు. అందుకే శాస్త్రం కోడలికి పెద్దపీట వేసింది. మామగారు కాలం చేస్తే ... తద్దినం పెట్టేటప్పుడు కొడుకు అక్కడే ఉన్నా దీపం పెట్టే అధికారం మాత్రం కోడలికే ఇచ్చింది. ఏ కారణంచేతనయినా ఆమెకు అవాంతరం ఏదయినా వస్తే... ఆమె మళ్ళీ యోగ్యత పొందినప్పుడే తద్దినం పెట్టాలని చెప్పింది. అంత గొప్ప ఉపకారం చేస్తున్న కోడలిని... మా కిచ్చిన కన్యాదాతకు ప్రతిఫలంగా ఏమిచ్చి గౌరవించగలం!!! నా కూతురిని వేరొకరి ఇంటి కోడలిగా పంపితే.. నేను ఒక మహోపకారం చేసినట్లు. నా కూతురు వేరొకరికి ధర్మపత్ని అయింది. ఆయన తరిస్తున్నాడు. ఆయన సంతోషంగా ఉన్నాడు. ఆయన సంతానాన్ని పొందాడు. నేను తాతయినట్టుగానే ఆయన తల్లిదండ్రులు తాత, నాయనమ్మలయి వారు సంతోషిస్తున్నారు. భగవంతుడు నాకేమి ఇచ్చాడో వేరొకరికి కూడా ఇచ్చాడు. అది నాకు గొప్ప సంతృప్తి. ఎవరంటారు శాస్త్రం ఆమెకు తక్కువ చేసిందని!!! తండ్రికి ఆమె 21 తరాలు తరించే అవకాశం ఇచ్చింది.

పిల్లను ఇస్తున్నాం... కన్యాదానం చేస్తున్నామంటే... ఏదో పంచలచాపు ఇస్తున్నట్లు కాదు... ఆ పిల్ల మీద అధికారం తల్లిదండ్రులకు ఎప్పుడూ ఉంటుంది. పరమ మర్యాద, గౌరవం అల్లుడి దగ్గరే మొదలవుతుంది. మంచి అల్లుడిని పొందడం అంటే మరో కొడుకును కన్నంత ఆనందం. కొడుకు చూపే అభిమానంకన్నా కోడలి అభిమానం పొందిన వారు మరో పదేళ్ళు ఎక్కువగా బతుకుతారు. మా అల్లుడు బంగారం. మా అమ్మాయిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నాడన్న ఆనందం వారి ఆయుర్దాయాన్ని పెంచుతుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కాంచీపురంలో ఒక వృద్ధ వేదపండితుడు తటస్థపడి మాటల సందర్భంలో ఇలా అన్నాడు..''అల్లుడు మంచివాడయితే మీకు మరో కొడుకున్నట్టే. మంచివాడు కాకపోతే మీరు నిత్యం చచ్చిపోయినట్లే. కారణం కూతురి బాధను చూడలేక, చూసి.. మింగలేక.. కక్కలేక మీకు ఆ స్థితి ఏర్పడుతుంది.'' అని.

మనిషిని మనిషి బాధపెట్టుకోవడమయినా, బతికించుకోవడమయినా మన అనుబంధాలనుబట్టి ఉంటుంది. గృహస్థాశ్రమ వైశిష్ట్యాన్ని అర్థం చేసుకుంటే... ఓహో... ఇంత గొప్పగా మాట్లాడి ఇస్తున్నారా పిల్లను... అనిపిస్తుంది. అందుకనే 'ధర్మేచ అర్థేచ కామేచ....ఏషా నాతి చరితవ్యా... ధర్మప్రజాసంపత్తి అర్థం స్త్రీయం ఉద్వహే' .. నేను ఈమెను దేనికోసం స్వీకరిస్తున్నాను..ధార్మికమైన సంతానం కోసం... జీవితంలో మొదట భార్య ఊరట, తరువాత కొడుకు ఊరట, తదుపరి కోడలు ఊరట, పిదప మనవడు, మనవరాలు ఊరట...అదీ గృహస్థాశ్రమ వైభవం... తాత పక్కన ఉంటే మనుమలకు ఒక విశ్వవిద్యాలయం పక్కన ఉన్నట్టే.

సినిమా



రవితేజ కోహినూర్?

'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల మరో సినిమాలో జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. రవితేజ కెరీర్‌లో 75వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమాతో 'సామజవరగమన' వంటి హిట్ సినిమాకు ఓ రచయితగా చేసిన భాను బోగవరపు దర్శకుడిగా పరిచయం కానున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో లక్ష్మణ్ భేరి అనే పాత్రలో రవితేజ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ సినిమాకు 'కోహినూర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం 'కోహినూర్'ను వర్కింగ్ టైటిల్‌గా పెట్టుకుని యూనిట్ వర్క్ చేస్తోందని, త్వరలోనే ఈ సినిమా టైటిల్ గురించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారు.

వింటేజ్ యాక్షన్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'మట్కా'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లు. కరుణకుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డా. విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్ళూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇరవైనాలుగేళ్ల టైమ్‌లైన్‌తో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారు. ఆదివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సిగార్ తాగుతూ కనిపిస్తున్న వరుణ్ తేజ్ డ్రెస్సింగ్, హెయిర్ స్టైల్‌లో వింటేజ్ వైబ్ కనిపిస్తోంది. నవీన్ చంద్ర, సలోని, అజయ్ ఘోష్, పి. రవిశంకర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



● వరుణ్ తేజ్

విభిన్న వీక్షణం

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''విభిన్నమైన కథాంశంతో 'వీక్షణం' ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఫస్ట్ కాపీ కూడా రెడీ అయింది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, కెమెరా: సాయిరామ్ ఉదయ్.



● రామ్ కార్తీక్



● ఛార్మీ, పూరి జగన్నాథ్, రామ్, కావ్యా థాపర్

నేను ఒళ్లు దగ్గర పెట్టుకుని చేసిన సినిమా ఇది

– పూరి జగన్నాథ్

''ఈ మధ్య సోషల్ మీడియాలో, బయట ఓ ట్రెండ్ చూస్తున్నాను. అరే... నీకిది నచ్చిందా? అని అడిగితే... వాళ్లకు నచ్చుతుందేమో... వీళ్లకు నచ్చుతుందేమో అని తోటివారిపైకి తోస్తున్నారు. ముందు మనకు నచ్చిందా? అని చూసుకోవాలి. మీకు నచ్చింది మీరు చేయండి. పక్కోడి గురించి, పకోడీల గురించి పట్టించుకుంటే పనులు జరగవు. సాధారణంగా నేను సలహాలివ్వను. నా అనుకున్నవాళ్లు అడిగితే ఇస్తా. మీ అందర్నీ (ఫ్యాన్స్) నా వాళ్లుగా ఫీలై ఇస్తున్నాను'' అని రామ్ అన్నారు. హీరో రామ్, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరి కాంబినేషన్‌లోనే 2019లో వచ్చిన హిట్ చిత్రం 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. ఈ చిత్రంలో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించగా, సంజయ్ దత్, అలీ కీలక పాత్రల్లో నటించారు. పూరి జగన్నాథ్, ఛార్మీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా వరంగల్‌లో జరిగిన 'డబుల్ ఇస్మార్ట్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ మాట్లాడుతూ– ''హీరోలు బుల్లెట్స్‌లాంటివారు. పేల్చే గన్ బాగుంటే బుల్లెట్ చాలా స్పీడ్‌గా వెళ్తుంది. పూరీగారిలాంటి గన్ ప్రతి ఒక్క యాక్టర్‌కి కావాలి. ఛార్మీ కౌర్‌గారు లేకపోతే 'డబుల్ ఇస్మార్ట్' లేదు. ఆమె ఓ ఫైటర్. బాస్ లేడీ అని పిలుస్తాను. 'డబుల్ ఇస్మార్ట్' రేంజ్‌కి తగ్గట్లు, ప్రేక్షకుల అంచనాలను మించేలా మణిశర్మ గారు మ్యూజిక్ ఇచ్చారు'' అని అన్నారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ– ''రామ్ లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు. సంజయ్ దత్‌గారు మా సినిమాలో యాక్ట్ చేసి, కొత్త కలర్ తీసుకొచ్చారు. నా నిర్మాణ సంస్థకు ఛార్మీ కౌర్ ఓ బలం. నా దగ్గర రూపాయి లేకపోయినా నాకోసం ఎవరన్నా నిలబడ్డారంటే అది విషురెడ్డి. హిట్ సినిమా తీసినప్పుడు చాలామంది ప్రశంసిస్తారు. నా ఫ్లాప్ సినిమా విడుదలైన వారానికి విజయేంద్రప్రసాద్‌గారు ఫోన్ చేసి, 'సార్... నాకో హెల్ప్ చేస్తారా?' అన్నారు. ఆయన కొడుకే పెద్ద డైరెక్టర్.. రాజమౌళి. అలాంటిది ఆయన నన్ను హెల్ప్ అడుగుతున్నారేంటి? అనుకున్నా. 'తర్వాతి సినిమా ఎప్పుడు చేస్తున్నారు? చేసే ముందు ఆ సినిమా కథ నాకోసారి చెప్తారా? మీలాంటి దర్శకులు ఫెయిల్ కావడం చూడలేను. చిన్న చిన్న తప్పులేవో ఉంటుంటాయి. తీసే ముందు నాకోసారి చెప్పండి' అన్నారు. నేను భావోద్వేగానికి గురయ్యాను. అయితే 'డబుల్ ఇస్మార్ట్' కథను విజయేంద్రప్రసాద్‌గారికి చెప్పలేదు. తెలిసిన పనే కదా... ఒళ్లు దగ్గర పెట్టుకుని ఈ సినిమా తీశా'' అని తెలిపారు పూరి జగన్నాథ్. ''ఇస్మార్ట్ శంకర్'ను ఆదరించినట్లే 'డబుల్ ఇస్మార్ట్'నూ ఆదరించండి'' అన్నారు ఛార్మీ. పూరీ కనెక్ట్స్ సీఈవో విషు రెడ్డి, అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికీ మిస్టరీనే!

''గణిత శాస్త్రం సృష్టి లోతును తెలిపితే... విజ్ఞాన శాస్త్రం సృష్టి మూలంవైపు తీసుకుని వెళ్తుంది'' అంటూ మొదలైంది 'రహస్యం ఇదం జగత్' సినిమా రిలీజ్ డేట్ గ్లింప్స్ వీడియో. రాకేశ్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానసా వీణ, భార్గవ్ గోపీనాథం, కార్తీక్ కండాల, శివకుమార్ జుటూరి, ఆది నాయుడు, లాస్య రావినూతుల ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిలర్ మూవీలో లీడ్ రోల్స్‌లో నటించారు. కోమల్ ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాను నవంబరు 8న రిలీజ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ఆ దేశంలోని ఓ ఎడారిలో ఎండిపోయిన సరస్సులో సుమారు 22 కిలోమీటర్ల వైశాల్యంలో అతి పెద్ద శ్రీచక్రం ప్రత్యక్షం కావడమే ఇందుకు కారణం, నిత్యం అమెరికా వైమానిక దళం నిఘా ఉండే ఈ ప్రాంతంలో శ్రీచక్రం ఎలా ఏర్పడింది? అనేది ఇప్పటికీ మిస్టరీనే' వంటి డైలాగ్స్ గ్లింప్స్ వీడియోలో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: గ్యానీ, కెమెరా: టైలర్ బ్లుమెల్.



● రాకేశ్

దర్శకుడు మారాడా?

'ముకుత్తి అమ్మన్ (2020)' (తెలుగులో 'అమ్మోరు తల్లి') సినిమా సీక్వెల్ 'ముకుత్తి అమ్మన్ 2'కు తమిళ దర్శకుడు సుందర్. సి దర్శకత్వం వహించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. నయనతార, ఆర్‌జే బాలాజీ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ముకుత్తి అమ్మన్'. ఆర్‌జే బాలాజీ, ఎన్‌జే శరవణన్ కలిసి దర్శకత్వం వహించిన ఈ ఫ్యాంటసీ కామెడీ సినిమా 2020లో డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజైంది. ఈ సినిమాకు వీక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ సినిమాకు సీక్వెల్ రానుందని, ఈ చిత్రంలో త్రిష లీడ్ రోల్‌లో నటిస్తారని, ఆర్‌జే బాలాజీ కూడా ఓ లీడ్ రోల్‌లో నటించి, పూర్తి స్థాయిలో దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారని కోలీవుడ్‌లో ప్రచారం సాగింది. కానీ తొలి భాగంలో నటించిన నయనతారయే మలి భాగంలోనూ లీడ్ రోల్ చేస్తారని, వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ సంస్థ గత నెలలో ప్రకటించింది. అయితే దర్శకుడిని మాత్రం ప్రకటించలేదు. దీంతో 'ముకుత్తి అమ్మన్ 2'కు ఆర్‌జే బాలాజీయే దర్శకత్వం వహిస్తారా? లేదా అనే చర్చ కోలీవుడ్‌లో జరుగుతోంది. అయితే తాజాగా నటుడు–దర్శకుడు సుందర్. సి ఈ సినిమాను తెరకెక్కించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... ఈ ఏడాది చివర్లో చిత్రీకరణను ప్రారంభించి, వచ్చే ఏడాది ప్రథమార్ధంలోపు ఈ సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేయాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని భోగట్టా. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



● నయనతార

ఓటీటీ ఇది చూడొచ్చు

వానరాలు నటించిన అచ్చ తెలుగు కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



భాష ఏదైనా భావం ముఖ్యమన్న నానుడి 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' సినిమాకి సరిగ్గా సరిపోతుంది. ఒకటి రెండు పాత్రల మినహా పూర్తిగా చింపాంజీలు నటించిన సినిమా ఇది. ఈ సినిమాకి వెస్ బాల్ దర్శకుడు. 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' సినిమా మునుపటి ఏప్స్ సిరీస్‌కు కొనసాగింపుగా తీసింది. సీజర్ అనే ప్రధాన పాత్రధారి తదనంతరం జరిగే కథ ఇది. సీజర్‌కు వారసుడిగా ప్రకటించుకుని తనకు తాను ప్రాక్సిమస్ సీజర్‌గా ప్రకటించుకుంటాడు ఓ నాయకుడు. మోవా, అతని సమూహం పై దాడి చేసి బందీలుగా తన రాజ్యానికి తెచ్చుకుంటాడు ప్రాక్సిమస్ సీజర్. తన రాజ్యంలో మనుషులకు సంబంధించిన ఓ బంకర్‌ను మందీ మార్బలంతో తెరవడానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ ప్రయత్నంలో బంకర్‌కు సంబంధించిన ఓ మనిషితో కలిసి ప్రాక్సిమస్ రాజ్యంలోకి ప్రవేశిస్తాడు మోవా. తరువాత కొన్ని ట్విస్టులతో ప్రాక్సిమస్ సీజర్‌ను మోవా ఎలా అంతమొందించాడు అన్నది హాట్ స్టార్ ఓటీటీ వేదిక మీద చూడాలి. కథ పరంగా చూస్తే మనకు పాత తెలుగు సినిమా కథ వాసనలు రావచ్చు. టెక్నాలజీని ఉపయోగించి టాలీవుడ్ నుండి హాలీవుడ్ దాకా ఈగ నుండి డైనాసరస్ వరకు అన్ని జంతువులను మన కథకు తగ్గట్టుగా మలుచుకుంటున్నారు నేటి దర్శకులు. కాకపోతే ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి. ఇంతటి సాంకేతికత అందుబాటులోకి రాని 80వ దశకంలోనే 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అన్న పేరుతో తెలుగులో ఓ సినిమా వచ్చింది. అప్పట్లో పూర్తిగా జంతువుల మీద తీసిన సినిమా అది. నాటి ప్రేక్షకులకు అదో వింత, నేటి ప్రేక్షకులకు 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' సినిమా అనేది ఓ పెద్ద వండర్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే జంతువులలో కూడా మనిషి భావాలు స్పష్టంగా చూపించడం, అలాగే అద్భుతమైన టేకింగ్ విత్ విజువల్ ఫీస్ట్ స్క్రీన్‌ప్లేతో 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' సినిమా వర్త్ టూ వాచ్.

– ఇంటూరు హరికృష్ణ



వెయిట్‌లిఫ్టింగ్‌లో చైనా హవా

పారిస్ ఒలింపిక్స్ వెయిట్‌లిఫ్టింగ్‌లో చైనా ఐదు స్వర్ణాలతో అదరగొట్టింది. చివరిరోజు మహిళల ప్లస్ 81 కేజీల విభాగంలో చైనా లిఫ్టర్ లీ వెన్‌వెన్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. లీ వెన్‌వెన్ మొత్తం 309 కేజీల (స్నాచ్‌లో 136 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 173 కేజీలు) బరువెత్తింది. చైనా తరఫున ఈ క్రీడల్లో హు జీహుయ్ (49 కేజీలు), షిఫాంగ్ లువో (59 కేజీలు), లీ ఫాబిన్ (61 కేజీలు), లీ హువాన్‌హువా (102 కేజీలు) కూడా పసిడి పతకాలు సాధించారు.

డయానా టురాసి 'సిక్సర్'

ఒలింపిక్స్ బాస్కెట్‌బాల్‌లో అమెరికా క్రీడాకారిణి డయానా టురాసి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. వరుసగా ఆరు స్వర్ణ పతకాలు సాధించిన ఏకైక బాస్కెట్‌బాల్ ప్లేయర్‌గా ఆమె గుర్తింపు పొందింది. ఆదివారం జరిగిన మహిళల బాస్కెట్‌బాల్ ఫైనల్లో అమెరికా 67–66తో ఫ్రాన్స్‌ను ఓడించి విజేతగా నిలిచిన జట్టులో డయానా సభ్యురాలిగా ఉంది. 42 ఏళ్ల డయానా 2004 ఏథెన్స్, 2008 బీజింగ్, 2012 లండన్, 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లోనూ పసిడి పతకాలు గెలిచిన అమెరికా బాస్కెట్‌బాల్ జట్టులోనూ సభ్యురాలిగా ఉంది.



పతకాల పట్టిక



ర్యాం	దేశం	స్వ	ర	కాం	మొ
1	అమెరికా	40	44	42	126
2	చైనా	40	27	24	91
3	జపాన్	20	12	13	45
4	ఆస్ట్రేలియా	18	19	16	53
5	ఫ్రాన్స్	16	26	22	64
6	నెదర్లాండ్స్	15	7	12	34
7	బ్రిటన్	14	22	29	65
8	దక్షిణ కొరియా	13	9	10	32
9	ఇటలీ	12	13	15	40
10	జర్మనీ	12	13	8	33
11	న్యూజిలాండ్	10	7	3	20
12	కెనడా	9	7	11	27
13	ఉజ్బెకిస్తాన్	8	2	3	13
14	హంగేరి	6	7	6	19
15	స్పెయిన్	5	4	9	18
16	స్వీడన్	4	4	3	11
17	కెన్యా	4	2	5	11
18	నార్వే	4	1	3	8
19	ఐర్లాండ్	4	0	3	7
20	బ్రెజిల్	3	7	10	20
21	ఇరాన్	3	6	3	12
22	ఉక్రెయిన్	3	5	4	12
23	రొమేనియా	3	4	2	9
24	జార్జియా	3	3	1	7
25	బెల్జియం	3	1	6	10
26	బల్గేరియా	3	1	3	7
27	సెర్బియా	3	1	1	5
28	చెక్ రిపబ్లిక్	3	0	2	5
29	డెన్మార్క్	2	2	5	9
30	అజర్‌బైజాన్	2	2	3	7
30	క్రొయేషియా	2	2	3	7
32	క్యూబా	2	1	6	9
33	బహ్రెయిన్	2	1	1	4
34	స్లొవేనియా	2	1	0	3
35	చైనీస్ తైపీ	2	9	5	7
36	ఆస్ట్రియా	2	0	3	5
37	హాంకాంగ్	2	0	2	4
37	ఫిలిప్పీన్స్	2	0	2	4
39	అల్జీరియా	2	0	1	3
39	ఇండోనేసియా	2	0	1	3
41	ఇజ్రాయెల్	1	5	1	7
42	పోలాండ్	1	4	5	10
43	కజకిస్తాన్	1	3	3	7
44	జమైకా	1	3	2	6
44	దక్షిణాఫ్రికా	1	3	2	6
44	థాయ్‌లాండ్	1	3	2	6
47	ఇథియోపియా	1	3	0	4
48	స్విట్జర్లాండ్	1	2	5	8
49	ఈక్వెడార్	1	2	2	5
50	పోర్చుగల్	1	2	1	4
51	గ్రీస్	1	1	6	8
52	అర్జెంటీనా	1	1	1	3
52	ఈజిప్ట్	1	1	1	3
52	ట్యూనీషియా	1	1	1	3
55	బోట్స్‌వానా	1	1	0	2
55	చిలీ	1	1	0	2
55	సెయింట్ లూసియా	1	1	0	2
55	ఉగాండా	1	1	0	2
59	డొమినికన్ రిపబ్లిక్	1	0	2	3
60	గ్వాటెమాలా	1	0	1	2
60	మొరాకో	1	0	1	2
62	డొమినికా	1	0	0	1
62	పాకిస్తాన్	1	0	0	1
64	టర్కీ	0	3	5	8
65	మెక్సికో	0	3	2	5
66	అర్మేనియా	0	3	1	4
66	కొలంబియా	0	3	1	4
68	కిర్గిస్తాన్	0	2	4	6
68	ఉత్తర కొరియా	0	2	4	6
70	లిథువేనియా	0	2	2	4
71	భారత్	0	1	5	6
72	మాల్డోవా	0	1	3	4
73	కొసోవో	0	1	1	2
74	సైప్రస్	0	1	0	1
74	ఫిజీ	0	1	0	1
74	జోర్డాన్	0	1	0	1
74	మంగోలియా	0	1	0	1
74	పనామా	0	1	0	1
79	తజకిస్తాన్	0	0	3	3
80	అల్బేనియా	0	0	2	2
80	గ్రెనెడా	0	0	2	2
80	మలేసియా	0	0	2	2
80	ప్యూర్టోరికా	0	0	2	2
84	ఐవరీకోస్ట్	0	0	1	1
84	కాబో వెర్డె	0	0	1	1
84	రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్	0	0	1	1
84	పెరూ	0	0	1	1
84	ఖతార్	0	0	1	1
84	సింగపూర్	0	0	1	1
84	స్లొవేకియా	0	0	1	1
84	జాంబియా	0	0	1	1

నోట్: ర్యాం- ర్యాంక్, స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

ఏడు నుంచి ఆరుకు... 48 నుంచి 71కి..!

పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపర్చిన భారత బృందం

టోక్యో ఒలింపిక్స్ ముగిసిన వెంటనే భారత ఆటగాళ్ల సన్నాహాలు మొదలయ్యాయి. సాధారణంగా ఉండే నాలుగేళ్లతో పోలిస్తే ఒక ఏడాది తక్కువ సమయం ఉండటంతో అన్ని క్రీడల్లోనూ పారిస్ లక్ష్యంగానే హడావిడి కనిపించింది. అధికారులు, ప్రభుత్వం కూడా రెండంకెల పతకాలు ఖాయమంటూ నమ్మకం పెట్టుకున్నాయి. అందుకు తగినట్లుగా ఈసారి కేంద్ర ప్రభుత్వం కూడా అండగా నిలిచింది. అథ్లెట్ల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకుండా ఒలింపిక్స్ సన్నద్ధత కోసమే 16 క్రీడాంశాల్లో సౌకర్యాల కల్పన, విదేశాల్లో ప్రత్యేక శిక్షణ, పోటీల్లో పాల్గొనేందుకు రూ. 470 కోట్లు ఖర్చు కూడా చేసింది. 117 మందితో మన బృందం బరిలోకి దిగింది. అద్భుతాల గురించి కాకపోయినా ఎక్కువ మంది కచ్చితంగా బాగా ఆడతారనే అంచనాలు, ఆశలు మాత్రం అందరిలోనూ ఉన్నాయి. కానీ ఒక్కో రోజు కరుగుతున్న కొద్దీ పరిస్థితి మారిపోతూ వచ్చింది. పతకం కోసం ఎంతో ఎదురు చూడాల్సిన స్థితి. చివరకు ఒక రజతం, ఐదు కాంస్యాలతో మన టీమ్ ముగించింది. గత ఒలింపిక్స్‌తో పోలిస్తే పతకాల సంఖ్య తగ్గడమే కాదు... స్వర్ణం కూడా లేకపోవడంతో పతకాల పట్టికలో కూడా భారత్ చాలా దిగువకు పడిపోయింది.

–సాక్షి క్రీడా విభాగం



పారిస్: అథ్లెటిక్స్‌లో భారత మహిళల 4X400 రిలే జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో 3 నిమిషాల 32.51 సెకన్ల టైమింగ్ నమోదు చేసింది... ఇదే ఈవెంట్‌లో 1984 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో భారత బృందం టైమింగ్ 3 నిమిషాల 32.49 సెకన్లు మాత్రమే! అంటే 40 సంవత్సరాల తర్వాత కూడా మన జట్టు టైమింగ్ మెరుగుకాకపోగా, అంతకంటే పేలవంగా రిలే టీమ్ ముగించింది. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు, విదేశాల్లో శిక్షణ, మంచి డైట్ వంటివి మాత్రమే ఫలితాన్ని ఇవ్వలేవనే దానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే. నిజాయితీగా చెప్పాలంటే అథ్లెటిక్స్‌లో మన ఆటగాళ్ల విషయంలో పెద్దగా అంచనాలు లేవు కానీ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మేమూ ఉన్నామని గుర్తు చేసే కనీస స్థాయి ప్రదర్శన కూడా రాలేదు. మొత్తం 29 మంది అథ్లెట్లు పాల్గొంటే జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఒక్కడే తన స్థాయిని ప్రదర్శించాడు. భారత ప్రదర్శన విషయంలో ఈ ఒక్క క్రీడాంశాన్నే విమర్శించడానికి లేదు. ఓవరాల్‌గా కూడా టోక్యో ఒలింపిక్స్ ప్రదర్శనను దాటలేకపోగా, అది పునరావృతం కూడా కాలేదు. ప్రతీ ఒలింపిక్స్ తర్వాత జరిగే సమీక్ష తరహాలోనే ఈసారి కూడా దాదాపు అవే కారణాలు. మన ప్రమాణాలు బాగా పెరిగాయని చెప్పుకోవడమే తప్ప అసలైన సమయంలో పోటీకి దిగినప్పుడు ఇంకా మనం చాలా అంశాల్లో వెనుకబడి ఉన్నామని తేలిపోయింది. చాలా మంది భారత ఆటగాళ్లకు ఒలింపిక్స్‌లో పాల్గొనడమే ఒక ఘనతగా కనిపిస్తోంది తప్ప అంతకు మించి ముందుకు వెళ్లడం సాధ్యం కావడం లేదు. 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో 43 మంది పాల్గొంటే 41వ స్థానంలో నిలిచిన ప్రియాంక గోస్వామి గేమ్స్ విలేజ్ గదిలో సరదాగా 'రీల్స్' చేస్తున్న వీడియో చూస్తే ఆమె తన ఆట పట్ల ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతుంది. తాము అడిగిన కోచ్‌లు, ఫిజియోలు... తాము కోరిన చోట శిక్షణ... ఇలా ఒక్కటేమిటి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలిచింది. అయినా మెడల్స్ విషయంలో మన రాత మారలేదంటే లోపం ఆటగాళ్లలోనే ఉన్నట్లు అర్థం. తమకు సౌకర్యాలు లేవనే మాట ఇకపై ఆటగాళ్ల నుంచి రాకూడదని... ప్లేయర్లు కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పడుకోన్ చేసిన వ్యాఖ్య ఈ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్లందరికీ వర్తిస్తుంది.

పతకవీరులు...

టోక్యోలో 19 ఏళ్ల టీనేజర్‌గా బరిలోకి దిగి తీవ్రంగా నిరాశపర్చిన షూటర్ మనూ భాకర్ ఈసారి నాటి తప్పులను సరిదిద్దుకుంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో రెండు కాంస్యాలు గెలిచి తనను తాను నిరూపించుకుంది. మిక్స్‌డ్‌లో ఆమె భాగస్వామిగా సరబ్‌జోత్ సింగ్ కూడా కాంస్యాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో అనూహ్యంగా స్వప్నిల్ కుసాలే మూడో స్థానంలో నిలవడంతో భారత్ ఖాతాలో మూడో కాంస్యం చేరింది. భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ కాంస్యం సాధించడం మన అభిమానులకు ఊరట కాగా... యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ కూడా కంచు మోత మోగించి తానేంటో చూపించాడు. అయితే పట్టికలో భారత్ స్థానాన్ని పైకి చేర్చగల స్వర్ణం మాత్రం మనకు రాలేదు. 'టోక్యో' పసిడితో సత్తా చాటిన నీరజ్ చోప్రా గత మూడేళ్ల ప్రదర్శనను చూస్తే ఈసారి గోల్డ్ ఖాయమనిపించింది. అయితే దురదృష్టవశాత్తు అది చేజారినా... రజతంతో కాస్త మెరుగైన పతకం మన ఖాతాలో చేరింది. వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో మెడల్స్ గెలిచిన అరుదైన జాబితాలో నీరజ్ చేరగా... ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో మనూ భాకర్ తన కీర్తిని పెంచుకుంది.

అంచనా తప్పారు...

టోక్యో ఒలింపిక్స్ ముగిసిన తర్వాతి నుంచి ప్రదర్శన, తాజా ఫామ్, ఆటగాళ్ల స్థాయిని బట్టి చూసుకుంటే కొందరు ఆటగాళ్లు తీవ్రంగా నిరాశపర్చారు. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు విఫలం కాగా... కచ్చితంగా పతకం సాధిస్తారనుకున్న డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి



క్వార్టర్ ఫైనల్లోనే పరాజయంపాలయ్యారు. బాక్సింగ్ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, వరల్డ్ రికార్డు ఉన్న షూటర్ సిఫ్ట్ కౌర్ సామ్రా కనీసం పతకానికి చేరువగా కూడా రాలేకపోవడం గమనార్హం. బాక్సింగ్‌లో నిశాంత్ దేవ్, అమిత్ పంఘాల్ కూడా అంచనా తప్పగా... గత ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ కూడా క్వార్టర్ ఫైనల్లోనే ఓడింది. ఇక ఆర్చరీ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. నాలుగో ఒలింపిక్స్‌లో కూడా దీపిక కుమారి ఉత్త చేతులతోనే తిరిగొచ్చింది. ఇక టేబుల్ టెన్నిస్, జూడో, స్విమ్మింగ్, రోయింగ్, సెయిలింగ్, గోల్ఫ్, ఈక్వెస్ట్రియన్‌లు మనం పతకాలు ఆశించే క్రీడలు కావు. టెన్నిస్‌లో రోహన్ బోపన్న తన ఏటీపీ టోర్నీల స్థాయి ఆట ఇక్కడ ప్రదర్శించలేకపోయాడు.

నాలుగో స్థానాలతో సరి...

విజయం సాధించిన వాడినే ప్రపంచం గుర్తుంచుకుంటుంది. రెండో స్థానానికి కూడా విలువుండదు... స్పోర్ట్స్‌లో మోటివేషనల్ స్పీచ్‌లు ఇచ్చేటప్పుడు చాలా మంది తరచుగా వాడే మాట ఇది. కానీ మన భారతీయులు ఇప్పుడు నాలుగో స్థానాన్ని చూసి కూడా అయ్యో... కొద్దిలో చేజారిందే అనుకుంటున్నాం. ఇది ఏదో ఆత్మ సంతృప్తి కోసమే తప్ప ఒలింపిక్స్‌లో నాలుగో స్థానానికి ఎలాంటి విలువ లేదు. అదృష్టం కలిసొస్తే మరో ఆరు పతకాలు మన ఖాతాలో చేరేవేమో కానీ అలాంటి వాటికి ఆటల్లో చోటు లేదు. మనూ భాకర్, అర్జున్ బబూతా, మహేశ్వరి–అనంత్‌జీత్ జోడీ (షూటింగ్), మీరాబాయి చాను (వెయిట్‌లిఫ్టింగ్), లక్ష్య సేన్ (బ్యాడ్మింటన్), బొమ్మదేవర ధీరజ్–అంకిత జోడీ (ఆర్చరీ) అసలు సమయంలో తమ ఆట స్థాయిని పెంచలేకపోయారు. చివరగా... గెలుపు కూడా ఓటమిగా మారిన వైనం వినేశ్ ఫొగాట్ విషయంలో జరిగింది. ఫైనల్ చేరిన తర్వాత వచ్చిన పతకం బరువు ఎక్కువై చేజారడం వినేశ్‌కే కాదు భారతీయులందరికీ వేదన కలిగించింది.


అర్జున్ బబూతా



మనూ భాకర్


మహేశ్వరి–అనంత్‌జీత్


లక్ష్య సేన్


మీరాబాయి చాను


ధీరజ్–అంకిత


వినేశ్ ఫొగాట్



'రికార్డ్స్'తో ముగిసిన క్రీడా సంబరం

- 2024 పారిస్ ఒలింపిక్స్‌కు తెర
- ఘనంగా ముగింపు ఉత్సవం
- లాస్ ఏంజెలిస్‌లో 2028 ఒలింపిక్స్

పారిస్: అద్భుత ప్రదర్శనలతో అసామాన్య ఘనతలతో అత్యుత్తమ వేదికగా నిలిచిన పారిస్ ఒలింపిక్స్‌కు తెర పడింది. 16 రోజుల పాటు 329 క్రీడాంశాల్లో ఆటగాళ్లు పతకాల కోసం హోరాహోరీగా పోటీ పడిన తర్వాత 2024 ఒలింపిక్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి భిన్నంగా పారిస్ నేషనల్ స్టేడియంలో సుమారు 70 వేల మంది ప్రేక్షకుల మధ్య ఈ ముగింపు వేడుకలు జరిగాయి. థామస్ జాలీ నేతృత్వంలో ముగింపు ఉత్సవాలను 'రికార్డ్స్' పేరుతో నిర్వహించారు. ఫ్రాన్స్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ క్రీడా జ్యోతిని తీసుకొని వేదిక వద్దకు రాగా... ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్, ఐఓసీ చైర్మన్ థామస్ బాక్ వేదికపై కూర్చున్నాడు. ఫ్రాన్స్ జాతీయ గీతాన్ని వినిపించిన తర్వాత అన్ని దేశాల ఫ్లాగ్‌బేరర్లు తమ జాతీయ పతాకాలతో స్టేడియంలోకి అడుగుపెట్టారు. భారత్ తరఫున మనూ భాకర్, పీఆర్ శ్రీజేశ్ పతాకధారులుగా వ్యవహరించారు. వచ్చే ఒలింపిక్స్ 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలిస్ నగరంలో జరగనున్న నేపథ్యంలో పారిస్ క్రీడల నిర్వాహకులు ఒలింపిక్ ఫ్లాగ్‌ను లాస్ ఏంజెలిస్ క్రీడల చైర్‌పర్సన్ కేసీ వాసర్‌మన్‌కు అందజేశారు. ఫ్రెంచ్ భాషలో 'మెర్సీ పారిస్' (థ్యాంక్యూ పారిస్) నినాదాలు హోరెత్తుతుండగా ఆఖరి ఘట్టం ముగిసింది.



సూపర్ సిఫాన్...

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలు గెలిచిన నెదర్లాండ్స్ మహిళా అథ్లెట్ సిఫాన్ హసన్ 'పారిస్'లోనూ మూడు పతకాలతో మెరిసింది. 'పారిస్'లో ఇప్పటికే 5000 మీటర్లు, 10000 మీటర్ల విభాగాల్లో కాంస్య పతకాలు సాధించిన 31 ఏళ్ల సిఫాన్... ఆదివారం జరిగిన మారథాన్ రేసులో ఏకంగా స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. 42.195 కిలోమీటర్ల దూరాన్ని సిఫాన్ 2 గంటల 22 నిమిషాల 55 సెకన్లలో అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా పూర్తి చేసి కొత్త ఒలింపిక్ రికార్డును నమోదు చేసింది. 2012 లండన్ గేమ్స్‌లో 2 గంటల 23 నిమిషాల 7 సెకన్లతో జెలెనా టికి (ఇథియోపియా) నెలకొల్పిన ఒలింపిక్ రికార్డును సిఫాన్ సవరించింది. తాజా విజయంతో సిఫాన్ కొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్‌లో డిస్టెన్స్ రన్నింగ్ (5000, 10000 మీటర్లు, మారథాన్)లోని మూడు ఈవెంట్లలో పతకాలు గెలిచిన తొలి మహిళా అథ్లెట్‌గా సిఫాన్ గుర్తింపు పొందింది. పురుషుల్లో ఎమిల్ జటోపెక్ (చెక్ రిపబ్లిక్; 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో... 5000, 10000 మీటర్లు, మారథాన్) మూడు స్వర్ణ పతకాలు గెలిచాడు.

డిస్టెన్స్ రన్నింగ్ మూడు విభాగాల్లోనూ పతకాలు నెగ్గిన తొలి మహిళా అథ్లెట్‌గా ఘనత







పతకాల సంఖ్య ప్రామాణికం కాదు

నీరజ్ చోప్రా

పారిస్ ఒలింపిక్స్ ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. గతంతో పోలిస్తే జావెలిన్‌ను ఎక్కువ దూరం విసిరి రజతం గెలవడం ఆనందంగా ఉంది. అయితే విశ్వ క్రీడా వేదికపై మన జాతీయ గీతం వినడాన్ని ఎక్కువ సంతోషిస్తా. మరింత మెరుగవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. దాని కోసం కృషి చేస్తా. ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం గెలిచిన సమయంలో అభిమానుల నుంచి లభించిన మద్దతును ఎప్పటికీ మరవలేను. నాతో పాటు.. మన అథ్లెట్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ప్రేరణ నింపారు. 'పారిస్' క్రీడల్లో భారత ప్రదర్శనను అంచనా వేయడానికి కేవలం పతకాల సంఖ్య ప్రామాణికం కాదు. చాలా మంది త్రుటిలో పతకాలను కోల్పోయారు. ఆ స్థాయికి రావడానికి వారు పడ్డ శ్రమను తక్కువ చేయలేము. హాకీ జట్టులోని 16 మంది సభ్యులతో పాటు మొత్తం 21 మంది అథ్లెట్లు పారిస్ నుంచి పతకాలతో తిరిగి వస్తున్నారు. మొత్తంగా ఈ క్రీడల్లో మన అథ్లెట్లు ఆరు విభాగాల్లో నాలుగో స్థానాల్లో నిలిచారు. మరొకదాంట్లో అనర్హత వేటుకు గురయ్యారు. 1960 ఒలింపిక్స్‌లో దిగ్గజ అథ్లెట్ మిల్కా సింగ్, 1984 క్రీడల్లో పీటీ ఉష ఇలాగే నాలుగో స్థానంలో నిలిచి... యువతకు మార్గదర్శకులు అయ్యారు. ఇప్పుడు తాజా ఒలింపిక్స్‌లో పతకం సాధించగల ఏడుగురు అథ్లెట్లు... వివిధ క్రీడాంశాల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న మరో 15 మంది అథ్లెట్లు మన బృందంలో ఉన్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో ఏడు పతకాలు సాధించినప్పుడు... మరో ఇద్దరు మాత్రమే నాలుగో స్థానంలో నిలిచారు. అప్పటితో పోల్చితే ఇప్పుడా సంఖ్య భారీగా పెరిగింది. క్రీడా సంస్కృతి పెరుగుదలకు ఇది నిదర్శనం. దేశంలో క్రీడారంగంపై భారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభమైంది. అథ్లెట్లకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు లభిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాలుగో స్థానాలను పతకాలుగా మలవగలమనే నమ్మకం ఉంది. అర్జున్ బబూతా, అంకిత, బొమ్మదేవర ధీరజ్, మహేశ్వరీ చౌహాన్, అనంత్‌జీత్ సింగ్, మనూ భాకర్, వినేశ్ ఫొగాట్ ఇలా వీళ్లంతా త్రుటిలో పతకాలు కోల్పోయారు. అథ్లెట్లు నిరంతరం మెరుగవడంపై దృష్టి పెట్టడం ముఖ్యం. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న మన అథ్లెట్లందరూ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లో భాగంగా ఉన్నారు. దీని వల్ల నిపుణుల పర్యవేక్షణలో విదేశీ శిక్షణకు అవకాశం ఉంటుంది. గత మూడేళ్లలో నేను 310 రోజుల పాటు వివిధ దేశాల్లో శిక్షణ పొందాను. దాన్ని సరైన రీతిలో వినియోగించుకుంటే.. మెరుగైన ఫలితాలు సాధించడం పెద్ద కష్టం కాదు.



అమెరికాను బోల్తా కొట్టించి స్వర్ణం గెలిచిన ఇటలీ మహిళల వాలీబాల్ జట్టు

పారిస్ ఒలింపిక్స్‌లో చివరి రోజు సంచలన ఫలితం వచ్చింది. మహిళల వాలీబాల్ ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ అమెరికా జట్టుకు ఊహించని పరాజయం ఎదురైంది. తొలిసారి ఫైనల్ చేరిన ఇటలీ జట్టు 25-18, 25-20, 25-17తో అమెరికా జట్టును ఓడించి మొదటిసారి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్ అనంతరం ఇటలీ సీనియర్ క్రీడాకారిణి, నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ మోనికా డి జెనారోను సభ్యులంతా గాల్లో ఎగరేసి సంబరం చేసుకున్నారు. మాజీ చాంపియన్ బ్రెజిల్ 25-21, 27-25, 22-25, 25-15తో టర్కీ జట్టును ఓడించి కాంస్య పతకం సాధించింది. ఫైనల్లో అమెరికా జట్టు ఓడిపోయినా ఒలింపిక్స్ మహిళల వాలీబాల్‌లో అత్యధికంగా ఏడు పతకాలు సాధించిన జట్టుగా అవతరించింది. అమెరికా జట్టు ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలు దక్కించుకుంది. సోవియట్ యూనియన్, చైనా, జపాన్, బ్రెజిల్ ఆరు పతకాలు చొప్పున నెగ్గాయి.

అమెరికాకే అందలం

మరోసారి పతకాల పట్టికలో అగ్రస్థానం

- వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో ఈ ఘనత
- వరుసగా ఎనిమిదో స్వర్ణం నెగ్గి రికార్డు నెలకొల్పిన అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు

పారిస్: విశ్వ క్రీడల్లో చివరిరోజు ఆఖరి మెడల్ ఈవెంట్‌లో అమెరికా అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. చివరి మెడల్ ఈవెంట్‌గా జరిగిన మహిళల బాస్కెట్‌బాల్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అమెరికా 67–66 పాయింట్ల తేడాతో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టును ఓడించింది. మహిళల బాస్కెట్‌బాల్ జట్టు స్వర్ణ పతకంతో పతకాల పట్టికలో అమెరికా జట్టు టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకోవడం విశేషం. అమెరికా, చైనా జట్లు 40 స్వర్ణ పతకాలతో సమంగా నిలిచాయి. అయితే చైనాకంటే అమెరికా ఎక్కువ రజత పతకాలు, ఎక్కువ కాంస్య పతకాలు సాధించింది. దాంతో అమెరికాకు అగ్రస్థానం దక్కింది. ఫ్రాన్స్ జట్టుతో జరిగిన ఫైనల్లో అమెరికా మహిళల జట్టుకు గట్టిపోటీ ఎదురైంది. ఒకదశలో అమెరికాకు ఓటమి తప్పదా అనిపించింది. ఆఖరి క్వార్టర్‌లో నాలుగు నిమిషాలు మిగిలి ఉన్నంతవరకు ఫ్రాన్స్ 53–52తో ఒక్క పాయింట్ ఆధిక్యంలో ఉంది. ఈ దశలో తమకు లభించిన ఫ్రీ త్రోను అమెరికా పాయింట్‌గా మలిచి స్కోరును 53–53తో సమం చేసింది. ఆ తర్వాత అమెరికా కీలక పాయింట్లు సాధిస్తూ ఆధిక్యంలోకి వెళ్లింది. 17 సెకన్లు మిగిలి ఉన్నాయనగా అమెరికా 63–59తో ముందంజలో నిలిచింది. ఈ దశలో తమకు లభించిన రెండు ఫ్రీ త్రోలను ఫ్రాన్స్ ప్లేయర్ మరీన్ జోన్స్ పాయింట్లుగా మలిచింది. దాంతో అమెరికా ఆధిక్యం 63–61గా మారింది. 11 సెకన్లు ఉన్నాయనగా అమెరికా ప్లేయర్ కెల్సీ ప్లమ్ రెండు పాయింట్లు సాధించి 65–61తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఐదు సెకన్లు ఉన్నాయనగా ఫ్రాన్స్ ప్లేయర్ గ్యాబీ విలియమ్స్ మూడు పాయింట్ల షాట్ సంధించడంతో అమెరికా ఆధిక్యం 65–64కు తగ్గింది. మూడు సెకన్లు ఉన్నాయనగా ఫ్రాన్స్ ప్లేయర్ ఫౌల్ చేయడంతో అమెరికాకు రెండు ఫ్రీ త్రోలు రావడం, వాటిని పాయింట్లుగా మలచడం జరిగింది. దాంతో అమెరికా 67–64తో ముందంజలోకి వెళ్లింది. చివరి క్షణంలో ఫ్రాన్స్ ప్లేయర్ మరీన్ జోన్స్ రెండు పాయింట్లు సాధించినా ఆతిథ్య జట్టు పాయింట్ తేడాతో ఓటమి చవిచూసింది. అమెరికా జట్టులో విల్సన్ అజా 21 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలువగా... కెల్సీ ప్లమ్, కాపర్ కాలీ 12 పాయింట్ల చొప్పున సాధించారు. ఈ గెలుపుతో అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు ఒలింపిక్స్‌లో వరుసగా ఎనిమిదో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఓవరాల్‌గా అమెరికా మహిళల జట్టుకిది పదో స్వర్ణం. 1984 లాస్ ఏంజెలిస్, 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్వర్ణాలు నెగ్గిన అమెరికా జట్టు 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించింది. ఆ తర్వాత 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో అమెరికా మహిళల జట్టు పసిడి పతకాల వేట మళ్లీ మొదలై 2024 పారిస్ ఒలింపిక్స్ వరకు కొనసాగుతూనే ఉంది.

మరోవైపు శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన పురుషుల బాస్కెట్‌బాల్ ఫైనల్లో అమెరికా జట్టు 98–87 పాయింట్ల తేడాతో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టుపై గెలిచి ఓవరాల్‌గా 17వసారి పసిడి పతకాన్ని దక్కించుకుంది. అమెరికా జట్టులో స్టీఫెన్ కర్రీ త్రీ పాయింటర్ షాట్‌లను ఎనిమిదిసార్లు వేయడం విశేషం. దిగ్గజ ప్లేయర్లు కెవిన్ డురాంట్ 15 పాయింట్లు, లెబ్రాన్ జేమ్స్ 14 పాయింట్లు, డేవిడ్ బుకెర్ 15 పాయింట్లు సాధించారు.

14 అమెరికా సాధించిన స్వర్ణాల సంఖ్యలో అత్యధికంగా అథ్లెటిక్స్ నుంచి 14 పసిడి పతకాలు లభించాయి. ఆ తర్వాత స్విమ్మింగ్‌లో 8, జిమ్నాస్టిక్స్‌లో 3, బాస్కెట్‌బాల్, సైక్లింగ్ ట్రాక్, ఫెన్సింగ్, రెజ్లింగ్‌లో 2 చొప్పున స్వర్ణాలు దక్కాయి. సైక్లింగ్ రోడ్, ఫుట్‌బాల్, గోల్ఫ్, రోయింగ్, షూటింగ్, సర్ఫింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒక్కో స్వర్ణం చొప్పున లభించాయి.

19 ఇప్పటి వరకు 30 సార్లు ఒలింపిక్స్ క్రీడలు జరిగాయి. ఇందులో అత్యధికంగా 19 సార్లు అమెరికా జట్టు పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. సోవియట్ యూనియన్ ఆరుసార్లు టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. యూనిఫైడ్ టీమ్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా, జర్మనీ ఒక్కోసారి మొదటి స్థానంలో నిలిచాయి.

స్వర్ణాలతో అమెరికా పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులు





స్వర్ణాలతో అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులు

లిన్ యూ టింగ్ పంచ్ అదిరె...

స్వర్ణం నెగ్గిన చైనీస్ తైపీ వివాదాస్పద మహిళా బాక్సర్



పారిస్ ఒలింపిక్స్‌లో లింగ వివాదాన్ని ఎదుర్కొన్న మరో బాక్సర్ స్వర్ణంతో సత్తా చాటింది. మహిళల 57 కేజీల విభాగంలో చైనీస్ తైపీ బాక్సర్ లిన్ యూ టింగ్ పసిడి పతకం కైవసం చేసుకుంది. ఫైనల్లో లిన్ యూ టింగ్ 5–0తో జూలియా (పోలాండ్)పై గెలిచింది. అల్జీరియాకు చెందిన వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమాన్ ఖలీఫ్ పతకం సాధించిన మరుసటి రోజే లిన్ యూ టింగ్ కూడా మెడల్‌తో మెరిసింది. బాక్సింగ్‌లో చైనీస్ తైపీకిదే తొలి ఒలింపిక్ స్వర్ణం కావడం విశేషం. 'పారిస్' క్రీడల ఆరంభం నుంచే సూటిపోటి మాటలు ఎదుర్కొన్న లిన్ యూ టింగ్ బహుమతి ప్రదానోత్సవం సమయంలో కన్నీటి పర్యంతమైంది. ఉబికి వస్తున్న కన్నీళ్లను దిగమింగుతూ.. తాను పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కిందని పేర్కొంది. 'ప్రత్యర్థితోనే కాదు.. పరిస్థితులపై కూడా గెలిచా. ఓ ప్రొఫెషనల్ బాక్సర్‌గా ఒలింపిక్స్ సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ లక్ష్యంపైనే దృష్టి పెట్టా. అయినా కోచ్ ద్వారా కొన్ని వార్తలు వినాల్సి వచ్చేది. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఆహ్వానంతోనే పారిస్‌లో అడుగుపెట్టా. అలాంటప్పుడు వచ్చిన పని వదిలేసి అనవసర విషయాలను దరి చేరనివ్వలేదు. పూర్తి ఏకాగ్రత బౌట్‌పైనే పెట్టా. ఈ పతకంతో ఇన్నాళ్లు పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్లు అయింది. నాకు మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు' అని లిన్ యూ టింగ్ వెల్లడించింది. గతేడాది జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో లిన్‌తో పాటు ఖలీఫ్‌పై అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం వేటు వేసింది. ఈ ఇద్దరిలో పురుషులకు చెందిన జన్యువులు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటూ... లిన్ సాధించిన కాంస్యాన్ని సైతం రద్దు చేసింది. దీంతో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గడమే లక్ష్యంగా బరిలోకి దిగిన లిన్... విశ్వక్రీడల ఆరంభం నుంచే ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ చివరకు చాంపియన్‌గా నిలిచింది.

'భారత్‌కు స్వదేశీ కోచ్ ఉంటేనే మేలు'



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టుకు భవిష్యత్తులో స్వదేశీ కోచ్ ఉంటేనే బాగుంటుందని భారత జట్టు కొత్త హెడ్ కోచ్ మనోలో మార్క్వెజ్ అభిప్రాయపడ్డారు. ఇగోర్ స్టిమాక్ స్థానంలో స్పెయిన్‌కు చెందిన 55 ఏళ్ల మార్క్వెజ్‌ను ఇటీవల హెడ్ కోచ్‌గా నియమించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'స్పెయిన్ తర్వాత ఎక్కువగా గడిపింది భారత్‌లోనే. అందుకేనేమో కొన్నేళ్ల క్రితం భారత్‌కు హెడ్ కోచ్ కావాలని గట్టిగా అనుకున్నాను. అది అప్పుడు కల. కానీ ఇప్పుడు ఆ కల నిజమైనందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు. అయితే భారత్ భిన్న రాష్ట్రాల సమ్మిళితం కాబట్టి స్వదేశీ కోచ్ ఉంటేనే బాగుంటుందని, స్థానిక భాషలు, అంశాలపై ఆయనకు పట్టు ఉంటుందని మార్క్వెజ్ వివరించారు. 'భారత్ కోచ్‌గా జట్టు స్థాయి పెంచడమే మా లక్ష్యం. వ్యక్తిగతంగా ఆటగాళ్లు, సమష్టిగా జట్టు మెరుగయ్యేందుకు ప్రణాళికలు రచిస్తాం. ఇప్పటికిప్పుడు దీని ఫలితాలు రాకపోవచ్చు. దీనికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుత లక్ష్యమైతే ఆసియా కప్–2027కు అర్హత సాధించడం. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌కు ముందు భారత్ ఆరేడు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతుంది' అని అన్నారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌సీ-వెస్ట్ సెంట్రల్ రైల్వేలో 3,317 యాక్ట్ అప్రెంటిస్‌లు

జబల్‌పూర్(మధ్యప్రదేశ్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–వెస్ట్ సెంట్రల్ రైల్వే డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

- **ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు:** జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ.
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 3,317.
- **ట్రేడ్‌లు:** ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హౌస్ కీపర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్, వెల్డర్, వైర్‌మ్యాన్ తదితరాలు.
- **అర్హత:** పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 05.08.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.08.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.09.2024
- **వెబ్‌సైట్:** https://wcr.indianrailways.gov.in

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్-2024-25

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షను నిర్వహిస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా స్కాలర్ షిప్‌ను అందిస్తోంది. ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ విభాగం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- **స్కాలర్‌షిప్ వివరాలు:** ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి మొత్తం రూ.12,000 అందజేస్తారు. ఇది తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తిచేసే వరకు స్కాలర్‌షిప్ లభిస్తుంది.

అర్హత

- ఏడో తరగతిలో 55 శాతం మార్కులు పొందిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి.
- ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి.
- విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా విద్యార్థులను స్కాలర్‌షిప్‌కు ఎంపికచేస్తారు.
- **రాతపరీక్ష:** ఈ స్కాలర్‌షిప్స్‌కు అర్హులైన అభ్యర్థులను ఎంపికచేసేందుకు రాష్ట్ర స్థాయిలో రెండు పేపర్ల రాతపరీక్షలు నిర్వహిస్తారు.
- **పరీక్ష విధానం:** మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్): మొత్తం 90 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 90 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు.
- **స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్):** మొత్తం 90 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 90 ప్రశ్నలు ఉంటాయి. 7, 8 తరగతుల స్థాయిలో సోషల్, సైన్స్, మ్యాథ్స్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు.
- **దరఖాస్తు విధానం:** రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను ఆయా స్కూళ్లు సమర్పించాలి. తర్వాత ఆ దరఖాస్తుల ప్రింటవుట్లను, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.08.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.09.2024
- **ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరితేది:** 06.09.2024.
- **పరీక్ష ఫీజు చెల్లింపునకు చివరితేది:** 10.09.2024.
- **దరఖాస్తు ఫారాలు, ధ్రువపత్రాలను డీఈవో కార్యాలయంలో అందజేసేందుకు చివరితేది:** 10.09.2024.
- **డీఈవో లాగిన్‌లో దరఖాస్తు ఆమోదం పొందేందుకు చివరితేది:** 15.09.2024.
- **వెబ్‌సైట్:** https://www.bse.ap.gov.in

సర్కారీ బ్యాంకులో పీఓ కొలువు!

- ఐబీపీఎస్ పీఓ/ఎంటీ నోటిఫికేషన్ విడుదల
- ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 4,455 పోస్టులు
- మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

బ్యాంకింగ్ రంగంలో ఆఫీసర్ కెరీర్ కోరుకునే అభ్యర్థులకు శుభవార్త! ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్స్‌గా కొలువుదీరే అవకాశం స్వాగతం పలుకుతోంది! అందుకు మార్గం.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) ప్రొబేషనరీ ఆఫీసర్స్/మేనేజ్‌మెంట్ ట్రైనీస్ నోటిఫికేషన్!! మొత్తం 4,455 పీఓ పోస్టుల భర్తీకి తాజాగా ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో..ఐబీపీఎస్ సీఆర్‌పీ ఫర్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ ప్రొబేషనరీ ఆఫీసర్స్/మేనేజ్‌మెంట్ ట్రైనీస్-14 పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఆరు బ్యాంకుల్లో 4,455 పోస్టులు

ఐబీపీఎస్ సీఆర్‌పీ ఫర్ పీఓ/ఎంటీ (14)–2025–26 ప్రక్రియ ద్వారా ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 4,455 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో బ్యాంక్ ఆఫ్ ఇండియా–885 పోస్టులు, కెనరా బ్యాంక్–750 పోస్టులు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–2,000 పోస్టులు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్–260 పోస్టులు, పంజాబ్ నేషనల్ బ్యాంక్–200 పోస్టులు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్–360 పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే నాటికి బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర,ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ల నుంచి కూడా ఖాళీల వివరాలు ఐబీపీఎస్‌కు చేరే అవకాశం ఉంది.దీంతో..ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే నాటికి పోస్టులసంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది.

అర్హతలు

ఆగస్టు21, 2024 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

ఆగస్టు 1, 2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీల అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పీఓ/ఎంటీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ఐబీపీఎస్ మూడు దశల్లో జరుపుతుంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ. వీటిలో ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్‌లను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ రాత పరీక్షల్లో ప్రతిభ చూపి నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. అందులోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఖరారవుతుంది.

వంద మార్కులకు ప్రిలిమ్స్

పీఓ/ఎంటీ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్షను మూడు విభాగాల్లో వంద మార్కులకు నిర్వహిస్తారు. అవి..ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు–35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట.

ప్రతి సెక్షన్‌లోనూ ఐబీపీఎస్ నిర్దిష్ట కటాఫ్ మార్కులను నిర్ణయిస్తుంది. ఆ కటాఫ్ మార్కుల జాబితాలో నిలిచిన వారికి మెయిన్ ఎగ్జామినేషన్‌కు అర్హత లభిస్తుంది. ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున(1:10 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

200 మార్కులకు మెయిన్ పరీక్ష

రెండో దశలో మెయిన్ పరీక్షను నాలుగు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 45 ప్రశ్నలు–60 మార్కులు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–40 మార్కులు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 35 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగాను ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే) విభాగం పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో ఒక ఎస్సే, ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది. దీనికి కేటాయించిన మార్కులు 25. పరీక్ష సమయం 30 నిమిషాలు. ఇది అభ్యర్థుల ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పరిశీలించే పరీక్ష.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ ఎగ్జామినేషన్‌లో పొందిన మార్కులు ఆధారంగా.. సెక్షన్‌ల వారీ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను నిర్దేశించి ఆ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు వంద. ఇందులో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

వెయిటేజీ విధానం

తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తున్నారు. మెయిన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలకు నిర్దేశిత వెయిటేజీలు పేర్కొన్నారు. మెయిన్ పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీని నిర్దేశించారు. మొత్తంగా వంద మార్కులకు వెయిటేజీలను క్రోడీకరించి.. తుది విజేతల జాబితాను సిద్ధం చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్టు 21.
- **ప్రిలిమినరీ పరీక్ష:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **మెయిన్ పరీక్ష:** నవంబర్‌లో జరిపే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ibps.in

రాత పరీక్షల్లో రాణించేలా

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా సాధన చేస్తే ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.
- అభ్యర్థుల్లోని విశ్లేషణ సామర్థ్యం, తులనాత్మకను పరిశీలించే డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు సంబంధించి జాతీయ ఆర్థిక రంగంలో తాజా పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ కోసం బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్స్‌ను చదవడం మేలు చేస్తుంది.
- డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ కోసం కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

15
సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
12-8-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
820	251
79,706	24,368


విదేశీ సూచీలు

నాస్‌డాక్	16,745	▲	85
డోజోన్స్	39,498	▲	51
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,168	▲	23
డాక్స్	17,723	▲	42
షాంఘై	2,862	▼	8
నికాయ్	35,025	▲	194

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.58	84.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.96	108.52
€	యూరో	ఎస్‌బీఐ	90.63	93.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.43	57.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	56.45
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.12	65.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.67



ఇలా చేయకుంటే...

- దరఖాస్తులో పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే
- గత ఆరోగ్య సమాచారం వెల్లడించాలి
- మినహాయింపులపై తగిన అవగాహన
- నియమ, నిబంధనలు తెలిసి ఉండాలి
- ఆస్పత్రిలో చేరికపై సకాలంలో సమాచారం
- లేదంటే చెల్లింపులకు నిరాకరణలు

హెల్త్ క్లెయిమ్ తిరస్కరణ!

అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే.. ఆదుకుంటుందన్న భరోసాతోనే ఎవరైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటారు. తీరా అవసరం వచ్చినప్పుడు బీమా సంస్థ చెల్లింపులకు నిరాకరిస్తే..? పాలసీదారులు కంగుతినాల్సిందే. కరోనా ఆరోగ్య విషయంలో ఎంతో మందికి కళ్లు తెరిపించింది. ఆ ఫలితమే తర్వాత నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా పాలసీ నిబంధనలను కచ్చితంగా తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. పాలసీ నిబంధనలను అర్థం చేసుకోవడంలో లోపం చోటుచేసుకుంటే, భవిష్యత్తులో క్లెయిమ్‌లు తిరస్కరణకు గురయ్యే రిస్క్ కచ్చితంగా ఉంటుంది. దీనివల్ల ఒక్కసారిగా కుటుంబంపై ఆర్థిక భారం పడిపోతుంది. బీమా సంస్థ చెల్లింపులు చేయకపోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. వీటి పట్ల అవగాహన కలిగి ఉంటే, అలాంటి పరిస్థితులను నివారించొచ్చు. ఈ వివరాలు అందించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పాలసీ దరఖాస్తు పత్రంలో అప్పటికే తమకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెల్లడించడం తప్పనిసరి. లేదంటే భవిష్యత్తులో క్లెయిమ్ పరంగా సమస్యలు ఎదురవుతాయి. పాలసీదారు ఆరోగ్య చరిత్ర ఆధారంగానే క్లెయిమ్ రిస్క్‌ను బీమా సంస్థలు అంచనా వేస్తాయి. దానికి అనుగుణంగా ప్రీమియం నిర్ణయిస్తాయి. చెప్పకపోతే బీమా సంస్థకు తెలియదుగా అని చెప్పి కొందరు అనారోగ్య సమస్యలను వెల్లడించరు. ఇది బీమా ఒప్పందాన్ని ఉల్లంఘించినట్టు అవుతుంది. క్లెయిమ్ సమయంలో బీమా సంస్థలు వీటిని గుర్తించినట్టయితే.. చెల్లింపులకు నిరాకరించడంతోపాటు, కవరేజీని సైతం రద్దు చేయొచ్చు. ముందస్తు వ్యాధులనే కాదు, ఏదైనా అనారోగ్యానికి సంబంధించి లోగడ చికిత్స తీసుకున్నా వెల్లడించడమే మంచిది. ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ అయితే, కుటుంబ సభ్యులందరి వైద్య చరిత్రను నమోదు చేయాలి.

సరైన సమాచారం ఇవ్వాలి

బీమా సంస్థకు సమర్పించే ఇన్సూరెన్స్ క్లెయిమ్ పత్రంలో పూర్తి వివరాలు ఉండాలి. తేదీలు, చికిత్సల ప్రక్రియలకు సంబంధించి చిన్న దోషాలు కూడా ఉండకూడదు. రోగి వయసు, పేరులోనూ వ్యత్యాసాలు ఉండకూడదు. బీమా సంస్థలు ప్రతి క్లెయిమ్ దరఖాస్తును లోతుగా పరిశీలిస్తాయి. ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే మరింత సమాచారం కోరడం లేదా తిరస్కరించడం చేయొచ్చు. క్లెయిమ్ వచ్చినప్పుడు, అందులోని వ్యాధి నిర్ధారణ వివరాలను, అప్పటికే పాలసీదారు వైద్య చరిత్రతో పోల్చి చూస్తాయి. హాస్పిటల్ రికార్డులు, డాక్టర్ నోట్‌లను పరిశీలిస్తాయి. ఈ సమయంలో వ్యత్యాసాలు కనిపిస్తే చెల్లింపులను నిరాకరిస్తాయి. పాలసీ పత్రంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి నట్టు గుర్తిస్తే దాన్ని మోసం కింద పరిగణిస్తాయి. దీంతో క్లెయిమ్ రాకపోవడం కాదు, పాలసీ కూడా రద్దు కావచ్చు. అదనపు సమాచారం, వివరణ, డాక్యుమెంట్లను బీమా కంపెనీ కోరొచ్చు. దీంతో నగదు రహిత క్లెయిమ్ కాకుండా రీయింబర్స్‌మెంట్ మార్గంలో రావాలని కోరే అధికారం సైతం బీమా సంస్థకు ఉంటుంది. ముఖ్యంగా రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌కు సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లను సమర్పించడం తప్పనిసరి.

మినహాయింపులు

హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న వారు తమ పాలసీ పరంగా ఉన్న మినహాయింపుల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. దీనివల్ల క్లెయిమ్ పరంగా సమస్యలు రాకుండా ముందే జాగ్రత్త పడొచ్చు. కొన్ని రకాల అనారోగ్యాలు, చికిత్సలు లేదా సేవలకు కొన్ని ప్లాన్లలో కవరేజీ ఉండదు.

నిబంధనల్లో మార్పులు

కొన్ని సందర్భాల్లో పాలసీ నిబంధనలు, ప్రయోజనాల్లో మార్పులు చోటు చేసుకోవచ్చు. అలాంటప్పుడు కూడా క్లెయిమ్‌లకు తిరస్కారం ఎదురవుతుంది. వాస్తవానికి ఇలాంటి వాటి గురించి పాలసీదారులకు బీమా సంస్థలు విధిగా తెలియజేస్తాయి.

సకాలంలో తెలపాలి..

ముందస్తుగా నిర్ణయించుకుని తీసుకునే నగదు రహిత చికిత్సలకు కనీసం 48 గంటల ముందు బీమా సంస్థకు తెలియజేయాలి. అత్యవసర వైద్యం అవసరమై ఆస్పత్రిలో చేరినప్పుడు నగదు రహిత క్లెయిమ్‌కు సంబంధించి 24 గంటల్లోపు బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ పెట్టుకునే వారు సైతం.. ముందస్తు ప్రణాళిక మేరకు తీసుకునే చికిత్సలు అయితే 48 గంటల ముందుగా, అత్యవసరంగా ఆస్పత్రిలో చేరితే 24–48 గంటల్లోపు సమాచారం ఇవ్వాల్సిందే. ఇక రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దరఖాస్తు, డాక్యుమెంట్లను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 30 రోజుల్లోపు సమర్పించాలి. బీమా సంస్థల మధ్య ఈ గడువులో వ్యత్యాసం ఉండొచ్చు.

పాలసీ ల్యాప్స్

పాలసీ ప్రీమియం గడువు మించకుండా చెల్లించాలి. లేదంటే పాలసీ ల్యాప్స్ అవుతుంది. ఇలా ల్యాప్స్ అయిన పాలసీలకు సంబంధించి క్లెయిమ్‌లను బీమా సంస్థలు అనుమతించవు. పాలసీ గడువు ముగిసిన తర్వాత 15–30 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. కనీసం ఈ కాలంలో అయినా ప్రీమియం చెల్లించాలి. లేదంటే పాలసీ రద్దయిపోతుంది. దీంతో బీమా కవరేజీ కోల్పోయినట్టు అవుతుంది. ల్యాప్స్ అయిన పాలసీని పునరుద్ధరించుకునే వరకు కవరేజీ ఉండదు.

అధిక చార్జీలు

ప్రతి బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ జాబితా నిర్వహిస్తుంటుంది. తమ పాలసీదారులకు రాయితీ ధరలపై చికిత్సలు అందించేందుకు వీలుగా ఆస్పత్రులతో బీమా సంస్థలకు ఒప్పందం ఉంటుంది. దీనివల్ల బీమా సంస్థలకు నెట్‌వర్క్ ఆస్పత్రుల వైపు నుంచి క్లెయిమ్‌ల వ్యయాలు తక్కువగా ఉంటాయి. నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చేరినప్పుడు అవి గణనీయమైన చార్జీలు విధించొచ్చు. అలాంటి సందర్భాల్లో నగదు రహిత క్లెయిమ్‌కు బీమా సంస్థలు నిరాకరించి, రీయింబర్స్‌మెంట్ మార్గంలో రావాలని కోరొచ్చు. లేదంటే పూర్తి క్లెయిమ్ కాకుండా పాక్షికంగా చెల్లింపులు చేయొచ్చు. అందుకని నగదు రహిత చికిత్సలు కోరుకునే వారు బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్‌ను ఎంపిక చేసుకోవడం మంచిది.



వెయిటింగ్ పీరియడ్

హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకున్న తర్వాత కొన్ని రకాల క్లెయిమ్‌లకు వెయిటింగ్ పీరియడ్ (వేచి ఉండాల్సిన కాలం) ఉంటుంది. ఆ కాలంలో వచ్చే క్లెయిమ్‌లను బీమా సంస్థలు తోసిపుచ్చుతాయి. హెర్నియా, క్యాటరాక్ట్, చెవి, ముక్కు, గొంతు సమస్యలు (ఈఎన్‌టీ), మోకాలి చిప్ప మార్పిడి తదితర చికిత్సలకు రెండేళ్ల పాటు వెయిటింగ్ ఉంటుంది. అలాగే, పాలసీ తీసుకునే నాటికే ఉన్న వ్యాధులకు సైతం క్లెయిమ్ కోసం నిర్దేశిత కాలం పాటు వేచి ఉండాల్సిందే. ఆ కాలంలో క్లెయిమ్‌లను అనుమతించరు.

కవరేజీ ఖర్చయిపోతే..

ఒక పాలసీ సంవత్సరంలో నిర్దేశిత కవరేజీ మొత్తం వినియోగించుకున్న తర్వాత వచ్చే క్లెయిమ్‌లకు బీమా సంస్థలు చెల్లింపులు చేయవు. అందుకే అన్ లిమిటెడ్ రీస్టోరేషన్ సదుపాయం ఉన్న పాలసీని తీసుకోవాలి. అప్పుడు బీమా ఖర్చయిపోయినా, తిరిగి అంతే మొత్తాన్ని పునరుద్ధరిస్తాయి.

ముందస్తు అనుమతి..

కొన్ని రకాల చికిత్సలకు ముందస్తు ఆమోదం తప్పనిసరి అంటూ బీమా సంస్థ నిబంధనలు విధించొచ్చు. అలాంటి వాటిపై ముందే అవగాహన ఉంటే క్లెయిమ్ నిరాకరణకు నోచుకోదు.

తిరస్కరిస్తే ఏంటీ మార్గం?

బీమా సంస్థ సహేతుక కారణం లేకుండా చెల్లింపులకు నిరాకరిస్తే చూస్తూ ఉండిపోనక్కర్లేదు. పాలసీ నియమ, నిబంధనలను ఒక్కసారి పూర్తిగా అధ్యయనం చేయాలి. 'పాలసీ వర్డింగ్స్'లో పూర్తి వివరాలు ఉంటాయి. క్లెయిమ్ తిరస్కరించడానికి కారణాలు తెలుసుకోవాలి. రిజెక్షన్ లెటర్‌లో ఈ వివరాలు ఉంటాయి. బీమా సంస్థ నిర్ణయం వాస్తవికంగా లేదని భావిస్తే అప్పుడు అప్పీల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బీమా సంస్థలోనూ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ (ఫిర్యాదుల పరిష్కార) విభాగం ఉంటుంది. క్లెయిమ్ నిరాకరించడానికి తగిన కారణాలు లేవంటూ వారికి ఫిర్యాదు సమర్పించాలి. పరిష్కారం లభించకపోతే అప్పుడు బీమా అంబుడ్స్‌మెన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడా న్యాయం జరగకపోతే అప్పుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించొచ్చు. క్లెయిమ్ పూర్తిగా కాకుండా, పాక్షికంగా చెల్లింపులు చేసిన సందర్భాల్లోనూ పాలసీదారులు న్యాయం కోరొచ్చు.

ఐఆర్‌డీఏఐ...

ఐఆర్‌డీఏఐ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సెల్‌ను సంప్రదించొచ్చు. టోల్‌ఫ్రీ నంబర్లు 155255 లేదా 1800 4254 732కు కాల్ చేసి చెప్పొచ్చు. లేదా complaints@irdai.gov.inకు మెయిల్ పంపొచ్చు. లేదా ఐఆర్‌డీఏఐకు చెందిన https://irdai.gov.in/ igms1 పోర్టల్ సాయంతో ఫిర్యాదు దాఖలు చేయవచ్చు.

పరిష్కార వేదికలు

అంబుడ్స్‌మెన్ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చు. వినియోగదారుల కోర్టుకు వెళ్లినా సరే పెద్దగా ఖర్చు కాదు.

భారీ పెట్టుబడులకు ఎల్ఐసీ రెడీ



- స్టాక్స్‌లో ఈ ఏడాది రూ. 1.3 లక్షల కోట్లు
- జూన్‌కల్లా రూ. 15 లక్షల కోట్లకు పెట్టుబడులు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024 –25) దేశీ స్టాక్ మార్కెట్‌లో బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. రూ. 1.3 లక్షల కోట్లను స్టాక్స్‌లో సరికొత్తగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ వెల్లడించారు. ఇప్పటికే ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో రూ. 38,000 కోట్ల పెట్టుబడులు కుమ్మరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 23,300 కోట్ల విలువైన పెట్టుబడులు చేపట్టింది. కాగా.. ఈ క్యూ1లో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులపై రూ. 15,500 కోట్ల లాభం ఆర్జించింది. ఇవి గతేడాది క్యూ4(జనవరి–మార్చి)తో పోలిస్తే 13.5 శాతం అధికంకావడం గమనార్హం. స్టాక్ మార్కెట్ కదలికలు, ధరల్లో మార్పులను నిశితంగా పరిశీలిస్తూ పెట్టుబడి అవకాశాలను వినియోగించుకుంటామని మొహంతీ తెలియజేశారు. కనీసం గతేడాది(రూ. 1.32 లక్షల కోట్లు) స్థాయిలో ఈ ఏడాది పెట్టుబడులను వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జూన్ చివరికల్లా స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ. 15 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించారు. బీమా దిగ్గజం మొత్తం 282 కంపెనీలలో ఇన్వెస్ట్ చేసింది.

ఏఎంసీ జూమ్: జూన్‌కల్లా ఎల్ఐసీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 16 శాతంపైగా ఎగసి రూ. 53,58,781 కోట్లను తాకాయి. గత క్యూ1కు ఇవి రూ. 46,11,067 కోట్లు.

క్యూ1 తీరిలా: క్యూ1లో ఎల్ఐసీ లాభం 10% వృద్ధితో రూ. 10,461 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 1,88,749 కోట్ల నుంచి రూ. 2,10,910 కోట్లకు పెరిగింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్‌కు అంతర్జాతీయ పరిణామాలు కీలకం	చైనా నుంచి ఎఫ్‌డీఐల ఆమోదం వేగవంతం కావాలి

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-8-2024	
విశాఖ	475-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	466-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	445-00
వరంగల్	447-00
రిటైల్ ధర	5.05

హిండెన్‌బర్గ్ ఆరోపణలు... నిరాధారం

కొట్టిపారేసిన సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ • వ్యక్తిత్వ హననమంటూ వ్యాఖ్య • సెబీ చీఫ్‌తో ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవన్న అదానీ

న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ కొట్టిపారేశారు. అదానీ గ్రూప్ సైతం బచ్‌తో తమకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని స్పష్టంచేసింది. కాగా, అదానీ మార్కెట్ అక్రమాల్లో సెబీ చీఫ్ బచ్‌తో పాటు ఆమె భర్త ధవళ్ బచ్‌కు ప్రమేయం ఉందంటూ హిండెన్‌బర్గ్ పెద్ద బాంబ్ పేల్చిన సంగతి తెలిసిందే. బెర్ముడా, మారిషస్‌లలోని అదానీ డొల్ల కంపెనీల్లో వారిద్దరూ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారని పేర్కొంది. ఆ డొల్ల కంపెనీల నిధులనే అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ దొడ్డిదారిన భారత్‌కు తరలించి అదానీ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించారనేది హిండెన్‌బర్గ్ ఆరోపణ. స్వయంగా మార్కెట్ నియంత్రణ సంస్థ చీఫ్‌నే ఈ వివాదంలోకి లాగడంతో దేశవ్యాప్తంగా పెనుదుమారం చెలరేగింది. దీంతో బచ్ దంపతులు సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో చేసిన ఆరోపణలన్నీ ''నిరాధారమైనవి, ఊహాగానాలు'' అంటూ తీవ్రంగా ఖండించారు. వాటిలో ఎలాంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు.



మా జీవితం, పెట్టుబడులు తెరిచిన పుస్తకం...

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తీవ్ర ఆరోపణలను కొట్టిపారేస్తూ... ''మా జీవితం, పెట్టుబడులు తెరిచిన పుస్తకం. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ గతంలో చేసిన ఏ ఆరోపణలపైన అయితే సెబీ చట్టపరమైన చర్యలు చేపట్టి, షోకాజ్ నోటీసులు జారీ చేసిందో, అదే సంస్థ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరం' అని బచ్ దంపతులు పేర్కొన్నారు. తమ ఆర్థికపరమైన డాక్యుమెంట్లన్నింటినీ నిస్సంకోచంగా బయటపెట్టేందుకు సిద్ధమని, అలాగే ప్రైవేటు పౌరులుగా ఉన్నప్పటి కాలానికి సంబంధించిన ఆర్థిక వివరాలన్నింటినీ ఏ ప్రభుత్వ సంస్థ కోరినా ఇస్తామని వారు తేల్చిచెప్పారు. కాగా, అదానీల అక్రమాల్లో స్వయంగా సెబీ చీఫ్‌కు సంబంధాలుండటం వల్లే తాము బయటపెట్టిన అవకతవకలపై లోతుగా విచారణ చేపట్టేందుకు సెబీ నిరాకరించిందని హిండెన్‌బర్గ్ పేర్కొనడం గమనార్హం. మరోపక్క, అదానీ గ్రూప్‌పై ఆరోపణలన్నింటినీ తాము సక్రమంగా దర్యాప్తు చేశామని సెబీ స్పందించింది. విచారణ దాదాపు కొలిక్కి వచ్చిందని తెలిపింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన అన్ని అంశాలను చైర్‌పర్సన్ మాధవీ పురి బచ్ ఎప్పటికప్పుడు బహిర్గతం చేశారని కూడా పేర్కొంది.

హిండెన్‌బర్గ్ ఏం చేస్తుంది?

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అనేది అమెరికాకు చెందిన ఇన్వెస్టర్ల తరఫున గొంతెత్తే చిన్న రీసెర్చ్ సంస్థ. కొంతమంది రీసెర్చర్ల సహకారంతో 2017లో దీన్ని నాథన్ ఆండర్సన్ నెలకొల్పారు. బాగా పేరొందిన కంపెనీల్లో అకౌంటింగ్ అవకతవకలు, ఇతరత్రా కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలను గుర్తించేందుకు ఫైనాన్షియల్ ఫోరెన్సిక్ సాధనాలను ఉపయోగించి అధ్యయనం చేస్తుంది. గతంలో కూడా నికోలా, క్లోవర్ హెల్త్, బ్లాక్ ఇంక్, కాండీ, లార్డ్స్‌టౌన్ మోటార్స్ వంటి కంపెనీలను ఇది టార్గెట్ చేసింది.

బిజినెస్ మోడల్ ఇదీ.. అవకతవకలపై రీసెర్చ్ నివేదికలను క్లయింట్లకు ఇస్తుంది. నివేదికను పబ్లిక్‌గా బహిర్గతం చేయడానికి ముందే క్లయింట్లు, హిండెన్‌బర్గ్ కూడా ఆయా కంపెనీల షేర్లలో షార్ట్ పొజిషన్లు (ముందుగా షేర్లను అమ్మేసి, బాగా పడిన తర్వాత తిరిగి కొనుగోలు చేయడం ద్వారా సొమ్ము చేసుకోవడం) తీసుకుంటారు. రిపోర్ట్ వెలువడిన తర్వాత సదరు కంపెనీ షేర్లు భారీగా పడిపోవడంతో ఇరువురికీ భారీగా లాభాలొస్తాయి. అదానీ షేర్ల విషయంలో కూడా ఇదే జరిగింది. కాగా, అదానీ ఉదంతంలో తమకు కేవలం 4.1 మిలియన్ డాలర్లు మాత్రమే లభించాయని, రెండేళ్ల పాటు ప్రపంచవ్యాప్తంగా తమ రీసెర్చ్, విచారణ కోసం వెచ్చించిన భారీ మొత్తంతో పోలిస్తే తమకు పెద్దగా ఒరిగిందేమీ లేదని హిండెన్‌బర్గ్ చెప్పడం విశేషం!

బ్లాక్‌స్టోన్‌లో ధవళ్ పదవిపై...

బ్లాక్‌స్టోన్ రియల్టీ కార్యకలాపాలతో ధవళ్ బచ్‌కు ఎలాంటి సంబంధం లేదని బచ్ దంపతుల ప్రకటన పేర్కొంది. సెబీ చైర్‌పర్సన్‌గా బచ్ నియామకానికి ముందే 2019లో ధవళ్ బచ్‌ను బ్లాక్‌స్టోన్ తమ సీనియర్ అడ్వయిజర్‌గా నియమించుకుందని ప్రకటన స్పష్టం చేసింది. సప్లయి చైన్ మేనేజ్‌మెంట్‌లో ధవళ్ నైపుణ్యం ఆధారంగానే ఆయనకు ఆ పదవి దక్కిందని పేర్కొంది. రియల్టీ, రీట్‌లపై సెబీ తీసుకున్న నిర్ణయాలు, సంప్రదింపుల ప్రక్రియ అనంతరం బోర్డు ఆమోదం మేరకే జరిగాయని, చైర్‌పర్సన్ ఒక్కరే ఆ నిర్ణయాలు తీసుకోలేదని కూడా వారు వివరణ ఇచ్చారు.



బచ్‌పై ఆరోపణలు ఇవీ...



'2017లో సెబీలో హోల్‌టైమ్ మెంబర్‌గా బచ్ నియామకానికి ముందే 2015లో బచ్ దంపతులు ఈ అదానీ డొల్ల కంపెనీల్లో (బెర్ముడాకు చెందిన గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్) ఇన్వెస్ట్ చేశారు. సింగపూర్‌లోని ఐపీఈ ప్లస్ ఫండ్ 1లో (ఇది మారిషస్ ఆఫ్‌షోర్ ఫండ్) వారు తొలుత ఖాతా తెరిచారు. దీనికి సంబంధించిన సంస్థలు అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో ట్రేడింగ్ చేస్తుండేవి. ఇండియా ఇన్ఫోలైన్ (ఐఐఎఫ్ఎల్) మేనేజ్ చేసిన ఈ వెల్త్ మేనేజ్‌మెంట్ ఫండ్స్‌లో వినోద్ అదానీకి కూడా పెట్టుబడులు ఉన్నాయి. అందులో ఆయన డైరెక్టర్ కూడా. 2022లో బచ్ సెబీ చైర్‌పర్సన్ అయ్యారు. దీంతో అదానీకి చెందిన మారిషస్, ఇతరత్రా డొల్ల కంపెనీలపై దర్యాప్తును సెబీ పెద్దగా పట్టించుకోలేదు. అదానీ గ్రూప్‌నకు పవర్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో ఇన్వాయిస్‌లను పెంచి చూపడం ద్వారా విదేశీ డొల్ల కంపెనీలకు పక్కదారి పట్టించిన నిధులను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ భారత్ స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఉపయోగించుకున్నారు' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. కాగా, తమ ఐపీఈ ప్లస్ ఫండ్ 1 అదానీ గ్రూప్ షేర్లలో ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదని 360 వన్ (గతంలో ఐఐఎఫ్ఎల్ వెల్త్) స్పష్టం చేసింది. 2013 అక్టోబర్–2019 అక్టోబర్ మధ్య నిర్వహించిన తమ ఫండ్‌లో బచ్ దంపతులు చేసిన పెట్టుబడులు మొత్తం నిధుల్లో 1.5 శాతం కంటే తక్కువేనని, పెట్టుబడి నిర్ణయాల్లో ఇన్వెస్టర్ల ప్రమేయం ఏదీ లేదని కూడా పేర్కొంది.

దురుద్దేశపూరితం: అదానీ



హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలను అదానీ గ్రూప్ కూడా తీవ్రంగా తోసిపుచ్చింది. 'చట్టాలు, వాస్తవాలను బేఖాతరు చేస్తూ, స్వలాభం కోసం ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చి, బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని దురుద్దేశపూరితంగా, ఊహాజనితంగా, తారుమారు చేసే విధంగా మార్చిన నివేదిక' అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించిన సమాచారంలో అదానీ గ్రూప్ పేర్కొంది. మా ప్రతిష్ఠను దిగజార్చే ఈ ఉద్దేశపూర్వక ప్రయత్నంలో పేర్కొన్న వ్యక్తులతో గానీ, అంశాలతో గానీ అదానీ గ్రూప్‌నకు ఎలాంటి వ్యాపారపరమైన సంబంధాలు లేవని స్పష్టం చేసింది. పారదర్శకతకు తాము కట్టుబడి ఉన్నామని, చట్టపరమైన, నియంత్రణ సంస్థల నిబంధలనకు అనుగుణంగానే నడుచుకుంటున్నామని తేల్చిచెప్పింది. 'పూర్తిగా దర్యాప్తు చేసిన, నిరాధారమని నిరూపితమైన, 2023లో సుప్రీం కొట్టేసిన అవే ఆరోపణలను హిండెన్‌బర్గ్ పదేపదే తిరగదోడుతోంది. భారతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, తప్పుదోవ పట్టించేలా ఆ సంస్థ కావాలనే ఈ ఆరోపణలు గుప్పిస్తోంది' అని పేర్కొంది.

జరిగింది ఇదీ...



అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో విదేశీ కంపెనీలకు భారీ వాటాలపై పెద్దయెత్తున ఆరోపణలు రావడంతో సెబీ 2020 అక్టోబర్‌లో దర్యాప్తు మొదలుపెట్టింది. అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు నిజమైన పబ్లిక్ షేర్‌హోల్డర్లా.. లేదంటే ప్రమోటర్లకు సంబంధించి బినామీలుగా వ్యవహరిస్తున్నారా అనేది తేల్చడమే ఈ దర్యాప్తు ప్రధానోద్దేశం. కాగా, గతేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ తొలిసారిగా అదానీ అక్రమాలపై విడుదల చేసిన నివేదిక సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకోవడమే కాకుండా, అకౌంటింగ్ మోసాలకు కూడా పాల్పడిందని ఆరోపణలు గుప్పించింది. దీంతో అదానీ షేర్లు కుప్పకూలడం, 150 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరయ్యేందుకు దారితీసింది. కాగా, షేర్ల ధరల భారీ పతనం, అవకతవకలపై సుప్రీం కోర్టు సెబీతో మరో దర్యాప్తునకు ఆదేశించడంతో పాటు నియంత్రణపరమైన ఉల్లంఘనల నిగ్గు తేల్చాల్సిందిగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, అన్నీ సక్రమంగానే ఉన్నాయంటూ కమిటీ నివేదిక ఇవ్వడం గమనార్హం. దీంతో సెబీ చేస్తున్న దర్యాప్తు సరిపోతుందని, సీబీఐ, సిట్ వంటి సంస్థలకు అప్పగించాల్సిన అవసరం లేదని సుప్రీం స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ ఆరోపణల తర్వాత కోల్పోయిన మార్కెట్ విలువను అదానీ గ్రూప్ షేర్లు పూర్తిగా తిరిగి చేజిక్కించుకుని దూసుకుపోతుండం విశేషం. గత నెలలో కోటక్ మహీంద్రా బ్యాంక్‌ను సైతం హిండెన్‌బర్గ్ ఈ వివాదంలోకి లాగింది. అదానీ డొల్ల కంపెనీలతో ఆ బ్యాంకుకు సంబంధాలున్నాయని ఆరోపించింది. అయితే, కోటక్ బ్యాంక్ కూడా దీన్ని ఖండించింది. కాగా, వాస్తవాలను దాచిపెడుతూ, సంచలనం కోసమే హిండెన్‌బర్గ్ అదానీపై ఆరోపణలు చేసిందని, అదానీ షేర్ల పతనం ద్వారా లాభపడేందుకు అది న్యూయార్క్ హెడ్జ్ ఫండ్‌తో కుమ్మక్కయిందని పేర్కొంటూ గత నెల 26న సెబీ హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఏకంగా సెబీ చీఫ్‌నే ఈ వివాదంలోకి లాగడం కొత్త ట్విస్ట్.

వర్ణశోభిత దివ్య ఔషధం
'అగ్నిశిఖ'



ప్రకృతి ప్రసాదితమైన నల్లమల్ల అడవులు వర్షాలు కురిసే ఆగస్టు మాసంలో విరబూసిన వివిధ రకాల పుష్పాలతో అందాల హరివిల్లుగా మారుతాయి. వనమూలికల వృద్ధికి దోహదపడతాయి. ఆయుర్వేదంలో విశేష ప్రాముఖ్యత ఉన్న అగ్నిశిఖ మొక్క ఇక్కడే విశేషంగా పెరుగుతోంది. వర్ణశోభితంగా కనువిందు చేస్తోంది. అడవి నాభి అని కూడా పిలిచే ఈ మొక్క ఇంగ్లిషులో గ్లోరీ లిల్లిగా ప్రసిద్ధి. ఈ మొక్క నిలువెల్లా విషమే. అయితే వైద్యుల సూచనలతో వినియోగించుకుంటే దివ్య ఔషధమే అవుతుంది. గ్లోరియోసా సూపర్బా అని కూడా పిలిచే ఈ మొక్కలో కోల్చిసీన్, గ్లోరియోజిన్ అనే రెండు ఆల్కలాయిడ్స్ ఉంటాయి. వీటి వల్ల ఈ మొక్క అత్యున్నత ఔషధంగా ప్రసిద్ధి చెందింది. పాము విషాన్ని సైతం విరుగుడు చేయవచ్చు అని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. ఈ పుష్పం జింబాబ్వే జాతీయ పుష్పంగా ఉంది. తమిళనాడు రాష్ట్రానికి కూడా అధికార పుష్పం కావడం విశేషం.

- ఆత్మకూరు రూరల్

'గుండె'ను వీడని గమనం 'కంటి'ని వదలని జ్ఞాపకం

గుండె, కిడ్నీలు అమర్చుకున్న వారిలో.. వాటి 'ఓనర్ల' జ్ఞాపకాలు, అలవాట్లు

ఓ పాత సినిమా.. కంటిచూపు దెబ్బతిన్న ఒక యువకుడికి, అంతక్రితమే మరణించిన మరో వ్యక్తి కళ్లను అమర్చుతారు.. ఆపరేషన్ సక్సెస్.. యువకుడికి చూపు బ్రహ్మాండంగా వచ్చేస్తుంది.. కానీ తరచూ ఎవరో వచ్చి తనను కత్తితో పొడుస్తున్నట్టుగా కళ్ల ముందు ఏదో దృశ్యం తారాడుతూ ఉంటుంది.. నిజానికి ఆ కళ్లకు సంబంధించిన వ్యక్తి చనిపోవడానికి కారణమైన ఘటన అది. ఇదంతా జస్ట్ సినిమాటిక్ ఫిక్షన్, అవయవాల్లో అలా జ్ఞాపకాలేవీ నిక్షిప్తమయ్యే అవకాశమే లేదన్నది ఇటీవలి వరకు ఉన్న భావన. కానీ ఎవరి అవయవాలనైనా మరొకరికి అమర్చినప్పుడు.. వారి లక్షణాలు, అలవాట్లు కూడా వస్తాయని ఓ అధ్యయనంలో తేలింది. అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు ఈ అంశంపై పరిశోధన చేశారు.

సెల్యులార్ మెమొరీతోనే ఇదంతా!

శరీరంలో అన్ని కణాలకు కొంత జ్ఞాపకశక్తి ఉంటుందన్న 'సెల్యులార్ మెమొరీ' సిద్ధాంతాన్ని కొలరాడో వర్సిటీ శాస్త్రవేత్తలు తెరపైకి తెస్తున్నారు. ప్రతి వ్యక్తికి సంబంధించి కిడ్నీలు, గుండె, కళ్లు... వంటి వాటిలో.. వారి శారీరక, మానసిక లక్షణాల జ్ఞాపకాలు ఉంటాయని చెప్తున్నారు. వేరేవారికి ఈ అవయవాలు అమర్చినప్పుడు వారిని ఈ 'సెల్యులార్ మెమొరీ' ప్రభావితం చేస్తుందని.. అందుకే వారిలో కొత్త లక్షణాలు, అలవాట్లు కనిపిస్తాయని అంటున్నారు. మన కంప్యూటర్‌లో ఆపరేటింగ్ సిస్టమ్‌ను అప్‌డేట్ చేసుకుంటే కొత్త ఆప్షన్లు అందుబాటులోకి వచ్చినట్టుగా.. దీనిని పోల్చుకోవచ్చని చెప్తున్నారు.


ఆగస్టు 13న వరల్డ్ ఆర్గాన్ డోనర్స్ డే సందర్భంగా

- సాక్షి సెంట్రల్ డెస్క్

అవయవ మార్పిడికి ముందు, తర్వాత..

శాస్త్రవేత్తలు యూనివర్సిటీ పరిధిలోని ఆస్పత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న 47 మందిని స్టడీకి ఎంచుకున్నారు. ఇందులో కిడ్నీ, లివర్ నుంచి గుండె మార్పిడి వరకు చేయించుకున్నవారు ఉన్నారు. వారిలో అవయవ మార్పిడికి ముందు, తర్వాత ఉన్న అలవాట్లు, లక్షణాలను నమోదు చేశారు. అవయవ మార్పిడి తర్వాత ఎదుర్కొన్న అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నో చిత్రమైన అంశాలు వెల్లడయ్యాయి.

డ్యూటీలో ఉన్న ఓ పోలీస్ ఆఫీసర్‌ను నేరస్తులు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపేశారు. అతడి గుండెను ఓ యువకుడికి అమర్చారు. అవయవ మార్పిడి తర్వాత తరచూ తనను ఎవరో దగ్గరి నుంచి కాల్చేస్తున్నట్టుగా కలలు వస్తున్నాయని.. బుల్లెట్ తాకినట్టుగా నుదుటిపై తీవ్రంగా నొప్పికూడా వస్తోందని ఆ యువకుడు డాక్టర్లకు చెప్పాడు.

ఓ మూడేళ్ల పిల్లాడికి పవర్ రేంజర్స్ బొమ్మలంటే చాలా ఇష్టం. ఎప్పుడూ వాటితోనే ఆడుకునేవాడు. కానీ అతడికి గుండె మార్పిడి శస్త్రచికిత్స చేశాక.. ఒక్కసారిగా ఆ బొమ్మలను దూరం పడేయడం మొదలుపెట్టాడు. చిత్రమేంటంటే.. అతడికి అమర్చిన గుండె ఓ ఏడాదిన్నర చిన్నారిది. పవర్ రేంజర్స్ బొమ్మలను అందుకోవడానికి ప్రయత్నిస్తూ.. కిటికీ నుంచి పడిపోయి చనిపోయాడు.

ఇవే కాదు. ఆపరేషన్‌కు ముందు వరకు ఎంతో ప్రశాంతంగా ఉండే వ్యక్తి.. తర్వాత తీవ్రంగా కోపతాపాలకు, తీవ్ర భావోద్వేగాలకు గురవడాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. మరోవైపు ఎప్పుడూ మూడీగా ఉండే కొందరు.. ఆపరేషన్ తర్వాత యాక్టివ్‌గా మారడం, అందరితో చనువుగా ఉండటాన్ని గుర్తించారు. ఒక్కసారిగా కొత్త అలవాట్లు రావడం, అప్పటివరకు ఇష్టంగా చేసిన పనులు అసలే నచ్చకపోవడం, ఆధ్యాత్మిక నమ్మకాల్లోనూ మార్పులు రావడం వంటివీ గమనించారు.


వినీలాకాశంలో మెరుస్తున్న పాలపుంత వెలుగుల కింద.. పాల నురగలతో లోయలోకి దూకుతున్న పాలోస్ నది చిత్రమిది. అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో ఉన్న పాలోస్ ఫాల్స్ జలపాతం వద్ద కీత్ మార్ష్ అనే ఫొటోగ్రాఫర్ దీనిని క్లిక్‌మనిపించారు. ప్రఖ్యాత రోటరీ మేగజైన్ నిర్వహించిన 'విజన్ క్వెస్ట్-2024' అవార్డుల్లో ఈ చిత్రం మొదటి బహుమతి గెలుచుకుంది.

బూట్లలో కోటి విలువైన బంగారం


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత



శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడు తనిఖీలు పూర్తి చేసుకున్న తర్వాత అంతర్జాతీయ ప్రవేశద్వారం వద్ద నుంచి బయటికి వచ్చేశాడు. అప్పటికే ముందస్తు సమాచారంతో అక్కడికి చేరుకున్న డీఆర్ఐ అధికారులు అతడిని తనిఖీ చేయగా బ్యాగ్‌కు ఉన్న మెటల్‌చైన్‌తోపాటు బూట్లలో ఉన్న చైన్‌లో కూడా బంగారాన్ని గుర్తించారు. అతడి వద్ద నుంచి రూ.1 కోటి విలువైన 1,390 గ్రాముల బంగారాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

టుడేస్ గ్రాఫిక్..

ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సెర్చ్ ఇంజన్ల మార్కెట్ షేర్(జూలై 2024)



'నెమలి కర్రీ' వీడియోతో బుక్కయ్యాడు

యూట్యూబర్‌ను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు..

వండిన కూర సీజ్, పోలీసులకు ఫిర్యాదు


వంట చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): 'ట్రెడిషనల్ పికాక్ కర్రీ రెసిపీ' అంటూ ఓ యూట్యూబర్ తన చానల్‌లో వీడియో పోస్టు చేసి అడ్డంగా బుక్కయ్యాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్ శ్రీటీవీ అనే యూట్యూబ్ చానల్‌లో నెమలి వంట చేయడం గురించి వీడియో పోస్టు చేశాడు. ఈ విషయంపై 'యూట్యూబ్‌లో నెమలికూర వంటకం' అనే శీర్షికతో 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అటవీ అధికారులు స్పందించారు. తంగళ్లపల్లిలో వంట చేసిన స్థలాన్ని పరిశీలించి, ప్రణయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి కల్పనాదేవి మాట్లాడుతూ, వంటకాన్ని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నెమలి పేరుతో వీడియో పెట్టినందుకు అటవీచట్టం ప్రకారం కేసు నమోదు చేశామని, పలు అటవీ జంతువులు, పక్షుల వంటకాల వీడియోలు కూడా పోస్టు చేసినట్లు గుర్తించామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీలలో ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రవణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ఎంఏ ఖలీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

పొడుగూ సీట్లూ ఎక్కువే..

డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌ల కంటే రెండు మీటర్ల పొడవు, 8 సీట్లు ఎక్కువ

హైదరాబాద్‌లో పలు రూట్లలో సెమీ డీలక్స్ ప్రారంభం

'ఉచిత ప్రయాణ' వసతితో తగ్గిన టికెట్ ఆదాయం పెంచుకునే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటుతో కోల్పోయిన రోజువారీ టికెట్ ఆదాయాన్ని కొంతమేర తిరిగి రాబట్టుకునేందుకు ఉద్దేశించిన సెమీ డీలక్స్ కేటగిరీ బస్సులను ఆర్టీసీ రోడ్డెక్కించింది. ప్రయోగాత్మకంగా మూడు నెలల పాటు ఈ కేటగిరీ బస్సులను తిప్పి ప్రయాణికుల స్పందనను పరిశీలించాలని నిర్ణయించింది. తొలుత నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బస్సులను ప్రారంభించారు. కొత్త బస్సులు సమకూరే కొద్దీ ఇతర జిల్లాలకు పంపనున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్ నగరంలో కొత్తగా మెట్రో డీలక్స్ కేటగిరీ బస్సులను ప్రారంభించారు. నగరంలో 125 బస్సులను వివిధ మార్గాల్లో నడపబోతున్నారు. ఇప్పటికే 24 బస్సులను.. 300, 1హెచ్, 49ఎం, 3కే, 16ఏ రూట్లలో ప్రారంభించారు.



ప్రయాణికుల్లో అయోమయం..

ప్రస్తుతం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు కొనసాగుతోంది. నగరంలో ఈ కేటగిరీ బస్సులే ఎక్కువగా ఉంటాయి. మెట్రో లగ్జరీ పేరుతో నడిచే ఏసీ బస్సులు చూడగానే గుర్తించేలా ఉండటంతో.. మహిళలకు వేటిలో ఉచితం, ఏ తరహా బస్ పాస్‌లు చెల్లుబాటు అవుతాయన్న స్పష్టత ఉంది. అయితే కొత్తగా ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ బస్సులు కూడా ఎక్స్‌ప్రెస్‌లే అనుకుని ఉచితంగా ప్రయాణించేందుకు ఎక్కుతున్నారు. కాదని తెలిశాక దిగిపోతున్నారు. ఈ కేటగిరీ బస్సులపై ప్రచారం లేకపోవటమే దీనికి కారణం. జిల్లాల్లో ప్రారంభమైన సెమీ డీలక్స్‌ల విషయంలోనూ ఇదే తరహా గందరగోళం ఏర్పడుతోంది. ప్రస్తుతం అవి తక్కువ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి.

కనీస చార్జీ రూ.30

హైదరాబాద్‌లో రోడ్డెక్కిన మెట్రో డీలక్స్ బస్సులు పూర్తిగా కొత్తవి. కంపెనీ నుంచి కొత్త ఛాసిస్‌లు మాత్రమే కొని బస్ బాడీని విడిగా తయారు చేయించినవి. కానీ జిల్లాల్లో తిరిగే సెమీ డీలక్స్‌లు మాత్రం పాత బస్సులే. ఆర్టీసీ పాతబడిపోయిన రాజధాని బస్సులను ఒక్కొక్కటిగా తొలగిస్తూ.. వాటి స్థానంలో కొత్త బస్సులను చేరుస్తోంది. తొలగించిన పాత రాజధాని బస్సుల బాడీ తొలగించి.. వాటి ఛాసిస్‌లపై కొత్తగా సెమీ డీలక్స్ బస్ బాడీలను ఏర్పాటు చేయిస్తోంది. సాధారణంగా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు 10 మీటర్ల పొడవు ఉంటే.. రాజధాని ఏసీ బస్సులు 12 మీటర్ల పొడవు ఉంటాయి. వాటినే సెమీ డీలక్స్‌గా మార్చుతున్నందున.. పొడవుకు అనుగుణంగా సీట్ల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. అంటే డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 51 సీట్లే ఉంటే.. సెమీ డీలక్స్‌లలో 59 సీట్లు వస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ తరహాలో సెమీ డీలక్స్ బస్సుల్లో 3 ప్లస్ 2 పద్ధతిలో సీట్లు ఏర్పాటు చేశారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సాధారణ రెగ్జిన్ సీట్లు ఉంటే.. సెమీ డీలక్స్‌లలో ఫ్యాబ్రిక్ సింగిల్ సీట్లను ఏర్పాటు చేశారు. ఇవి చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లాగే సెమీ డీలక్స్ కనీస చార్జీని రూ.30గానే నిర్ధారించినా.. తదుపరి ప్రతి కిలోమీటర్‌కు 11 పైసల చొప్పున ఎక్స్‌ప్రెస్‌ల కంటే అదనంగా చార్జీ ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీ 280 డీలక్స్ బస్సులను తిప్పుతోంది. అవి లేని మార్గాల్లో సెమీ డీలక్స్ బస్సులు తిరుగుతాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీట్ల కోసం నిత్యం కుస్తీలు పట్టాల్సి వస్తున్నందున.. పురుష ప్రయాణికులు, కొంతమేర మహిళలు ఖాళీగా, కొత్తగా కనిపించే సెమీ డీలక్స్ బస్సుల వైపు మళ్లుతారని ఆర్టీసీ భావిస్తోంది.

మ్యూల్ ఖాతాలతో ముప్పు తప్పదు

డబ్బుల కోసం సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు అద్దెకిస్తున్న కొందరు



సాక్షి, హైదరాబాద్: సులువుగా డబ్బు వస్తుందన్న ఆశతో కొందరు ఎరక్కపోయి సైబర్ నేరగాళ్ల వలలో ఇరుక్కుంటున్నారు. వారి వ్యక్తిగత వివరాలు, సమాచారంతో తెరిచిన బ్యాంకు ఖాతాలను ఇతరులు వాడుకునేందుకు అద్దెకు (ఇలాంటి బ్యాంకు ఖాతాలను మ్యూల్ బ్యాంక్ అకౌంట్‌గా చెబుతారు) ఇస్తున్నారు. సైబర్ నేరగాళ్లు తమ ఉనికి పోలీసులకు తెలియకుండా ఉండేందుకు తాము కొల్లగొట్టిన సొమ్మును జమ చేసేందుకు ఇలాంటి మ్యూల్ అకౌంట్లు వాడుతున్నట్టు పోలీసులు తెలిపారు. కొందరు కమీషన్ల కోసం ఆశపడి సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలు అద్దెకు ఇస్తున్నారని, ఇది పెద్ద నేరమన్న విషయమూ కొందరికి తెలియడం లేదంటున్నారు. ఈ తరహాలోనే ఒక నిందితుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఇటీవలే అరెస్టు చేశారు. 'మీ బ్యాంకు ఖాతా వివరాలు మాకు ఇస్తే..ప్రతి నెలా మీకు కొంత డబ్బు వస్తుంది..ఇంట్లో కూర్చునే సంపాదించుకోండి..' అంటూ సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తున్నారు. ఇది మోసమని తెలియని కొందరు తమ బ్యాంకు వివ రాలు, ఆన్‌లైన్ పిన్‌నంబర్లు సైబర్ నేరగాళ్లతో పంచుకుంటున్నారు. అలాంటి ఖాతాల్లోకి సైబర్ నేరగాళ్లు డబ్బులు జమ చేస్తూ..వారికి అనుకూలంగా సైబర్ నేరాలకు ఈ మ్యూల్ అకౌంట్లు వాడుతున్నట్టు తాము గుర్తించామని, మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు తెరవడం. లేదా వాటిని నిర్వహించడం చట్టప్రకారం నేరం అని అధికారులు హెచ్చరించారు. అలాంటి బ్యాంకు ఖాతాల్లో జరిగే అనుమానాస్పద లావాదేవీలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లకు ఏ శిక్ష ఉంటుందో అదే శిక్షలు బ్యాంకు ఖాతాలు ఇచ్చేవారు సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సింహభాగం స్వల్ప వేతన జీవులే!

దేశంలో 68 శాతం మంది రూ.20 వేలలోపు జీతగాళ్లే..

దేశవ్యాప్తంగా పెరుగుతున్న నిరుద్యోగిత.. కేంద్ర నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో ఉద్యోగుల జీతాలు అరకొరగానే ఉంటున్నాయని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. దేశంలో నెల జీతం మీద ఆధారపడుతున్న వారిలో దాదాపు 68 శాతం మంది నెలకు రూ.20 వేల లోపు జీతగాళ్లేనని కూడా తెలిపింది. కేంద్ర గణాంక శాఖ 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(పీఎల్ఎఫ్ఎస్) తాజా నివేదిక దేశవ్యాప్తంగా నిరుద్యోగిత పెరుగుతోందని కూడా పేర్కొంది. ఉద్యోగుల జీతాలపై కీలక అంశాలను వెల్లడించింది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు, అసంఘటిత రంగాల్లో కలిపి దేశం మొత్తం మీద 8.50 కోట్ల మంది నెల జీతం మీద ఆధారపడి జీవిస్తున్నారని ఆ నివేదిక తెలిపింది. అలాగే, దేశంలో నిరుద్యోగిత క్రమంగా పెరుగుతోందని పీఎల్ఎఫెస్ నివేదిక తెలిపింది. దేశంలో 27 రంగాల్లో ఉద్యోగ కల్పన పరిస్థితులను విశ్లేషించి నివేదిక వెల్లడించింది. ఆ ప్రకారం 2022-23 కంటే 2023-24లో దేశంలో 4.66 కోట్ల మంది నిరుద్యోగులు పెరిగారు.

దేశంలో నెల జీతం ప్రాతిపదికన విభజన ఇలా ఉంది..

నెల జీతం (రూ.లలో)	పొందుతున్నవారు (శాతం)
10 వేలలోపు	29.7
10 వేల నుంచి రూ.20 వేలు	38.9
20 వేల నుంచి రూ.30 వేలు	11.1
30 వేల నుంచి రూ.40 వేలు	7.6
40 వేల నుంచి రూ.50 వేలు	5.3
50 వేల నుంచి రూ.70 వేలు	4.7
70 వేల నుంచి రూ.3.50 లక్షలు	2.6

దేశంలో ఏటా పెరుగుతున్న నిరుద్యోగులు కోట్లలో

సంవత్సరం	నిరుద్యోగులు
2022-23	59.67
2024-24	64.33

'విదేశీ విద్య'కు నిధి ఏది?

సాక్షి, హైదరాబాద్: విదేశీ విద్యానిధి బకాయిల చెల్లింపులపై నీలినీడలు కమ్ముకున్నాయి. బకాయిలు రూ.100 కోట్లకు పైగా ఉండగా, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.80 కోట్లే కేటాయించారు. దీంతో బకాయిల చెల్లింపుల ప్రక్రియ అటకెక్కినట్టేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం కింద అర్హత సాధించి విదేశాలకు వెళ్లి కోర్సు పూర్తి చేసినా, ఆ విద్యార్థులకు ఇంకా రెండోవిడత ఆర్థికసాయం అందనే లేదు. 2019-20 వార్షిక సంవత్సరం నుంచి విద్యానిధి నిధుల విడుదల నెమ్మదించింది. దీంతో బీసీ సంక్షేమశాఖ తనవద్ద ఉన్న నిధుల లభ్యతకు అనుగుణంగా విద్యార్థులకు మొదటివిడత సాయాన్ని అందిస్తూ రాగా... క్రమంగా రెండోవిడత సాయం అందలేదు. కోర్సు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం రెండోవిడత ఇవ్వకపోవడంతో ఆయా విద్యార్థులు దీనిపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది.

నల్లగొండ జిల్లాకు చెందిన స్వాతి (పేరుమార్చాం) 2019-20 సంవత్సరంలో విద్యానిధి పథకానికి అర్హత సాధించి అమెరికాకు వెళ్లి ఎంఎస్ చేసింది. మొదటి సంవత్సరం పూర్తయిన తర్వాత సర్టిఫికెట్లు అన్నీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి అధికారులను పలుమార్లు సంప్రదిస్తే తొలివిడత సాయం కింద రూ.10 లక్షలు అందాయి. రెండో సంవత్సరం కోర్సు పూర్తి చేసి దాదాపు మూడు సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటివరకు రెండో విడత సాయం రూ.10 లక్షలు ఇంకా అందలేదు. ఇప్పటివరకు దాదాపు ఇరవైసార్లు బీసీ సంక్షేమ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా, ఎప్పుడిస్తారనే దానిపై సరైన సమాధానం రాలేదు.



బీసీ సంక్షేమశాఖలో బకాయిలు రూ.100 కోట్లకుపైనే..

2024-25 వార్షికబడ్జెట్‌లో ఈ పథకానికి రూ.80 కోట్ల కేటాయింపు

నాలుగేళ్లుగా బిల్లులన్నీ పెండింగ్‌లోనే..

ఏటా రూ.60 కోట్లు కేటాయిస్తున్నా..

విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించే బీసీ పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద అర్హత సాధించిన విద్యార్థి ఉన్నతవిద్య చదివేందుకు ఆర్థికసాయం కింద గరిష్టంగా రూ.20 లక్షలు అందిస్తుంది. ఈ మొత్తాన్ని విద్యార్థి తిరిగి చెల్లించాల్సిన పనిలేదు. ప్రతి సంవత్సరం ఈ పథకం కింద 300 మందికి సాయం చేసేలా విద్యార్థుల అర్హతలను గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే రెండు వాయిదాల్లో రూ.10లక్షల చొప్పున ప్రభుత్వం జమ చేసేది. అయితే నాలుగేళ్లుగా ఈ పథకానికి నిధుల విడుదల తగ్గిపోయింది. ఏటా ఈ పథకం కింద రూ.60 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తున్నా, వార్షిక సంవత్సరం పూర్తయ్యే నాటికి నిధుల విడుదల మాత్రం పూర్తిస్థాయి లో జరగడం లేదు. ఫలితంగా బకాయిలు పేరుకుపోయాయి. 2019-20 వార్షిక సంవత్సరం నుంచి పూర్తి స్థాయి నిధులివ్వకపోవడంతో ఇప్పటివరకు రూ.100 కోట్లు బకాయిలున్నట్టు బీసీ సంక్షేమశాఖ వర్గాలు చెబుతున్నాయి.

నిధుల లభ్యతను బట్టి మంజూరు..

విద్యానిధి పథకం కింద ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖకు ఏటా రూ.60కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తుంది. కానీ వార్షిక సంవత్సరం ముగిసే నాటికి కేటాయించిన బడ్జెట్‌లో అరకొరగానే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఈ క్రమంలో అర్హత సాధించిన విద్యార్థులకు తొలివిడత కింద రూ.10లక్షలు చొప్పున ఖాతాల్లో జమ చేస్తున్న బీసీ సంక్షేమశాఖ...ఆ తర్వాత రెండోవిడత చెల్లింపులపై చేతులెత్తేసింది. దీంతో ఆ చెల్లింపులు క్రమంగా పేరుకుపోతున్నాయి. 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు సంబంధించి చాలామంది విద్యార్థులకు తొలివిడత నిధులు అందగా... 2022-23 విద్యా సంవత్సరం విద్యార్థులకు మాత్రం తొలివిడత నిధులు కూడా అందలేదు.

ఎర్రబెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య బృందం



ఎర్రబెల్లిలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో ఆదివారం వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్నవారికి చికిత్సలు అందించారు. 'ఇంటికో రోగి' శీర్షికన ఆదివారం సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ప్రత్యేక బృందాలను ఆదివారం ఉదయమే ఎర్రబెల్లి గ్రామానికి పంపించి అవసరమైన పరీక్షలు చేయించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మురికి కాలువలను శుభ్రం చేయించగా, మలేరియా విభాగం ఆధ్వర్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో వైరల్ ఫీవర్లు తగ్గేంత వరకు వైద్య బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తామన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఆర్.దుర్గయ్య తన సిబ్బందితో పాటు నిడమనూరు మండల వైద్య సిబ్బంది, ప్రత్యేక సిబ్బంది ఎర్రబెల్లికి చేరారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో వారం దరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.